

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, కలెక్టర్ మను చౌదరి..

పెన్ పవర్
తెలంగాణ రౌండప్

ధాన్యం పరిశీలిస్తున్న కలెక్టర్ మను చౌదరి..



- మేడ్చల్ జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో.. కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు..
- రైతుల కష్టాలను అర్థం చేసుకోవాలని అధికారులకు హెచ్చరిక..!
- టార్పాలిన్లు, సుత్తిలి బ్యాగుల కొరతకు అధికారులపై కలెక్టర్ ఆగ్రహం..
- రవాణా ఆలస్యంతో రైతుల ఇబ్బందులు.. వెంటనే లారీల ఏర్పాటుకు ఆదేశం..
- 15 కొనుగోలు కేంద్రాలకు 15 ప్యాడి క్లీనర్ మిషన్లు ఇవ్వాలని సూచన..
- ధాన్యం కొనుగోలు వెంటనే ఆన్‌లైన్ డాటా ఎంట్రీతో రైతుల ఖాతాలో చెల్లింపులు..
- తూకం, నిల్వ, రవాణాలో నిర్లక్ష్యం సహించబోమన్న కలెక్టర్ మను చౌదరి..

# ధాన్యం కొన్న వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ : కలెక్టర్ మను చౌదరి..!

## -రవాణా సమస్యలు లేకుండా చూడాలని ఆదేశించిన కలెక్టర్..



**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, మే 19:** జిల్లాలోని వరి ధాన్యం కేంద్రాలను కలెక్టర్ మను చౌదరి ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు.. మంగళవారం ఘట్కేసర్ మండలంలోని మాదారం, ఏదిలాబాద్ గ్రామాలలో ధాన్యం సేకరణ కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డితో కలిసి కలెక్టర్ పరిశీలించారు.. జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై జిల్లా కలెక్టర్ మను చౌదరి తీవ్రంగా స్పందించారు.. ధాన్యం సేకరణ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల లోపాలు, రవాణా ఆలస్యం, టార్పాలిన్లు, సుత్తిలి బ్యాగుల కొరతపై అధికారులను కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు.. ఈ సందర్భంగా ఇప్పటివరకు ఎన్ని లారీల ద్వారా ధాన్యం తరలించారో, ఇంకా ఎంత ధాన్యం నిల్వ ఉన్నదో అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.. ధాన్యంలో తేమ శాతం, శుభ్రత ప్రమాణాలను స్వయంగా పరిశీలించారు.. ఆ సందర్భంగా రైతులతో నేరుగా మాట్లాడిన కలెక్టర్‌కు, పలు సమస్యలను వారు వివరించారు. ముఖ్యంగా టార్పాలిన్లు, సుత్తిలి బ్యాగులు తగినంతగా లేవని, రవాణాలో తీవ్ర ఆలస్యం జరుగుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో వెంటనే స్పందించిన కలెక్టర్ మను చౌదరి, రైతులకు అవసరమైన సామగ్రిని వెంటనే, సమకూర్చాలని సంబంధిత అధికారులను ఆదేశించారు..



**ఎప్పటికప్పుడు ధాన్యం తరలించాలి..**

జిల్లాలోని 15 ధాన్యం కొనుగోలు కేంద్రాలకు 15 ప్యాడి క్లీనర్ యంత్రాలను అందించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని సివిల్ సప్లై అధికారులకు సూచించారు. ధాన్యాన్ని ఎప్పటికప్పుడు కొనుగోలు కేంద్రాల నుంచి తరలించేలా లారీల కొరత లేకుండా చూడాలని ఆదేశించారు.. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.. ధాన్యం తూకం, నిల్వ, రవాణా వ్యవహారాల్లో నిర్లక్ష్యం సహించేది లేదని కలెక్టర్ మను హెచ్చరించారు..
ధాన్యం కొనుగోలు అనంతరం వెంటనే డాటా ఎంట్రీ ఆన్‌లైన్‌లో పూర్తి చేసి రైతుల ఖాతాల్లో సకాలంలో డబ్బులు జమయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.. అదేవిధంగా మిల్లుల వద్ద ధాన్యం త్వరగా అన్‌లోడింగ్ అయ్యేలా సమన్వయం చేయాలని తెలిపారు.. ఈ పరిశీలనలో సివిల్ సప్లై డీఎం సుగుణ బాయ్, డీసీఎస్‌ఓ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళ, తహసీల్దార్ చంద్రశేఖర్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# "లంబాడీల" ఆత్మగౌరవ పోరాటం..!

- సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణానికి 100 ఎకరాలు భూమికి డిమాండ్..
- రూ.1000 కోట్లు నిధులు కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి వద్ద నిరసన..

- బంజారాహిల్స్‌లో సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణానికి 100 ఎ. భూమికి..
- ఆలయ అభివృద్ధికి రూ.1000 కోట్ల నిధులు విడుదల చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి..
- సీఎం రేవంత్‌రెడ్డి నివాసం ముందు గిరిజన సంఘాలు నిరసన, అరెస్ట్..
- మే 30న శ్రీశైలం హైవేపై సడక్‌బంద్ కార్యక్రమం ప్రకటించిన సంఘాలు..
- జూన్15న కొండారెడ్డిపల్లె నుంచి హైదరాబాద్‌కి మహా పాదయాత్ర..



-4లో




# పెళ్లిళ్ళకు వారధిగా వైష్ణవ సేవాసమితి..! ఉచిత వేదికకు విశేష స్పందన..!

- ఆరవ వేదికలో పాల్గొన్న 170 మంది యువతీ యువకులు..!
- ఇప్పటికే 135 జంటల వివాహాలు విజయవంతం..!
- ఐదు వేదికలతోనే 135 జంటల వివాహాలు పలు రాష్ట్రాల నుంచి భగవత్ బంధువులు..
- పాల్గొన్న కుటుంబాలకు ఉచిత భోజన వసతి ఏర్పాటు..

-4లో



సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి వద్దకు ర్యాలీగా వెళ్తున్న లంబాడీలు..

# "లంబాడీల" ఆత్మగౌరవ పోరాటం..!

- సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణానికి 100 ఎకరాలు భూమికి డిమాండ్..
- రూ.1000 కోట్లు నిధులు కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి వద్ద నిరసన..

- బంజారాహిల్స్‌లో సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణానికి 100 ఎ. భూమికి..
- ఆలయ అభివృద్ధికి రూ.1000 కోట్ల నిధులు విడుదల చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి..
- సీఎం రేవంత్‌రెడ్డి నివాసం ముందు గిరిజన సంఘాలు నిరసన, అరెస్ట్..
- మే 30న శ్రీశైలం హైవేపై సడక్‌బంద్ కార్యక్రమం ప్రకటించిన సంఘాలు..
- జూన్15న కొండారెడ్డిపల్లె నుంచి హైదరాబాద్‌కి మహా పాదయాత్ర..

హైదరాబాద్, పెన్ పవర్, మే 19: హైదరాబాద్ బంజారాహిల్స్ ప్రాంతంలో లంబాడీల ఆరాధ్య దైవమైన సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణానికి 100 ఎకరాల భూమిని కేటాయించి, రూ.1000 కోట్ల నిధులు విడుదల చేయాలని గిరిజన విద్యార్థి సంఘం, లంబాడి హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసం ముందు నిరసన కార్యక్రమం నిర్వహించారు.. తెలంగాణ రాష్ట్రంలో లంబాడీల జనాభా మూడో స్థానంలో ఉన్నప్పటికీ, వారి ఆత్మగౌరవాన్ని కాపాడే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని, గిరిజన సంఘాల నాయకులు ఆరోపించారు.. రాష్ట్ర గిరిజన విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శి కుర్ర ప్రవీణ్ నాయక్ మాట్లాడుతూ, తెలుగు రాష్ట్రాల్లో అనేక దేవాలయాల నిర్మాణానికి రూ.లక్షల కోట్లు కేటాయించారని, ప్రతి గ్రామంలో దేవాలయాలు దర్శనమిస్తున్నప్పటికీ, లంబాడీల ఆరాధ్య దైవమైన సేవాలాల్ మహారాజ్ దేవాలయాల అభివృద్ధికి మాత్రం, ప్రభుత్వాలు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని విమర్శించారు.. లంబాడీ సమాజాన్ని ఐక్యపరచి, తండాలు, గూడాలను చైతన్యవంతం చేసిన మహనీయుడు సేవాలాల్ మహారాజ్ అని పేర్కొన్నారు.. బంజారాలు చారిత్రకంగా నివసించిన బంజారాహిల్స్ ప్రాంతంలోనే జగదంబయాడి సేవాలాల్ మహారాజ్ ఆలయాన్ని నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు.. అదేవిధంగా, మే 30న శ్రీశైలం హైవేపై సడక్ బంద్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రకటించారు. అలాగే జూన్ 15న కొండారెడ్డిపల్లె నుంచి మహా పాదయాత్ర ప్రారంభించి, హైదరాబాద్ అమరవీరుల స్తూపం వద్ద ముగింపు కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో గిరిజన విద్యార్థి సంఘం, లంబాడి హక్కుల పోరాట సమితి ప్రతినిధులతో పాటు వివిధ ప్రజా సంఘాలు, సామాజిక సంస్థల నాయకులు, లంబాడీ బంజారా సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


గిరిజన నిరసన కారులను పోలీసులు అరెస్ట్..




# పెళ్లిళ్ళకు వారధిగా వైష్ణవ సేవాసమితి..!
# ఉచిత వేదికకు విశేష స్పందన..!

- ఆరవ వేదికలో పాల్గొన్న 170 మంది యువతీ యువకులు..!
- ఇప్పటికే 135 జంటల వివాహాలు విజయవంతం..!
- ఐదు వేదికలతోనే 135 జంటల వివాహాలు పలు రాష్ట్రాల నుంచి భగవత్ బంధువులు..
- పాల్గొన్న కుటుంబాలకు ఉచిత భోజన వసతి ఏర్పాటు..

హైదరాబాద్, పెన్ పవర్, మే 19: హైదరాబాద్‌లో జరిగిన శ్రీ వేంకటేశ్వర చాత్తాద శ్రీ వైష్ణవ సేవాసమితి ఆరవ ఉచిత వివాహ పరిచయ వేదికకు విశేష స్పందన లభించింది.. 170 మంది యువతీ యువకులు పాల్గొని, తమ జీవిత భాగస్వామి అన్వేషణలో కొత్త ఆశలకు నాంది పలికారు..శ్రీ వేంకటేశ్వర చాత్తాద శ్రీ వైష్ణవ సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరవ ఉచిత వివాహ పరిచయ వేదిక కార్యక్రమం ఘనంగా జరిగింది. హైదరాబాద్‌లోనిలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పలు రాష్ట్రాల నుంచి భగవత్ బంధువులు భారీ సంఖ్యలో హాజరై విశేష స్పందన లభించిందని అన్నారు.. మండుటెండలను సైతం లెక్కచేయకుండా యువతీ యువకులు, వారి కుటుంబ సభ్యులు పెద్దఎత్తున పాల్గొనడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.. సేవాసమితి ప్రతి సంవత్సరం రెండు సార్లు ఉచిత వివాహ పరిచయ వేదికలను నిర్వహిస్తూ సమాజానికి సేవలందిస్తోంది. ఇప్పటికే నిర్వహించిన ఐదు వేదికల ద్వారా 135 జంటల వివాహాలు విజయవంతంగా జరిగినట్లు నిర్వాహకులు తెలిపారు. దీంతో వందలాది కుటుంబాలు ఆత్మీయ బంధాలతో ఒక్కటయ్యాయని పేర్కొన్నారు..

## భాగస్వామి గుణగణాలు ఇలా ఉండాలని వేదికపై చర్చ..

తాజాగా నిర్వహించిన ఆరవ వేదికలో సుమారు 50 మంది యువతులు, 120 మంది యువకులు పాల్గొని తమ వ్యక్తిగత వివరాలను పరిచయం చేసుకున్నారు. అలాగే తాము ఆశించే జీవిత భాగస్వామి లక్షణాలు, గుణగణాలు ఈ విధంగా ఉండాలని వేదికపై వెల్లడించారు.. ఈ పరిచయ వేదికకు హాజరైన కుటుంబ సభ్యులు, భగవత్ బంధువులు హర్షం వ్యక్తం చేశారు.. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆహ్లాదకర వాతావరణంలో సాగిన ఈ కార్యక్రమంలో సుమారు 600 మంది వరకు పాల్గొన్నారు. కార్యక్రమానికి హాజరైన కర్పూరం గోపీధర్, మాచవరం వెంకటేశ్వర్లు, డా. జగదీశ్వర్ తదితరులు సేవాసమితి చేపడుతున్న సేవా కార్యక్రమాలను ప్రశంసించారు.. కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో పరాంకుశం లక్ష్మణ స్వామి, బోధనం పరాంకుశం, రామానుజం గిరిధర్, తిరునగరి నరసింహం, పట్లూరి వెంకటేశ్వర్లు, రేబల్లి శ్రీకాంత్, రామానుజం యాదగిరి, శ్రీరంగం పాండురంగం, అనురాధ, రమాదేవి తదితరులు కీలక పాత్ర పోషించారు..

# ఆవిర్భావ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు



**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్ ఉన్నతాధికారులను ఆదేశించారు. మంగళవారం సెక్రెటేరియట్‌లో సంబంధిత అధికారులతో ఏర్పాట్లపై సమీక్షించారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఈసారి సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ముందుగా గన్‌పార్క్‌ను సందర్శించి తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద అమరవీరులకు నివాళులర్పించిన అనంతరం పరేడ్ గ్రౌండ్ వేడుకల్లో పాల్గొంటారని తెలిపారు. పరేడ్ గ్రౌండ్, గన్ పార్కు వద్ద చేయాల్సిన ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. ఏర్పాట్లపై ప్రతి శాఖ నుంచి ఒక నోడల్ అధికారిని నియమించి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రముఖులు ప్రయాణించే మార్గాలలో అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని, ముఖ్యంగా పరేడ్ గ్రౌండ్‌కు వచ్చే వాహనాలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పార్కింగ్ ఏర్పాట్లు చేసి ట్రాఫిక్ రూట్ మ్యాప్‌ను సిద్ధం చేసి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూడాలని పోలీసు శాఖను ఆదేశించారు.

వాటర్ ప్రూఫ్ షామియానాలు, బారికేడ్లు ఏర్పాటు చేయాలని ఆర్అండ్‌బీ శాఖను ఆదేశించారు. సభా ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య పనుల నిర్వహణతోపాటు తాగునీటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. పండుగ వాతావరణాన్ని తలపించేలా కళాకారులతో ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని సాంస్కృతిక శాఖను ఆదేశించారు. నిరంతర విద్యుత్ సరఫరా, జనరేటర్, నగరంలోని ప్రముఖ ప్రదేశాలైన అసెంబ్లీ, సచివాలయం, చార్మినార్, ప్రజాభవన్, ఇతర ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. విస్తృతంగా ప్రచారం చేసేందుకు లైవ్ టెలికాస్ట్ ఏర్పాట్లు చేయాలని సమాచార శాఖ స్పెషల్ కమిషనర్‌ను ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని సక్సెస్ చేయాలన్నారు. ఈ నెల 25వ తేదీ నుంచి పరేడ్ గ్రౌండ్ వద్ద అన్ని విభాగాలు సంయుక్తంగా రిహార్సల్స్ చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు నవీన్ మిట్టల్, హోంశాఖ ముఖ్య కార్యదర్శి శిఖాగోయల్, కార్యదర్శి రఘునందన్ రావు, డీజీపీ (లా అండ్ ఆర్డర్) మహేశ్ భగవత్, ఏడీజీ (ఇంటెలిజెన్స్) విజయ్‌కుమార్, టీజీ జెన్కో సీఎండీ హరీశ్, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ ముకుందరెడ్డి, జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి, ఇతర పోలీసు ఉన్నతాధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఏళ్ల వరకు ఉద్యోగాలకు అర్హత

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న లక్షల మంది నిరుద్యోగులకు రేవంత్ సర్కారు గుడ్ న్యూస్ చెప్పింది. రాష్ట్ర ప్రభుత్వ సర్వీస్‌ల్లో ప్రత్యక్ష నియామకాల కోసం నిర్దేశించిన గరిష్ట వయోపరిమితిని మరో 10 ఏళ్లపాటు పెంచుతూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణారావు జీవో జీవో నెంబర్ 86 నుంచి విడుదల చేశారు. ఈ నిర్ణయంతో ఇప్పటి వరకు 34 ఏళ్లుగా ఉన్న గరిష్ట వయోపరిమితి ఇప్పుడు 44 ఏళ్లకు చేరుకుంది. ఈ పెంపు కేవలం ఒక ఏడాదిపాటు అమలులో ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇప్పుడు కొత్తగా వచ్చిన జీవో ప్రకారం ఓసీ అభ్యర్థులు 44 ఏళ్ల వరకు ప్రభుత్వ ఉద్యోగాలకు అప్లై చేసుకోవచ్చు. మిగతా కేటగిరిల రిజర్వేషన్ బట్టి వారి వయోపరిమితి పెరుగుతుంది.

**వయపరిమితి పెంచడానికి కారణమేంటీ?**

తెలంగాణ రాష్ట్ర అండ్ సబార్డినేట్ సర్వీస్ రూల్స్, 1996 ప్రకారం... ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల గరిష్ట వయోపరిమితి 34 ఏళ్లుగా నిర్ణయించారు. అయితే రాష్ట్రంలో నెలకొన్న నిరుద్యోగ సమస్య, నోటిఫికేషన్ల జారీలో జరిగిన ఆలస్యం దృష్ట్యా, అభ్యర్థులు వయసు దాటిపోతున్నామనే ఆందోళనలో ఉన్నారు. దీనిని పరిగణలోకి తీసుకున్న ప్రభుత్వ, రాబోయే ఒక ఏడాది కాలంలో ఇచ్చే నోటిఫికేషన్లకు పదేళ్ల వయసు అదనపు సడలింపును ప్రకటించింది. అంటే ఓపెన్ కేటగిరి అభ్యర్థులు 44 ఏళ్ల వయసు వరకు పోటీ పడవచ్చు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర రిజర్వేషన్ వర్గాలకు ఈ 44 ఏళ్లకు అదనంగా వారి వారి కేటగిరి సడలింపు వర్తిస్తాయి. ఈ వయోపరిమితి పెంపునకు కారణాలు రెండు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లక్షల మంది నిరుద్యోగ యువత, తాము వయోపరిమితి ముగిసే దశలో ఉన్నామని, గత కొన్నేళ్లుగా సరైన నోటిఫికేషన్లు లేకపోవడం వల్ల తమకు అవకాశం కల్పించాలని ప్రభుత్వానికి అనేక విజ్ఞప్తులు పంపారు. వారి భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. గతంలో ఫిబ్రవరి 8, 2024న ప్రభుత్వం జీవో నంబర్ 30ని విడుదల చేసింది. ఆ సమయంలో వయోపరిమితిని పదేళ్లకు అదనంగా మరో రెండేళ్లు పెంచి మొత్తం 46 ఏళ్లకు పెంచారు. అయితే ఈ జీవో గడువు 2026 ఫిబ్రవరితో ముగిసింది. దీంతో వయోపరిమితి మళ్లీ ప్రాథమిక స్థాయి అయిన 34 ఏళ్లకు పడిపోయింది. ఈ గ్యాప్‌ను భర్తీ చేయడానికి, కొత్త నోటిఫికేషన్లలో అభ్యర్థులకు అవకాశం కల్పించడానికి ప్రభుత్వం కొత్త జీవోను తీసుకొచ్చింది. జీవో నెంబర్ 86 ప్రకారం, ఈ పదేళ్ల వయోపరిమితి సడలింపు ఉత్తర్వులు జారీ చేసిన తేదీ నుంచి ఒక ఏడాదిపాటు మాత్రమే అమలులో ఉంటాయి. ఈ ఏడాది కాలంలో వివిధ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీలు విడుదల చేసే నోటిఫికేషన్లకు మాత్రమే ఈ సడలింపు వర్తిస్తుంది. ఈ సడలింపు అన్ని ప్రభుత్వం ఉద్యోగులకు వర్తించదు. ప్రభుత్వం స్పష్టంగా పేర్కొన్నట్టుగా, సివిల్ ఉద్యోగాలు, గ్రూప్స్, సెక్రటేరియట్ పోస్టులు ఇతర సాధారణ ప్రభుత్వ ఉద్యోగాలకు ఇది వర్తిస్తుంది. పోలీసు, ఎక్సైజ్, ఫైర్, జైళ్ల శాఖ వంటి యూనిఫామ్ సర్వీసులకు ఈ వయోపరిమితి పెంపు వర్తించదని ప్రభుత్వం క్లారిటీ ఇచ్చింది.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు'
'పొ. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

## అన్యాయంగా ఇల్లు కూల్చివేస్తున్నారు

**సికింద్రాబాద్ పెన్ పవర్:** ఎటువంటి అనుమతులు ఇంటిని కూల్చి వేస్తూ తమ భద్రతకు, ప్రాణాలకు హాని కలిగిస్తున్న వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని సీతాఫల్ మండి, శ్రీనివాస్ నగర్ కాలానికి చెందిన తల్లి కూతుర్లు ప్రభుత్వానికి, పోలీస్ అధికారులకు విజ్ఞప్తి చేసారు. శ్రీనివాస్ నగర్ కు చెందిన పద్మావతి కూతురు ఐశ్వర్య మాట్లాడుతూ తన తాతగారికి చెందిన స్థలం ఇది అని 2009లో వారు చనిపోయారని తెలిపారు. ఐతే అందులో 120గజాలు తన బాబాయి గిఫ్ట్ డీడ్ చేసుకున్నాడని దానిని డిస్మిస్ చేయాలని కోర్టులో దావా వేయడం జరిగిందన్నారు. కోర్టులో కేసు నడుస్తుండగానే సురేందర్ అనే వ్యక్తి ఆ స్థలాన్ని కొనుక్కోవడం జరిగిందని పేర్కొన్నారు. కోర్టు పరిధిలో ఉన్న విషయం తెలిసి కూడా కొన్న నేపథ్యంలో సురేందర్ ను కూడా ఇందులో నిందితుడిగా పిర్యాదు చేయడం జరిగిందని చెప్పారు. ఇంటి నెంబర్ కు బై నెంబర్ కలిపి కోర్టును సైతం తప్పు దారి పట్టించి ఇంట్లోకి ప్రవేశించే హక్కును పొందడం జరిగిందని తెలిపారు. గత కొన్ని రోజులుగా ఇట్టి ఇంటిని కూల్చి వేసే ప్రయత్నం చేస్తున్నారని, ఇట్టి ఇంటిని కూల్చివేస్తే రెండు ఇళ్ల స్లాబ్ ఒకే పిల్లర్ పైన ఉండడంతో తమ ఇల్లు కూడా పూర్తిగా కూలిపోతుందని వాపోయారు. నాలుగు రోజుల క్రితం కూల్చే ప్రయత్నాన్ని తాము అడ్డుకోవడం జరిగిందని, ఈ రోజు ఏకంగా జేసీబీ తో రావడమే కాకుండా పెద్ద గ్యాంగ్ తో వచ్చి తమపై దౌర్జన్యానికి పాల్పడ్డారని వివరించారు. చట్టాలను అతిక్రమించి ప్రవర్తిస్తున్న ఇట్టి వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకొని తమకు రక్షణ కల్పించాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు.

## ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో గరిష్ఠ వయోపరిమితి పెంపు

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో గరిష్ఠ వయోపరిమితిని ప్రభుత్వం మరో ఏడాది పొడిగించింది. గరిష్ఠ వయోపరిమితి 44 సంవత్సరాలకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులు ఏడాది పాటు అమల్లోకి ఉంటాయని జీవోలో పేర్కొంది. పోలీసు తదితర యూనిఫామ్ సర్వీస్ లకు సడలింపు వర్తించదని ప్రభుత్వం స్పష్టం చేసింది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత గరిష్ఠ వయోపరిమితిని పదేళ్ల పాటు సడలించారు. ఆ తర్వాత మరో రెండేళ్లు పొడిగించారు. ఆ గడువు కూడా ముగియడంతో నిరుద్యోగుల అభ్యర్థన మేరకు ప్రభుత్వం మరో ఏడాది పొడిగిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.

## రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ ను కలిసిన టిపిసిసి ఎలక్షన్ కమిషన్ కో-ఆర్డినేషన్ కమిటి సభ్యులు

**హైద్రాబాద్ మే 19 పెన్ పవర్:**

తెలంగాణ రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ సెక్రటరీ లింగ్య నాయక్ ని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎలక్షన్ కమిషన్ కో–ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ పులిపాటి రాజేష్ కుమార్ మరియు సభ్యులు కలవడం జరిగినది.

ఇటీవల రాష్ట్ర ఎలక్షన్ కమీషనర్ ఆదేశాల మేరకు హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి చుడి బజార్ లోని ఈసీఐఎల్ ఇంజనీర్లచే ఈవీఎం లను చెకింగ్/ఎఫ్ ఎల్ సి ప్రక్రియ ప్రారంభించడం జరిగినది.

రాబోయే జడ్పీటీసీ, ఎంపీటీసీ మరియు కార్పొరేషన్ ఎలక్షన్ కోసంఉపయోగించనున్న ఈ వీ2 మోడల్ ఈవీఎం మాషింలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు

రాబోయే జడ్పీటీసీ, ఎంపీటీసీ, మున్సిపల్ కార్పొరేషన్ల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బ్యాలెట్ ఓటింగ్ విధానానికే ప్రాధాన్యం ఇస్తుందని తెలపడం జరిగినది, ఒకవేళ, ఈవీఎంతో ఎన్నికలు జరిగితే, వీ2 మోడల్ మెషీన్లను ఉపయోగించడాన్ని మేము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఎందుకంటే ఈ వీ2 మోడల్ ఈవీఎం లకు వివిపిఏటీ ( ఎశీవతీ ఎవతీఱటఱఎశ్రీవ్ఞుజావతీ-ాబఎఱ్ ఱతీఝఱశ్రీ ) సౌకర్యం లేదు, ఓటర్లు ఇచ్చిన ఓటు సరిగ్గా వారు ఇష్టపడే అభ్యర్థికి పోయిందో తెలుసుకునే సౌకర్యం లేదు అందువలన ఎన్నికలకు బ్యాలెట్ పేపర్‌ను వినియోగించాలని కోరారు. ఈ సమావేశంలో టీపీసీసీ ఎలక్షన్ కమిషన్ కో ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ పులిపాటి రాజేష్ కుమార్, సభ్యులు సింగిశెట్టి జగదీశ్వర్ రావు, గోపిశెట్టి రాఘవేందర్, టీ. రేవతి గౌడ్, కాసభ శ్రీనివాస్ రావు పాల్గొనడం జరిగినది.

## జలమండలి జీఎం కుమార్ ఇళ్లపై ఏసీబీ దాడులు.. కుప్పలుగా నోట్ల కట్టలు, 100 కోట్ల ఆస్తులు గుర్తింపు !

**హైదరాబాద్, మే 19, పెన్ పవర్:** తెలంగాణలో అవినీతి అధికారులపై ఏసీబీ ఫోకస్ చేసింది. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ అధికారి లక్ష్యంగా యాంటీ కరప్షన్ బ్యూరో ( అధికారులు దాడులు చేపట్టారు. రెడ్ హిల్స్ జలమండలి జనరల్ మేనేజర్ అనంత లక్ష్మి కుమార్ లక్ష్యంగా ఏసీబీ అధికారులు మంగళవారం ఉదయం ఆకస్మిక దాడులు చేపట్టారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 8 విభిన్న ప్రాంతాలలో ఏకకాలంలో ఈ సోదాలు కొనసాగుతున్నాయి. మల్లాపూర్‌లోని జీఎం కుమార్ స్వగృహంలో ఏసీబీ డీఎస్పీ మజీద్ అలీ ఖాన్ స్వయంగా రంగంలోకి దిగి ఈ తనిఖీలను పర్యవేక్షిస్తున్నారు. జలమండలి జీఎం కుమార్ నివాసంతో పాటు ఆయనకు అత్యంత సమీప బంధువుల ఇళ్లలోనూ సోదాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ తనిఖీల్లో అధికారులకు భారీ ఎత్తున నగదు పట్టుబడింది. ఇంట్లో కుప్పలుగా పడి ఉన్న నోట్ల కట్టలను చూసి ఏసీబీ అధికారులే ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురయ్యారు. స్వాధీనం చేసుకున్న నగదు అత్యధికంగా ఉండటంతో, దానిని ఖచ్చితంగా లెక్కించేందుకు అధికారులు ప్రత్యేకంగా క్యాష్ కౌంటింగ్ మెషీన్లను తెప్పించారు. జలమండలి మేనేజర్ అనంత లక్ష్మి కుమార్ నివాసాల్లో ఏసీబీ అధికారులు తనికీల్లో 100 కోట్ల ( మార్కెట్ విలువ ప్రకారం ) ఆస్తులు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. మల్లాపూర్ తో పాటు బంధువుల నివాసాల్లో సోదాలు కొనసాగుతున్నాయి. ఇంట్లో కోటి 10 లక్షల నగదుతో పాటు సుమారు 1 ఖ+ బంగారు ఆభరణాలు గుర్తించారు. లభ్యమైన డాక్యుమెంట్స్ ప్రకారం హైదరాబాద్ లో గేటెడ్ కమ్యూనిటిలలో 3 ఫ్లాట్స్.. 6 ఓపెన్ ఫ్లాట్స్ ఉన్నాయి. నిజామాబాద్ లో 3 ఎకరాల భూమి ఉంది. మరికొన్ని ప్రాంతాల్లో భారీగా ఆస్తులు ఉన్నాయని ఏసీబీ అధికారులు గుర్తించారు. బ్యాంక్ లాకర్స్ ఓపెన్ చేసి అందులో ఏముందో చెక్ చేయనున్నారు. పట్టుబడిన ఈ భారీ నగదు, ఇతర ఆస్తుల వివరాలకు సంబంధించిన డాక్యుమెంట్లపై దర్యాప్తు బృందం ప్రస్తుతం ఆరా తీస్తోంది. ఈ దాడులకు సంబంధించిన పూర్తి వివరాలు, లభించిన మొత్తం ఆస్తుల విలువ ఎంత అనేది సోదాలు ముగిసిన అనంతరం అధికారులు అధికారికంగా వెల్లడించనున్నారు. జీఎం కుమార్ స్థిర, చరాస్తుల వివరాలపై అధికారులు ఆరా తీస్తున్నారు.

## హోటళ్లు,లాడ్జీల యాజమాన్యాలు అలర్ట్‌గా ఉండాలి: సిపి గౌస్ ఆలం

**కరీంనగర్ పెన్ పవర్:** కరీంనగర్ నగరంలో ఇటీవల పీఎంజే జ్యువెలరీలో జరిగిన భారీ దోపిడీ ఉదంతాన్ని పురస్కరించుకుని కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని హోటళ్లు,లాడ్జీల యజమానులు, నిర్వాహకులతో కరీంనగర్ కమీషనరేట్ కేంద్రంలోని అస్త్ర కన్వెన్షన్ హాలునందు పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ. ఆయుధాలతో కూడిన ఓ అంతర్రాష్ట్ర దొంగల ముఠా నకిలీ ఆధార్ కార్డులు, తప్పుడు ఫోన్ నంబర్లు, తప్పుడు చిరునామాలు ఇచ్చి నగరంలోని పలు హోటళ్లలో దాదాపు రెండు నెలల పాటు బస చేసి, నిఘా రెక్కి నిర్వహించినట్లు పోలీసుల విచారణలో తేలిందన్నారు. ఈ నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల భద్రతే ధ్యేయంగా పోలీస్ కమిషనరేట్ వ్యాప్తంగా కఠినమైన మార్గదర్శకాలను జారీ చేస్తున్నామని తెలిపారు.



**హోటళ్లు, లాడ్జీలకు ముఖ్య సూచనలు:**

ఖచ్చితమైన గుర్తింపు నిరూపణ హోటల్ లేదా లాడ్జీలలో రూములు కేటాయించే ముందు ప్రభుత్వ గుర్తింపు కార్డులను క్షుణ్ణంగా పరిశీలించాలి. కేవలం ఆధార్ కార్డులను గుడ్డిగా నమ్మకుండా,అందులోని ఫోటో,వయస్సు, చిరునామా అసలైనవా కాదా అని సరిచూసుకోవాలి. అవసరమైతే అదనపు గుర్తింపు కార్డులను అడగాలన్నారు.

యాక్టివ్ మొబైల్ నంబర్ వెరిఫికేషన్: కస్టమర్లు ఇచ్చే మొబైల్ నంబర్ పనిచేస్తుందో లేదో క్రాస్–చెక్ చేసుకోవాలి. అది సదరు వ్యక్తి పేరు మీద ఉందో లేదో నిర్ధారించుకోవాలి. విదేశీయులు వస్తే నిబంధనల ప్రకారం తక్షణమే సమాచారం అందించాలి. సీసీటీవీ నిఘా రికార్డుల నిర్వహణ. ప్రతి హోటల్‌లో హై–రెజల్యూషన్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి. కనీసం 90 రోజుల ఫుటేజీని భద్రపరచాలి. గెస్ట్ రిజిస్టర్, ఐడీ ప్రూఫ్స్, వాహనాల వివరాలు, చెక్–ఇన్ చెక్–అవుట్ సమయాలను డిజిటల్ రూపంలో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలి. అనుమానాస్పద కదలికలపై నిఘా,లగేజీ లేకుండా రూమ్ తీసుకునేవారు, ఆయుధాలు లేదా అనుమానాస్పద బ్యాగులతో వచ్చేవారు, సీసీ కెమెరాల ముందుకు రాకుండా తప్పించుకునే వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలి. భారీ నగదు లావాదేవీలు చేసే వారి వివరాలను వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు చేరవేయాలి.

## ధాన్యం తరలింపు అన్ లోడింగ్ లో మరింత వేగం పెంచాలి: జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

**రాజన్న సిరిసిల్ల పెన్ పవర్:** ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం తరలింపు రైస్ మిల్లులు, గోదాముల్లో అన్ లోడింగ్ లో మరింత వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.

కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం తరలింపు, అన్ లోడింగ్, ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ, రైతులు, హమాలీలకు ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలు, తదితర అంశాలపై మంగళవారం ఉదయం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి పౌర సరఫరాల, సహకార శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, మెప్మా ఇతర శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.

జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం తూకం వేయడం, తూకం వేసిన ధాన్యాన్ని నిర్దేశించిన మిల్లులు, గోదాములకు తరలించడంపై అధికారులు దృష్టి సారించి, క్షేత్ర స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని, కొనుగోళ్ళ ప్రక్రియ సజావుగా పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు.

కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యం బస్తాలను తరలించేందుకు సరిపడా వాహనాలను ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లు సమాకూర్చాలని స్పష్టం చేశారు.



కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం లోడింగ్ కోసం, మిల్లులు, అపరల్ పార్క్ లో ధాన్యం అన్ లోడింగ్ చేయడం కోసం హమాలీల సంఖ్యను మరింత పెంచాలని సూచించారు.

ఎండ తీవ్రత దృష్ట్యా కొనుగోలు కేంద్రాల్లో రైతులు, హమాలీలు అలాగే అన్ లోడింగ్ చేసే మిల్లులు, గోదాముల్లో హమాలీలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని,తాగు నీరు,ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు అందుబాటులో పెట్టాలని సూచించారు. ఇంకా జిల్లాలో ఉన్న గోదాములను ధాన్యం అన్ లోడింగ్ చేసేందుకు సిద్ధం చేయాలని ఆదేశించారు.

రైతుల నుంచి సేకరించిన ధాన్యానికి సంబంధించిన ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ జాప్యం చేయవద్దని డీఆర్డీఓ,డీసీఓ, ఏవో మెప్మా, ఇతర అధికారులను ఆదేశించారు. ఆయా మండలాలకు చెందిన సంబంధిత అధికారులు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ వేగవంతం చేసేలా పర్యవేక్షణ చేయాలని సూచించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సంబంధిత శాఖల అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు తప్పనిసరిగా తనిఖీలు చేస్తూ సూచనలు చేయాలని సూచించారు.

## నైపుణ్యాభివృద్ధితో ఎన్నో అవకాశాలు

**రాజన్న సిరిసిల్ల పెన్ పవర్:** నైపుణ్యాభివృద్ధితో ఎన్నో అవకాశాలు వస్తాయని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 23వ తేదీ వరకు నిర్వహించనున్న యువజన క్రీడా వారోత్సవాల సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మంగళవారం నైపుణ్యాభివృద్ధిపై అవగాహన సదస్సు నిర్వహించగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జయ జయహే తెలంగాణ పాటను వినిపించారు. ఈ సందర్భంగా వివిధ శిక్షణ సంస్థలు ఐటీఐ, అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్, ఆర్ సేటీ, జీఎంఆర్, ఐడీటీఆర్, టాస్క్, ఇతర సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించి.. ఏ ఏ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు? అర్హత ఇతర అంశాలపై జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి మార్చి 6వ తేదీన ప్రజా పాలన –ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. ఇందులో భాగంగా జూన్ 12వ తేదీ వరకు 10 శాఖల ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నెల 23వ తేదీ వరకు నిర్వహించనున్న యువజన క్రీడా వారోత్సవాలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. దేశ, రాష్ట్ర అభివృద్ధిలో నేటి యువత, విద్యార్థులు చాలా కీలకమని స్పష్టం చేశారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు



ఇటీవల విద్యా శాఖ వారోత్సవాల కింద సమ్మర్ క్యాంపులు నిర్వహించామని, విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఎన్నో అంశాల్లో ప్రతిభ చూపారని గుర్తు చేశారు. విద్యతోపాటు ఆటలు ఆడాలని, దీంతో శారీరక, మానసిక సమతుల్యత ఉంటుందని, క్రమ శిక్షణ అలవడుతుందని వివరించారు. ఉన్నత చదువుతోపాటు టెక్నికల్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్ నేర్చుకోవాలని సూచించారు. ఇప్పటి పరిశ్రమలకు ఎలాంటి స్కిల్స్ అవసరమో తెలుసుకొని ఆ దిశలో ముందుకు వెళ్లాలని పిలుపు నిచ్చారు. ఐటీఐ, అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్, ఆర్ సేటీ, జీఎంఆర్, ఐడీటీఆర్, టాస్క్ తదితర సంస్థల్లో అందిస్తున్న ఉచిత శిక్షణ కోర్సులను సద్విని యోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. పూర్తి వివరాలకు ఆయా సంస్థల్లో సంప్రదించాలని సూచించారు. అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ లో శిక్షణ పొందిన వారికి పలు సంస్థలు ఉపాధి కల్పిస్తాయని తెలిపారు. పరిశ్రమల శాఖ, ఇతర ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో అందిస్తున్న స్వయం ఉపాధి స్కీములు, సబ్సిడీ సద్వినియోగం చేసుకొని.. స్వయం యువత ఉపాధి పొందాలని ఆకాంక్షించారు. జిల్లాలోని వివిధ శిక్షణ సంస్థలు ఏడాది అంతా యువతకు శిక్షణ అందించేలా ప్రణాళిక రూపొందించి ముందుకు వెళ్లాలని సూచించారు. నర్సింగ్ పూర్తి చేసి.. విదేశాల భాష, నైపుణ్యాల్లో పట్టు ఉన్న వారికి టామ్ కామ్ ఆధ్వర్యంలో వివిధ దేశాల్లో ఉపాధి కల్పన అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు. జిల్లా నుంచి ఇప్పటిదాకా 45 మందికి విదేశాల్లో కొలువులు వచ్చాయని తెలిపారు. నర్సింగ్ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. యువత ఉపాధిని పొంది తమ తల్లితండ్రుల సంరక్షణ బాధ్యతను చూసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. కార్యక్రమంలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, సీపీఓ శ్రీనివాసాచారి, జీఎం ఇండస్ట్రీస్ హనుమంతు, డీవైఎస్ఓ రాందాస్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు భాగ్య, ఎల్డీఎం మల్లికార్జున రావు తదితరులు పాల్గొన్నారు

# రియల్ ఎస్టేట్ లో పుష్పరాజ్...

**హైదరాబాద్, మే 19, పెన్ పవర్:**
ఆయన ఒకప్పుడు కలెక్టర్ గా పని చేశారు. తన తెలివితేటలతో భారీగా భూములు సంపాదించారు. హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతంలో విపరీతంగా భూములు కొన్నారు. ఆ భూములు ఇప్పుడు వేలకోట్ల ఆస్తులు అయ్యాయి. కలెక్టర్ గా ఉన్నప్పుడు ఇప్పటి ముఖ్యమంత్రికి ఆయన పాదాభివందనం కూడా చేశారు. కలెక్టర్ ఉద్యోగానికి స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. ఓ రాజకీయ పార్టీలో చేరారు. ఇప్పుడు ఏకంగా ఎమ్మెల్సీగా పనిచేస్తున్నారు.ఇప్పుడు ఆయన చేతిలో ఎన్నో కీలకమైన ప్రాజెక్టులు ఉన్నాయి. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్ దగ్గర ఉన్న ఓ కాస్ట్లీ ప్రాంతంలో ఎకరం భూమిని ఆయన ఏకంగా 100 కోట్లు పెట్టి కొన్నారు. ఇటువంటి కోట్లు ఆయనకు లెక్క కావు. లెక్కలోకి కూడా రావు. ఇప్పుడు ఏకంగా ఆయన దాదాపు పదికి మించిన ప్రాజెక్టులను చేతుల్లో పెట్టుకున్నారు. తెల్లాపూర్ ప్రాంతంలో 13 ఎకరాల విస్తీర్ణంలో అపార్ట్మెంట్ నిర్మించారు. ఇందులో 1500 ప్లాట్లు అందుబాటులో ఉన్నాయి. ఇదే తెల్లాపూర్లో మరో చోట 24 ఎకరాల్లో బహుళ అంతస్తులు నిర్మించారు. ఇందులో ఏకంగా మూడు వేల ప్లాట్లు అందుబాటులో ఉన్నాయి. తెల్లాపూర్ ప్రాంతంలో 21 ఎకరాల విస్తీర్ణంలో అతిపెద్ద అపార్ట్మెంట్ నిర్మించారు. ఇందులో కూడా 3500 ప్లాట్లు అందుబాటులో ఉన్నాయి. తెల్లాపూర్ ప్రాంతంలో ఏడు ఎకరాల విస్తీర్ణంలో అపార్ట్మెంట్ నిర్మించారు. ఇందులో 500 ప్లాట్లు అందుబాటులో వచ్చాయి.హైదరాబాద్ నగరంలో అత్యంత ఖరీదైన నియో పోలీస్ ఏరియాలో ఏడు ఎకరాలలో బహుళ అంతస్తులు నిర్మించారు. ఇదే ఏరియాలో 8 ఎకరాల విస్తీర్ణంలో 600 ప్లాట్లు నిర్మించారు. నార్సింగి, మంచిరేవుల, కోకాపేట, అత్తాపూర్, గచ్చిబౌలి వంటి ప్రాంతాలలో దాదాపు ఐదువేల ప్లాట్ల విస్తీర్ణంతో బహుళ అంతస్తులను నిర్మించారు. ఒక రకంగా తెలంగాణ రియల్ ఎస్టేట్లో ఒకప్పుడు ఆపర్ణ, మై హోమ్, జనప్రియ వంటి కంపెనీలు నెంబర్ వన్ స్థానంలో ఉండేవి. కానీ ఆ కంపెనీలను ఈ మాజీ కలెక్టర్ కంపెనీ దాటేసింది. హైదరాబాదులోనే దాదాపు పదివేల ప్లాట్ లకు మించిన సామర్థ్యంతో బహుళ అంతస్తులు నిర్మిస్తోంది. కొన్ని ప్రాంతాల్లో అయితే ఇప్పటికే భారీగా భూములను కొనేసింది. ఈ ప్రకారం చూసుకుంటే ఆ మాజీ కలెక్టర్ రియల్ ఎస్టేట్ బిజినెస్ లో పుష్ప రాజ్ లాగా అవతరించే అవకాశం ఉందని బిజినెస్ ఎక్స్పర్ట్స్ చెప్తున్నారు.ఆయన ఒక పార్టీ నుంచి ఎమ్మెల్సీగా గెలిచినప్పటికీ.. ఇప్పుడు అధికార పార్టీతో దగ్గరగా ఉంటున్నట్టుతెలుస్తోంది. పైగా అధికార పార్టీలో ఒక కీలక నాయకుడితో ఇటీవల బంధుత్వం కూడా పెంచుకున్నారని సమాచారం. అందువల్లే ఈ స్థాయిలో రియల్ ఎస్టేట్ వ్యాపారంలో దూకుడు కొనసాగిస్తున్నారని.. వేల కోట్లను సులభంగా సంపాదిస్తున్నారని టాక్ వినిపిస్తోంది. ఏది ఏమైనప్పటికీ ఏ ఎండకు ఆ గొడుగు పట్టడంలో ఈ మాజీ కలెక్టర్ సిద్ధహస్తుడని మార్కెట్ వర్గాలు చెవులు కోరుకుంటున్నాయి. చూడాలి మరి ఈ మాజీ కలెక్టర్ ఇంకా ఏ స్థాయిలో దూసుకుపోతారో.. ఇంకా ఏ రేంజ్ లో హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ ను తన చేతుల్లో పెట్టుకుంటారో..

# గ్రేటర్ ఎన్నికలకు గులాబీ ప్లాన్




**హైదరాబాద్, మే 19, పెన్ పవర్:**
గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ, భాగ్యనగర రాజకీయం అప్పుడే వేడెక్కింది. జీహెచ్ఎంసీ పీఠంపై మరోసారి గులాబీ జెండాను ఎగురవేయడమే లక్ష్యంగా బీఆర్ఎస్ తన వ్యూహాలకు పదును పెడుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అధిక స్థానాలను సాధించి తన పట్టును నిరూపించుకున్న బీఆర్ఎస్, అదే జోష్తో మున్సిపల్ ఎన్నికల బరిలోకి దిగేందుకు సమాయత్తమవుతోంది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్వయంగా రంగంలోకి దిగి, ఓటర్ల జాబితా సవరణ నుంచి సభ్యత్వ నమోదు వరకు ప్రతి అంశాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటూ కేడర్కు దిశానిర్దేశం చేస్తున్నారు.గత ఎన్నికల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, తమ పార్టీ సానుభూతిపరులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి గల్లంతు కాకుండా బీఆర్ఎస్ పకడ్బందీ చర్యలు చేపట్టింది.
కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియపై పార్టీ శ్రేణులను పూర్తిగా అలర్ట్ చేసింది. ఈ నెల 25 నుంచి ఈ ప్రక్రియ రాష్ట్రంలో ప్రారంభం కానుండటంతో, ప్రతి డివిజన్, పోలింగ్ బూత్ పరిధిలో ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలని కేటీఆర్ ఆదేశించారు.అయితే, ఈ ప్రక్రియను మానిటరింగ్ చేసేందుకు బూత్ లెవెల్ ఏజెంట్ల లిస్ట్ ఇవ్వాలని అధిష్టానం ఆదేశించగా, మొత్తం 119 నియోజకవర్గాల్లో 38 నియోజకవర్గాల నుంచి ఇంకా లిస్ట్ అందకపోవడంపై ఇటీవల పార్టీ అధినేత కేసీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాం హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలకు చెందిన ముఖ్య నేతలతో అత్యవసర సమావేశం నిర్వహించారు. గులాబీ క్యాడర్ బలంగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక ఫోకస్ పెట్టాలని స్పష్టం చేశారు. కొత్త ఓటర్ల నమోదు, తప్పుల సవరణ, అర్హులైన ఓటర్ల వద్ద అవసరమైన అర్హత పత్రాలు ఉండేలా చూసే బాధ్యతను ఈ బీఎల్ఏలకు అప్పగించారు.2018, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో బీఆర్ఎస్ అత్యధిక స్థానాలను కైవసం చేసుకుంది. గతంలో వరుసగా రెండు సార్లు గ్రేటర్ మేయర్ పీఠాన్ని కూడా దక్కించుకుంది. ఈ నేపథ్యంలో ఎస్ఐఆర్ ప్రక్రియ వల్ల ఈ జిల్లాల్లోని ఓటర్లు ఎక్కువగా ప్రభావితం అయ్యే అవకాశం ఉందని భావించి, ముస్లిం మైనారిటీ ఓటు బ్యాంకుపై పార్టీ ప్రత్యేక దృష్టి సారించింది. పాతబస్తీ మినహా మిగిలిన అన్ని ప్రాంతాల్లో మైనారిటీలు బీఆర్ఎస్ వైపే నిలిచారు. అందుకే, తమ పార్టీ ఎమ్మెల్యేలు ఉన్న చోటా, లేని చోటా బూత్ ల వారీగా బీఎల్ఏలను నియమించి సానుకూల ఓట్లను కాపాడుకునేందుకు క్షేత్రస్థాయి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశారు.ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే వరకు వేచి చూడకుండా, ప్రజల్లోనే ఉండాలని మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, డివిజన్ ఇంచార్జీలను కేటీఆర్ ఆదేశించారు. గ్రేటర్ పరిధిలోని ప్రధాన సమస్యలైన డ్రైనేజీ వ్యవస్థ లోపాలు, తాగునీటి ఎద్దడి, దెబ్బతిన్న రోడ్లు, స్థానిక మౌలిక వసతుల కల్పనలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు... లాంటి వాటిని ఎండగడుతూ ప్రజల్లోకి వెళ్లాలని దిశానిర్దేశం చేశారు. తెలంగాణ భవన్ వేదికగా కేటీఆర్ ఈ మొత్తం వ్యవహారాన్ని స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. దీనితో పాటు, డిజిటల్ పద్ధతిలో ప్రతి ఇంటిని టచ్ చేస్తూ ముమ్మరంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించాలని స్పష్టం చేశారు.ఎన్నికలకు ముందే వ్యూహాత్మక అడుగులు వేస్తూ, కేడర్లో జోష్ నింపుతున్న గులాబీ బాస్ ల చర్యలు గ్రేటర్ రాజకీయాల్లో సరికొత్త వేడిని పుట్టిస్తున్నాయి. రాబోయే మున్సిపల్ పోరులో గ్రేటర్ కోటపై మళ్లీ గులాబీ జెండా ఎగురుతుందో లేదో చూడాలి.


# ట్రాన్స్ ఫర్ చేసిన అరగంటలోనే రివర్స్...
# సైబారాబాద్ కమిషనరేట్ లో ఏం జరుగుతోంది

**హైదరాబాద్, మే 19, పెన్ పవర్:**
శాంతిభద్రతల పరిరక్షణలో రాష్ట్రంలోనే అత్యంత కీలకమైన, ప్రతిష్టాత్మకమైన సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ఇప్పుడు బదిలీల గందరగోళంలో కొట్టుమిట్టాడుతోంది. పరిపాలనా పరమైన సమన్వయ లోపమో, లేక అంతర్గత ఒత్తిళ్లకు తలొగ్గడమో తెలియదు కానీ, ఇటీవల తీసుకున్న కొన్ని నిర్ణయాలు పోలీస్ శాఖలోనే తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. కాగితాలపై బదిలీల ఫైళ్లు పరుగులు పెడుతున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం స్టేషన్లు వెలవెలబోతున్నాయి. ఫలితంగా సిబ్బంది కొరతతో ఐటీ కారిడార్లో పోలీసింగ్ వ్యవస్థ తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది.మే 2న సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఒకేసారి 65 మంది ఇన్స్పెక్టర్లను బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. సాధారణంగా ఇలాంటి భారీ బదిలీల వెనుక వారం రోజుల పాటు తీవ్రస్థాయిలో కసరత్తు జరుగుతుంది. కానీ, ఏమైందో ఏమో తెలీదు కానీ.. ఉత్తర్వులు వెలువడిన కొద్ది గంటల్లోనే ఆ ఆర్డర్లను నిలిపివేస్తూ (హోల్డ్లో పెడుతూ) మరో ఆదేశం రావడం డిపార్ట్మెంట్లో కలకలం రేపింది. ఆర్డర్ వచ్చింది.. సీట్ మారుతుందనుకునే లోపే బ్రేక్ పడింది'అంటూ ఇన్స్పెక్టర్లు సైతం తలలు పట్టుకునే పరిస్థితి వచ్చింది. ఈ వెనకడుగు వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయా? లేక అంతర్గత వ్యూహాత్మక లోపాలు ఉన్నాయా? అనే చర్చ జోరుగా సాగుతోంది.ఇన్స్పెక్టర్ల బదిలీల వ్యవహారం ఒక కొలిక్కి రాకముందే.. కమిషనరేట్ పరిధిలోని 32 మంది సబ్ఇన్స్పెక్టర్లను (ఎస్ఐలను) జోన్-6 చార్మినార్కు సరెండర్ చేస్తూ హుటాహుటిన ఉత్తర్వులు జారీ అయ్యాయి. పైగా, ఆర్డర్లు వచ్చిన వెంటనే వారందరినీ రిలీవ్ చేయడంతో వారంతా కొత్త ప్రాంతాల్లో రిపోర్ట్ చేయడానికి వెళ్ళిపోయారు.దీనికి బదులుగా హైదరాబాద్ సిటీ నుంచి మరో 32 మంది ఎస్ఐలను సైబరాబాద్కు కేటాయించాలనే ప్రతిపాదనలు అయితే సిద్ధం చేశారు కానీ, వారు క్షేత్రస్థాయిలో విధుల్లో చేరడానికి ఇంకా ముహూర్తం కుదరలేదు. వెళ్ళిన వారు వెళ్ళిపోయారు.. రావాల్సిన వారు రాలేదు. మధ్యలో స్టేషన్లలో ఉన్న సీట్లు ఖాళీగా ఉండిపోయాయి. దీనివల్ల మిగిలిన సిబ్బందిపై పనిభారం రెట్టింపు అయ్యింది.గ్లోబల్ సిటీగా ఎదుగుతున్న హైదరాబాద్కు గుండెకాయ లాంటి ఐటీ కారిడార్ పరిధిలోని పోలీస్ స్టేషన్లపై ఈ బదిలీల ప్రభావం తీవ్రంగా పడింది. మాదాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం, నార్సింగి, కూకట్పల్లి, బాచుపల్లి. అంతర్జాతీయ స్థాయి ఐటీ కంపెనీలు, లక్షలాది మంది ఉద్యోగుల రాకపోకలు, నిత్యం ట్రాఫిక్ జాంలు, వీఐపీల బందోబస్తులు, హై-ప్రొఫైల్ నేరాలు. ఇలాంటి అత్యంత సున్నితమైన, బిజీ స్టేషన్లలో ఎస్ఐల కొరత స్పష్టంగా కనిపిస్తోంది. శాంతిభద్రతల పరిరక్షణ,క్రైమ్ ఇన్వెస్టిగేషన్, రాత్రి పూట పెట్రోలింగ్, బాధితుల నుంచి ఫిర్యాదుల స్వీకరణ వంటి బాధ్యతలను కొద్దిమంది సిబ్బందే అదనపు షిఫ్టులు చేస్తూ నిర్వహించాల్సి వస్తోంది. సుదీర్ఘ గంటల పనివల్ల క్షేత్రస్థాయి సిబ్బంది తీవ్ర మానసిక, శారీరక ఒత్తిడికి లోనవుతున్నారు.సాధారణంగా పోలీసు సిబ్బంది లో ఒకరిని బదిలీ చేసినప్పుడు, ఆ స్థానంలో మరొకరు వచ్చి చేరేవరకు పాతవారిని రిలీవ్ చేయకూడదనేది' కనీస పరిపాలనా నియమం. కానీ సైబరాబాద్లో మాత్రం కాగితాల్లో భర్తీ చూపిస్తూ, క్షేత్రస్థాయిని ఖాళీ చేసేశారు. ఐటీ కారిడార్ లాంటి సున్నితమైన ప్రాంతాల్లో ఇలాంటి భద్రతా లోపాలు లేదా సిబ్బంది కొరత కొనసాగితే.. భవిష్యత్తులో అది శాంతిభద్రతల సమస్యలకు దారితీసే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, గందరగోళానికి గురైన బదిలీల ప్రక్రియను క్రమబద్ధీకరించి, ఐటీ కారిడార్ స్టేషన్లకు తక్షణమే పూర్తిస్థాయి సిబ్బందిని కేటాయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# యుద్ధ ప్రాతిపదికన పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల భూ సేకరణ ప్రక్రియ

**హైదరాబాద్ పెన్ పవర్:**
పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. దీనితో పాటు జిల్లాలోని ఇతర ప్రాజెక్టుల విషయంలో కూడా భూసేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. మంగళవారం నాడు ముఖ్యమంత్రి ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాకు చెందిన మంత్రులు, శాసనసభ్యులతో ఎంసీఆర్ హెచ్ఆర్డీలో సమావేశమయ్యారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి ఈ సందర్భంగా కీలకమైన సూచనలు చేశారు.జిల్లాలోని ప్రాజెక్టుల భూసేకరణ నిధుల విషయంలో జాప్యం జరగకుండా వెంటనే చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి చెప్పారు. పెండింగ్ బిల్లులను చెల్లించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులపై జిల్లా మంత్రులు సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించి ప్రాజెక్టుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు.
సమావేశంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, మధుసూదన్ రెడ్డి, మేఘా రెడ్డి, రాజేశ్ రెడ్డి, వంశీకృష్ణ, వీర్లపల్లి శంకరయ్య, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు పాల్గొన్నారు.

## హైడ్రాపై హోంశాఖకు ఫిర్యాదులు




**హైదరాబాద్, మే 19 ,పెన్ పవర్:** తెలంగాణలో సంచలనం సృష్టిస్తున్న 'హైడ్రా' కార్యకలాపాలు ఇప్పుడు వివాదాస్పదంగా మారాయి. హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను బేఖాతరు చేస్తూ హైడ్రా ముందుకు వెళ్తోందని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలంలోని సీయోట్ మారుతీ హిల్స్ కాలనీలో కోర్టు ఆదేశాలకు విరుద్ధంగా తవ్వకాలు జరుపుతున్నారని కాలనీ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆరోపించింది.బషీర్బాగ్లో జరిగిన సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. 1990-92 మధ్య ప్రైవేటు పట్టా భూములను కొనుగోలు చేసి, అన్ని అనుమతులతో కాలనీని అభివృద్ధి చేశామని తెలిపారు. అయితే, 2016లో ఎఫ్టీఎల్ పరిధిని తప్పుగా చూపడం వల్ల 86 మంది ప్లాట్ యజమానులు తీవ్రంగా నష్టపోతున్నారని వివరించారు. ఈ విషయంలో జనవరి 5న హైకోర్టు ఎటువంటి తవ్వకాలు చేపట్టవద్దని మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ, హైడ్రా వాటిని లెక్కచేయకుండా పనులు కొనసాగిస్తోందని వారు పేర్కొన్నారు.మరోవైపు, హైడ్రా కమిషనర్ రంగనాథ్పై కేంద్ర హోం శాఖకు ఫిర్యాదు అందింది. సివిల్ సర్వీస్ నిబంధనలు-1968ని కమిషనర్ ఉల్లంఘించారని బీఆర్ఎస్ నేత ఎర్ల సుధాకర్ రెడ్డి కేంద్ర హోం శాఖ అదనపు కార్యదర్శి రాకేశ్కుమార్ సింగ్కు ఫిర్యాదు చేశారు. అంబర్పేట మండలం సర్వే నంబర్ 563/1లోని బతుకమ్మకుంట భూవివాదం కోర్టు విచారణలో ఉండగా, ఆ అంశాలపై మీడియా ముందు తప్పుడు కథనాలు ప్రచారం చేస్తూ తన ప్రతిష్టను దెబ్బతీస్తున్నారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. కోర్టు పరిధిలో ఉన్న అంశాలను బహిరంగంగా చర్చించడం నిబంధనలకు విరుద్ధమని ఆయన విమర్శించారు. బాధితులకు న్యాయం చేయాలని , కోర్టు తీర్పులను గౌరవించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

## కవాడిగూడలో మహిళ దారుణ హత్య

**హైదరాబాద్ పెన్ పవర్:** నగరంలోని గాంధీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కవాడిగూడలో ఓ మహిళ దారుణ హత్యకు గురైంది.కవాడిగూడలోని రత్నదీప్ బిల్డింగ్ నాలుగో అంతస్తులో శ్వేత అనే మహిళను గుర్తుతెలియని వ్యక్తి కత్తితో పొడిచి హత్య చేసి పరారయ్యాడు.సమాచారం అందుకున్న వెంటనే గాంధీనగర్ పోలీసులు, క్లూస్ టీం సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఘటనకు సంబంధించిన ఆధారాలను సేకరిస్తూ దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరా ఫుటేజీల ఆధారంగా నిందితుడి వివరాలను గుర్తించే ప్రయత్నం చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. హత్యకు గల కారణాలపై విచారణ కొనసాగుతోంది.

## ఒస్మాన్నగర్ కేజీబీవీలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి మంత్రి వివేక్ శంకుస్థాపన

**హైదరాబాద్ పెన్ పవర్:** కార్మిక మరియు గనుల శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి మంగళవారం సంగారెడ్డి జిల్లాలోని రామచంద్రాపురం మండలం, ఒస్మాన్నగర్ గ్రామంలోని కేజీబీవీ పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. రూ.60 లక్షల అంచనా వ్యయంతో ఈ పనులు చేపడుతున్నారు. సంగారెడ్డి జిల్లా పర్యటనలో భాగంగా ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రికి స్థానిక నాయకుల ఘన స్వాగతం పలికారు. అనంతరం జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటిస్తూ వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భవిష్యత్ తరాల మెరుగైన భవిత కోసం రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోందని మంత్రి అన్నారు.

## లులు హైపర్ మార్కెట్ లో నాసిరకం నిల్వలు పలు ఆహార పదార్ధాలతో పురుగులు

**హైదరాబాద్ పెన్ పవర్:** కూకట్పల్లి లులు హైపర్మార్కెట్లో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు జరిపారు. పలు ఆహార పదార్థాల్లో పురుగులు, నాసిరకం నిల్వలు గుర్తించారు. కిచెన్లో అపరిశుభ్రత, పాడైపోయిన కూరగాయలు, పురుగుల సంచారం వెలుగులోకి వచక్చాయి. గడువు సమీపించిన ఆహార పదార్థాలపై తప్పుదారి పట్టించే లేబుళ్లు వున్నట్లు అధికారులు గుర్తించారు. శనగపిండి, ఆటా, పప్పుల్లో పురుగులను గుర్తించారు. గడువు ముగిసిన ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్తో ప్యాక్డ్ ఫుడ్ విక్రయం నడుస్తోంది. మాంస వ్యర్థాలతో మూసుకుపోయిన డ్రెయిన్లు వున్నాయి. సుమారు 150 కిలోల ఆహార పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు. కల్తీ, అధిక కృత్రిమ రంగుల అనుమానంతో ఆహార నమూనాలు సేకరించారు.

## నడిరోడ్డుపై మూడు వాహనాలు దగ్ధం

**రాజంపేట పెన్ పవర్:**
రైల్వే కోడూరు మండలం బాలుపల్లి చెక్ పోస్ట్ వద్ద ప్రమాదం జరిగింది. ఆగి వున్న లారీని వెనుక నుంచి ఇన్నోవా కారు ఢీకొంది. ఆ ఇన్నోవా కారును మరో కారు ఢీకొంది. ఘటనలో ముగ్గురికి గాయాలు అయ్యాయి. వారిని తిరుపతి ఆస్పత్రికి తరలించారు. మూడు వాహనాలు మాత్రం మంట్లో దగ్ధం అయ్యాయి. అగ్ని మాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు.

## సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా రైతులు అందోళనలకు దిగారు.

**సిద్దిపేట: పెన్ పవర్:** జిల్లా వ్యాప్తంగా అన్నదాతలు రోడెక్కారు. నెల రోజులైనా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయడంలేదని రోడ్డెక్కి నిరసనకు దిగారు. రాయపోల్ మండల పరిధిలోని వీరానగర్ వద్ద, దుబ్బాక మండలం తిమ్మాపూర్ వద్ద, సిద్దిపేట మండలం పుల్లూరు వద్ద రోడ్డుపై బైఠాయించారు. వర్షం పడితే తీరని నష్టం కలుగుతుందని, వెంటనే పంట కొనుగోలు చేయాలని రైతుల డిమాండ్.

## భూ భారతి పేరిట అసైన్డ్ భూములు కొల్లగొడుతున్న కాంగ్రెస్ నాయకులు

**హైదరాబాద్ పెన్ పవర్:** కాంగ్రెస్ నేతలు భూభారతి పేరిట అసైన్డ్ భూమునలను కొల్లగొడుతున్నారని బీఆర్ఎప్ నేత క్రిశాంక్ ఆరోపించారు. అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న అసైన్డ్ భూముల్లో ఎంపి వేం నరేందర్ రెడ్డి మైనింగ్ చేస్తున్నాడు. 2010లో, 2015లో వేం నరేందర్ రెడ్డి ఎలక్షన్ అఫిడవిట్లో అసైన్డ్ భూములు గురించి ఎక్కడా లేదు.. కాని 2026లోని ఎలక్షన్ అఫిడవిట్లో వాటి వివరాలు ఉన్నాయి. వేం నరేందర్ రెడ్డి భార్య విజయ లక్ష్మి పేరు మీద ఉన్న శ్రీ సాయి కృష్ణ గ్రానైట్స్ కంపెనీ కింద ఈ భూములు ఉన్నాయి. అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న అసైన్డ్ భూముల సర్వే నంబర్, శ్రీ సాయి కృష్ణ గ్రానైట్స్ కంపెనీ ఉన్న భూములు ఒకటే సర్వే నంబర్ కింద ఉన్నాయి. అవి అసైన్డ్ భూములని ఆర్డీవో, అడిషనల్ కలెక్టర్, కలెక్టర్ సంతకాలు కూడా ఉన్నాయి. ఇందులో కచ్చితంగా పాత మహబూబాబాద్ కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ప్రాత్ర కూడా ఉందని అయన అన్నారు. అందుకే వేం నరేందర్ రెడ్డి రాజ్య సభకి పోతు.. నువ్వు కూడా నా వెంట రా అని కలెక్టర్కి ఢిల్లీలోని తెలంగాణ భవన్లో స్పెషల్ సెక్రటరీ పదవి ఇప్పించాడని అన్నారు.

## హనుమాన్ విగ్రహం ధ్వంసం చేసిన గుర్తు తెలియని వ్యక్తులు

**హనుమకొండ: పెన్ పవర్:** న్యూ శాయంపేటలో ఉద్రిక్తత నెలకొంది. హనుమాన్ విగ్రహాన్ని గుర్తు తెలియను వ్యక్తులు ధ్వంసం చేసిన విషయం తెలుసుకుని విగ్రహ ధ్వంస స్థలానికి హిందూ సంఘాలు, భక్తులు భారీగా చేరుకున్నారు. న్యూ శాయంపేట ప్రధాన రహదారిపై ధర్నా కు దిగడంతో వాహనాలు భారీగా నిలిచిపోయాయి. విగ్రహం ధ్వంసం చేసిన వారిపైన కఠినచర్యలు తీసుకోవాలని నిరసనకారులు డిమాండ్ చేసారు. హనుమాన్ భక్తులు, బజరంగదళ్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్అరు. ఈ నేపథ్యంలో పోలీసులు హనుమాన్ భక్తులకు మధ్య తోపులాట జరిగింది. పరిస్థితి ఉద్రిక్తతంగా మారింది.

# బండి భగీరథ్ కేసులో క్రెడిట్ వార్



**హైదరాబాద్, మే 19, పెన్ పవర్:** బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో పెను తుపానును సృష్టిస్తోంది. ఈ కేసు కేవలం చట్టపరమైన పరిధిని దాటిపోయి రాజకీయంగా మారింది. బీజేపీ, కాంగ్రెస్ ను ఒకే గాటన కట్టేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తోంది. మరో వైపు అధికార కాంగ్రెస్ , బీజేపీ మధ్య ఒక హై-వోల్టేజ్ మైండ్ గేమ్ కు వేదికైంది. తెలంగాణ రాజకీయాలు ఇప్పుడు బండి భగీరథ్ కేసు చుట్టూతిరుగుతున్నాయి. బీజేపీ దశ మారుస్తారని భావిస్తున్న కీలక నేత కుమారుడు కావడం.. భగీరథ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు కావడం, ఆయన లొంగిపోవడం వంటి పరిణామాలు రాష్ట్రంలో రాజకీయవేడిని పెంచాయి. ఈ కేసును కాంగ్రెస్ సర్కార్ ఒక బలమైన రాజకీయ ఆయుధంగా మలచుకుంటుండగా, బీజేపీ దీనిని హనీ ట్రాప్‌గా అభివర్ణిస్తూ ఎదురుదాడికి దిగుతోంది. అదే సమయంలో బీఆర్ఎస్‌రెండు పార్టీలు కలిసి బాధితురాలికి అన్యాయం చేస్తున్నాయని ఆరోపిస్తోంది. బండి సంజయ్ బర్తరఫ్‌కు కేటీఆర్ డిమాండ్ చేస్తున్నారు. ఆయన మంత్రిగా ఉంటే.. కేసును ప్రభావితం చేస్తారని అంటున్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విషయంలో అత్యంత వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. కేసు నమోదైన నాటి నుంచే దర్యాప్తులో ఎందుకు జాప్యం జరుగుతోందని డీజీపీని ప్రశ్నించడం ద్వారా, తన ప్రభుత్వంచట్టం అమలులో ఎవరికీ మినహాయింపు ఇవ్వదని గట్టి సందేశం పంపారు. కేంద్ర మంత్రి కుమారుడైనా సరే వదిలేది లేదని చెప్పడం ద్వారా, ప్రజల్లో తన ఇమేజ్‌ను పెంచుకోవడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది.ముఖ్యంగా మహిళల భద్రత, పోక్సో కేసుల తీవ్రతను ప్రస్తావిస్తూ బీజేపీని ఆత్మరక్షణలో పడేసేలా కాంగ్రెస్ తన సోషల్ మీడియా విభాగాన్ని రంగంలోకి దింపింది.మరోవైపు బీజేపీ ఈ కేసును నేరుగా బండిసంజయ్ రాజకీయ ప్రతిష్టపై జరిగిన దాడిగా చిత్రీకరిస్తోంది. ప్రధాని మోదీ సభ , హిందూ ఏక్తా యాత్రల సమయంలోనే ఈ కేసును వెలుగులోకి తేవడం వెనుక లోతైన కుట్ర ఉందని బండి సంజయ్‌ఆరోపిస్తున్నారు. నన్ను రాజకీయంగా ఎదుర్కోలేకే నా కుమారుడిని టార్గెట్ చేశారు అనేది బీజేపీ ప్రధాన వాదన. అంతేకాకుండా, బాధితురాలు మైనర్ కాదని, ఆమెకు రెండు వేర్వేరు పుట్టిన తేదీ ధృవీకరణపత్రాలు ఉన్నాయనే వార్తలను బీజేపీ సోషల్ మీడియాలో వైరల్ చేస్తూ వచ్చింది. అయితే బీజేపీకి ఏదీ కలసి రాలేదు. బాధితురాలు మైనర్‌గా తేలడంతో జైలుకు వెళ్లక తప్పలేదు. ఈ గొడవ వల్లక్షేత్రస్థాయిలో బీజేపీ కార్యకర్తలు మరింత దూకుడుగా వ్యవహరిస్తున్నారు. ఇది కేవలం భగీరథ్ వ్యక్తిగత విషయం కాదని, పార్టీ గౌరవానికి సంబంధించిన అంశంగా వారు భావిస్తున్నారు. కాంగ్రెస్ మాత్రం తన న్యాయ పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి దీనిని ఒక ఉదాహరణగా చూపిస్తోంది. ఈ రెండు పార్టీలను ప్రజల్లో దోషులుగా నిరూపించాలని బీఆర్ఎస్ ప్రయత్నిస్తోంది. రాబోయే రోజుల్లో ఈ కేసు దర్యాప్తు వేగంపుంజుకునే కొద్దీ తెలంగాణ రాజకీయం మరిన్ని మలుపులు తిరగడం ఖాయం.

**కొత్త కేసులతో ఇబ్బందులు**

బండి సాయి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసులో పోలీసులు మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. దర్యాప్తు ముమ్మరం చేసిన కొద్దీ ఈ కేసులో రోజుకో కొత్త ట్విస్ట్ వెలుగులోకి వస్తోంది. తాజాగా ఈ కేసులో పోలీసులు నిందితుడు బండి భగీరథ్‌పై మరింత కఠినమైన బీఎన్ఎస్ సెక్షన్‌ను జోడించారు. ఒకే బాధితురాలిపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడినట్లు అభియోగాలు ఉండటంతో పోలీసులు ఈ కొత్త సెక్షన్‌ను నమోదు చేసినట్లు తెలుస్తోంది.ఈ కేసుకు సంబంధించి బండి భగీరథ్‌పై భారతీయ న్యాయ సంహిత (దీచీూ) లోని 64(2)(ఎ) సెక్షన్‌ను అదనంగా చేర్చారు. తీవ్రమైన నేరాలకుసంబంధించిన ఈ సెక్షన్‌ను జోడించడంతో నిందితుడికి చట్టపరంగా ఇబ్బందులు మరింత పెరిగే అవకాశం ఉందని న్యాయ నిపుణులు భావిస్తున్నారు. ఈ కొత్త కేసు ప్రకారం తప్పు చేసినట్లు రుజువైతే భగీరథ్‌కు 10 ఏళ్ల వరకు జైలుశిక్ష పడుతుందని తెలుస్తోంది. బాధితురాలి నుంచి సేకరించిన మరికొన్ని వివరాలు, సాంకేతిక ఆధారాల ప్రకారమే పోలీసులు ఈ చర్యలు చేపట్టినట్లు సమాచారం.మరోవైపు, ప్రస్తుతం రిమాండ్ ఖైదీగా చర్లపల్లి జైలులో శిక్ష అనుభవిస్తున్న బండి సాయి భగీరథ్‌ను కలిసేందుకు ఆయన కుటుంబ సభ్యులు సిద్ధమయ్యారు. జైలు నిబంధనల ప్రకారం నేడు వారు చర్లపల్లి జైలుకు వెళ్లి ములాఖత్ ద్వారా భగీరథ్‌ను కలవనున్నారు. కఠినమైన సెక్షన్లు తోడవడంతో తదుపరి లీగల్ ప్రాసెస్, బెయిల్ పిటిషన్లపై ఈ ములాఖత్‌లో కుటుంబ సభ్యులు, న్యాయవాదులు చర్చించే అవకాశం ఉందిబండి భగీరథ్ పోక్సో కేసులో పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. గత కొన్ని రోజులుగా సోషల్ మీడియా వేదికగా నిందితుడికి మద్దతుగా విపరీతంగా ప్రచారం నిర్వహిస్తూ, అతడు నిర్దోషి అని చిత్రీకరించే ప్రయత్నం చేసిన పలువురు సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లపై కేసులు నమోదయ్యాయి. ఈ వ్యవహారంలో మొత్తం 27 మంది ఇన్‌ఫ్లూయెన్సర్లపై ఫిర్యాదులు రాగా, ప్రాథమిక విచారణ అనంతరం అందులో 14 మందిపోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. మిగిలిన వారిపై కూడా దర్యాప్తు కొనసాగుతోందని, త్వరలోనే తదుపరి చర్యలు తీసుకుంటారని అధికారులు తెలిపారు.

# అమీర్ పేట జంక్షన్ లో ఎన్టీఆర్ విగ్రహం..

**హైదరాబాద్, మే 19, పెన్ పవర్:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల సందర్భంగా తాను మాట ఇచ్చినట్లు టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకుశరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. హైదరాబాద్ నగరంలోని అత్యంత రద్దీగా ఉండే అమీర్ పేట చౌరస్తాలో తెలుగువారి అన్న ఎన్టీఆర్ విగ్రహం ప్రతిష్ఠించేందుకు పనులు ప్రారంభమయ్యాయి. సెటిలర్లు, టీడీపీసానుభూతిపరులు, ఎన్టీఆర్ అభిమానుల ఓట్లే టార్గెట్ గా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విషయంలో వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారని అంటున్నారు. తెలంగాణ గడ్డపై టీడీపీ అనుకూల వ్యాఖ్యలుచేస్తే రాజకీయంగా నష్టం జరుగుతుందనే అనుమానాలను పటాపంచలు చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి అడుగులు వేస్తున్నారని వ్యాఖ్యానిస్తున్నారు. అమీర్‌పేట్ లోనే కాకుండా, హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుసమీపంలో 'ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ' వంద అడుగుల విగ్రహానికి సీఎం రేవంత్ రెడ్డి చర్యలు తీసుకోవడంపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. తెలుగుజాతి గర్వించదగ్గ మహానాయకుడు, దివంగత నేతనందమూరి తారక రామారావు అంటే రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రజలకు ఒక ఎమోషన్. పార్టీలకు అతీతంగా అన్నగారిని ఆరాధించే కోట్లాది మంది అభిమానులు రెండు రాష్ట్రాల్లో ఉన్నారు. ఎన్టీఆర్‌అభిమానులు ఎక్కువగా ఆయన స్థాపించిన టీడీపీకి అనుకూలంగా ఉంటారు. అయితే తెలంగాణ ఏర్పాటు తర్వాత టీడీపీ ఉనికి కోల్పోగా, ఆ పార్టీ సానుభూతిపరులు, అభిమానులు మాత్రం తరచూ తమప్రభావం చూపడానికి ప్రయత్నిస్తుంటారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతుంటారు. ప్రధానంగా హైదరాబాద్ నగరంలో భారీగా ఉండే టీడీపీ సానుభూతిపరులను ఆకర్షించడానికి తెలంగాణ పార్టీలువిస్తృతంగా ప్రయత్నిస్తుంటాయి. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఈ విషయమై పెద్ద డిబేట్ కూడా కొనసాగింది. ఆ సమయంలో కీలకమైన టీడీపీ సానుభూతిపరుల ఓటర్లను కైవసం చేసుకోడానికి ముఖ్యమంత్రిరేవంత్ రెడ్డి వ్యూహాత్మకంగా పావులు కదిపారు. అమీర్‌పేట్ లో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేస్తున్నారు. రేవంత్ రెడ్డి ఇక ఎన్నికల ప్రచార సమయంలో అమీర్‌పేట్ జంక్షన్ వద్దసీనియర్ ఎన్టీఆర్ భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకునేలా ప్రస్తుతం పనులు మొదలయ్యాయి. ఎమ్మెల్యే నవీన్ యాదవ్ ఆధ్వర్యంలో విగ్రహ ఏర్పాటు పనులుతాజాగా ప్రారంభించారు. ప్రస్తుతం పునాది పనులను ప్రారంభించారని ఇది పూర్తయిన వెంటనే విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆవిష్కరిస్తారని అంటున్నారు. హైదరాబాద్‌లో అమీర్‌పేట్, మైత్రీవనం ప్రాంతాలంటేనిత్యం లక్షలాది మంది విద్యార్థులు, ఉద్యోగులు, సాధారణ ప్రజలతో కిటకిటలాడే అత్యంత కీలకమైన జంక్షన్లు. అలాంటి చోట ఎన్టీఆర్ విగ్రహాన్ని ప్రతిష్ఠించడం వెనుక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యూహాత్మకరాజకీయ అడుగులు ఉన్నాయనే చర్చ నడుస్తోంది.తెలుగుదేశం పార్టీ నుంచి తన రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలో ఆ పార్టీ ఓటర్లను కాంగ్రెస్ వైపు మళ్లించే ప్రణాళికలో భాగంగాపకడ్బందీగా వ్యూహం రచిస్తున్నారని అంటున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రంలో టీడీపీ తిరిగి బలపడటం సాధ్యం కాదని, టీడీపీ ఓటర్లు తన నాయకత్వం కిందకు రావాలని బలమైన సంకేతాలు పంపేలాసీఎం రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారని విశ్లేషిస్తున్నారు. ఈ వ్యూహం అమలులో భాగంగా అమీర్‌పేట్ లో విగ్రహం ఏర్పాటుకు చకచకా పనులు జరుగుతున్నాయని, మరోవైపు ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో'ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ' ప్రతిపాదించిన 100 అడుగుల ఎన్టీఆర్ విగ్రహం, ఎన్టీఆర్ నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటుకు కూడా సానుకూల నిర్ణయం తీసుకున్నారని అంటున్నారు.

# కేబీఆర్ పార్కు చుట్టూ చెట్లు నరకడం పై స్టే

**హైదరాబాద్ పెన్ పవర్:** కేబీఆర్ పార్కు చుట్టూ 25 నుండి 35 మీటర్ల మీద ఉండే ఈ ఎస్ జెడ్ పరిధిలో చెట్లను నరకడంపై జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భూయాన్లతో కూడిన ధర్మాసనం స్టే విధించింది. సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో పర్యావరణ ప్రేమికురాలు కాజల్ మహేశ్వరి ఈ మేరకు విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఇదే విషయంపై మధ్యంతర ఉపశమనం కల్పించడానికి తెలంగాణ హైకోర్టు నిరాకరణను సవాల్ చేస్తూ ఆమె సుప్రీంకోర్టు కు వెళ్లినట్లు తెలియజేశారు. తన న్యాయవాది కే వివేక్ రెడ్డి వాదనలు విన్న సుప్రీంకోర్టు కె.బి.ఆర్ జాతీయ ఉద్యానవనం చుట్టూ ఉన్న పర్యావరణ సున్నిత ప్రాంతం వెడల్పును 29.8 మీటర్ల పరిధికి తగ్గించడంపై సవాలు చేసిన ఆమె వాదనలు విన్న ధర్మాసనం ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ప్రాజెక్టుల పేరుతో ప్రభుత్వం పర్యావరణ సంరక్షణకు గండి కొడుతూ అనేక ఉల్లంఘనలకు పాల్పడుతుందని దీనివల్ల వాతావరణంలో చోటు చేసుకునే అనేక మార్పులు భవిష్యత్తులో ప్రమాదకర పరిస్థితులకు దారితీస్తాయని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో పర్యావరణవేత్త మాజీ సైనికుడు మేజర్ సందీప్ కురానా, అనేకమంది పర్యావరణ ప్రేమికులు పాల్గొన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# కేంద్ర మంత్రి పదవికి ఈటల రాజేందర్ పేరు..?

# తెలంగాణ బీజేపీలో జోరుగా ప్రచారం



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ రాజకీయాల్లో సంచలనంగా మారిన భగీరథ్ పోక్సో కేసు వ్యవహారం ఇప్పుడు ఢిల్లీ రాజకీయ వర్గాల్లో కూడా హాట్ టాపిక్గా మారినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. రాష్ట్రంలో పెరుగుతున్న రాజకీయ పరిణామాలు, కేంద్ర మంత్రివర్గంలో మార్పులపై ఊహాగానాల మధ్య తెలంగాణకు చెందిన నేతలకు కీలక బాధ్యతలు అప్పగించే అవకాశాలపై జోరుగా ప్రచారం జరుగుతోంది. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకోనున్న నేపథ్యంలో కేంద్ర మంత్రివర్గంలో భారీ పునర్వ్యవస్థీకరణ జరిగే అవకాశమున్నట్లు ఢిల్లీ భారతీయ జనతా పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఇదే సమయంలో రాష్ట్రాల వారీగా రాజకీయ సమీకరణాలు, సామాజిక వర్గాల ప్రాతినిధ్యం, రాబోయే ఎన్నికల వ్యూహాలను దృష్టిలో పెట్టుకుని కొన్ని కీలక మార్పులు ఉండొచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.ఈ క్రమంలో తెలంగాణకు చెందిన పలువురు నాయకుల పేర్లు చర్చకు వస్తుండగా, ముఖ్యంగా మల్కాజ్గిరి ఎంపీ, తెలంగాణ ఉద్యమకారుడిగా గుర్తింపు పొందిన ఈటల రాజేందర్ పేరు ప్రముఖంగా వినిపిస్తున్నట్లు సమాచారం. ఆయనకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి పదవి అప్పగించే అవకాశాలపై ఢిల్లీ రాజకీయ, భారతీయ జనతా పార్టీ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతున్నట్లు సమాచారం.

తెలంగాణలో బీసీ సామాజిక వర్గ సమీకరణాలు, పార్టీ విస్తరణ, రాబోయే ఎన్నికల వ్యూహాలు, రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా అధిష్టానం ఆలోచిస్తున్న నేపథ్యంలో ఈటల రాజేందర్కు కీలక బాధ్యతలు అప్పగించే అవకాశాలపై ఊహాగానాలు వినిపిస్తున్నాయి. మరోవైపు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పదవిపై కూడా రాజకీయ చర్చ మొదలైంది. భగీరథ్ పోక్సో కేసు నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ విమర్శలు, ప్రతిపక్ష పార్టీల నిరసనలు, సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న చర్చలతో బండి సంజయ్పై ఒత్తిడి పెరిగినట్లు రాజకీయ వర్గాలు .అభిప్రాయపడుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రివర్గంలో తెలంగాణకు సంబంధించి మార్పులు జరిగే అవకాశాలపై ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి.

# మంత్రివర్గ ప్రక్షాళనకు రెడీ

**హైదరాబాద్, మే 19, పెన్ పవర్:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయి రెండున్నరేళ్లు కావస్తుంది. ఇప్పటికీ మంత్రివర్గంలో పూర్తిగా భర్తీ చేయలేదు. ఇంకా మంత్రివర్గంలో రెండు స్థానాలు ఖాళీలున్నాయి. ఎప్పటికప్పుడు మంత్రివర్గంలో ఖాళీలను భర్తీ చేస్తామని ఊరిస్తూనే ఉన్నారు. కానీ ఇంతవరకూ భర్తీ చేయకపోవడంతో ఆశావహుల్లో నిరాశ కలుగుతుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లినప్పుడల్లా పార్టీ పెద్దలతో మంత్రివర్గ విస్తరణపై చర్చించడానికి అంటూ ప్రచారం జరుగుతుండటం, రేవంత్ రిక్త హస్తాలతో తిరిగి రావడం సాధారణంగా మారింది. స్థానిక సంస్థల ఎన్నికలు ఇంకా పూర్తి కావాల్సి ఉంది. అవి పూర్తయిన తర్వాతనే మంత్రివర్గ విస్తరణ ఉంటుందని పార్టీలో ప్రచారం జరుగుతుంది.తెలంగాణలో పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలు ముగిశాయి. ఇక గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ తో పాటు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరగాల్సి ఉంది. ఈ ఎన్నికలు ముగిసిన తర్వాత రేవంత్ రెడ్డి ప్రస్తుతం ఉన్న మంత్రివర్గంలో పూర్తి స్థాయి ప్రక్షాళన చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. రెండున్నరేళ్లు కొందరికి మంత్రిగా అవకాశం కల్పించాం కాబట్టి, వారిని తప్పించి, వారి స్థానంలో కొత్త వారిని నియమించుకోవాలన్నది రేవంత్ రెడ్డి ఆలోచనగా ఉంది. ఇది పూర్తి స్థాయి ఎన్నికల టీంగా రేవంత్ రెడ్డి ఏర్పాటు చేసుకోవాలని భావిస్తున్నట్లు చెబుతున్నారు. అయితే అందుకు హైకమాండ్ నుంచి గ్రీన్ సిగ్నల్ అందాల్సి ఉంటుంది.ప్రస్తుత మంత్రివర్గంలో సామాజికవర్గం పరంగా కొందరిని తప్పించాల్సిన పరిస్థితులున్నాయి. అలాగే పనితీరు ఆధారంగా మరికొందరిని బయటకు పంపాల్సిన అవసరం ఉంది. అలాగే 2028 ఎన్నికల్లో పార్టీకిమంచి ఊపు తెచ్చే వారిని ఎంపిక చేసుకుని ముందుకు వెళ్లాలన్న భావనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారు. ప్రధానమైన వారిని కొందరిని అలాగే ఉంచి జిల్లాల వారీగా కొందరిని మార్చి, కొత్త వారికి అవకాశాలను కల్పిస్తే అందరికీ అవకాశం దొరికినట్లవుతుందని, అప్పుడు అసంతృప్తి, అసహనాలు ఉండవన్న అంచనాలో రేవంత్ రెడ్డి ఉన్నారు. ఈ మేరకే ఢిల్లీకి వెళ్లినప్పుడల్లా హైకమాండ్ ఎదుట ఈ ప్రతిపాదన పెట్టినా అందుకు హైకమాండ్ సుముఖత వ్యక్తం చేయకపోవడంతో అందుకు సరైన సమయం కోసం వేచి చూస్తున్నారని ఇతెలిసింది.

# 28 నుంచి భారీగా పెరగనున్న ధరలు

## 3 రకాలుగా సాగు భూముల విలువ సవరణ

**హైదరాబాద్, మే 19, పెన్ పవర్:** తెలంగాణవ్యాప్తంగా వ్యవసాయ, వ్యవసాయేతర భూములు, అపార్ట్‌మెంట్ల ప్రభుత్వ మార్కెట్ విలువను సుమారు 50 శాతం వరకు పెంచేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. బహిరంగ మార్కెట్ ధరలకు,ప్రభుత్వ విలువలకూ మధ్య ఉన్న భారీ వ్యత్యాసాన్ని తగ్గించడమే లక్ష్యంగా ఈ నెల 28 నుంచి కొత్త ధరలను అమలు చేయాలని భావిస్తున్నారు. దీనివల్ల ప్రభుత్వానికి ఏటా రూ.1500 కోట్ల అదనపుఆదాయం సమకూరనుంది. ముఖ్యంగా ఓఆర్ఆర్ లోపల, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని ఐటీ కారిడార్లు, కమర్షియల్ జోన్లలో ఈ పెంపు ఉండనుంది.తెలంగాణవ్యాప్తంగా రియల్ ఎస్టేట్ రంగానికి కీలకమైనభూముల రిజిస్ట్రేషన్ విలువల సవరణకు ప్రభుత్వం ముమ్మర సన్నాహాలు చేస్తోంది. గ్రామీణ ప్రాంతాలు, జాతీయ రహదారులు, పట్టణాలకు సమీపంలో ఉన్న సాగు, సాగేతర స్థిరాస్తుల విలువలను సగటున50 శాతం వరకు పెంచాలని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ నిర్ణయించింది. బహిరంగ మార్కెట్ ధరలకు, సర్కారు నిర్ణయించిన విలువలకు మధ్య కొండంత వ్యత్యాసం ఉండటమే దీనికి ప్రధాన కారణం. ప్రముఖఆర్థికవేత్త అరవింద్ సుబ్రహ్మణ్యం కమిటీ సిఫార్సులను పరిగణనలోకి తీసుకుని ఈ ప్రక్రియను చేపడుతుండగా.. ప్రజలపై ఒకేసారి భారీ భారం పడకుండా ఉండాలని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిఅధికారులకు స్పష్టం చేశారు. ఈ నెల 28 నుంచే కొత్త రేట్లను అమల్లోకి తెచ్చే అవకాశం ఉంది.ఈ సవరణ ప్రకారం.. రాష్ట్రంలో ప్రస్తుతం ఎకరా వ్యవసాయ భూమి కనిష్ఠ ప్రభుత్వ విలువ రూ.1.75 లక్షలుఉండగా.. దానిని రూ.2.75 లక్షలకు పెంచనున్నారు. ఇక ఓఆర్ఆర్ పరిధి లోపల డిమాండ్ ఎక్కువగా ఉన్నందున ఎకరా కనిష్ఠ విలువను రూ.8.75 లక్షల నుంచి రూ.15 లక్షలకు పెంచాలనినిర్ణయించారు. వట్టినాగులపల్లి వంటి హాట్ స్పాట్లలో బహిరంగ మార్కెట్ ధర ఎకరాకు రూ.100 కోట్లకు పైగా పలుకుతుండగా.. ప్రస్తుతం అక్కడ కేవలం రూ.2 నుంచి రూ.2.5 కోట్లుగా ఉన్న ప్రభుత్వవిలువను రూ.4 కోట్లకు సవరించనున్నారు. హైదరాబాద్ మహానగర పరిధిలోని దాదాపు 350 ప్రాంతాలలో స్థానిక మార్కెట్ డిమాండ్‌ను బట్టి విడివిడిగా ధరలను ఖరారు చేయనున్నారు. జూబ్లీహిల్స్‌లాంటి ఏరియాల్లో గజం విలువ రూ.80 వేల నుంచి రూ.90 వేలకు పెరిగే అవకాశం ఉంది.అపార్ట్‌మెంట్లు, కమర్షియల్ కాంప్లెక్స్‌ల ఫ్లాట్ల చదరపు అడుగు ధరల్లో కూడా 75 శాతం వరకు మార్పులున్నాయి. ప్రస్తుతం చదరపు అడుగు రూ.3500 నుండి రూ.4000 వరకు ఉన్న విలువల స్థానంలో రూ.6000 వరకు నిర్ధారించనున్నారు. అదేవిధంగా వాణిజ్య ప్రాంతాలలో బహిరంగ మార్కెట్ ధరలురూ.8000 నుండి రూ.12000 వరకు ఉండటంతో ప్రభుత్వ ల్యాండ్ వాల్యూను రూ.6600గా ఫిక్స్ చేయాలని అధికారులు భావిస్తున్నారు. వంద అడుగుల రోడ్లు, ప్రధాన లింక్ రోడ్లు ఉన్న ఏరియాల్లో స్థానికవృద్ధిని బట్టి రేట్లు పెరగనున్నాయి.ప్రస్తుతం స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా ఏడాదికి రూ.15 వేల కోట్ల ఆదాయం లభిస్తుండగా.. ఈ తాజా సవరణల ద్వారా ప్రభుత్వ ఖజానాకు అదనంగా మరో రూ.1500కోట్ల రాబడి చేకూరనుంది. గతంలో 2021, 2022 సంవత్సరాల్లో చివరిసారిగా ఈ విలువల సవరణ జరిగింది. ఆ తర్వాత ఐటీ రంగ విస్తరణ, మౌలిక వసతుల మెరుగుదల వల్ల హైదరాబాద్ చుట్టుపక్కలవిల్లాలు హైరైజ్ బిల్డింగుల నిర్మాణాలు పెరిగి భూముల ధరలు ఆకాశాన్నంటాయి. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కాగా ఈ కొత్త ధరల అమలు ప్రక్రియను ప్రారంభించిన ఆరు నెలలతర్వాత మార్కెట్ సరళిని బట్టి అధికారులు మరోసారి సమీక్ష నిర్వహించనున్నారు.ఎకరం భూమి కనీసం పదిహేను లక్షలు పెరిగే అవకాశం ఉందని చెప్పారు. అవుటర్ రింగ్ రోడ్డు, ఇన్నర్ రింగ్ రోడ్డు పరిధిప్రామాణికంగా ధరలు పెంపు ఉంటుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన ఉంటుందని ఆయన చెప్పారు.అరవింద్ సుబ్రహ్మణ్యం నివేదిక ఆధారంగా గత ప్రభుత్వంరెండుసార్లు భూముల ధరలు పెంచిందన్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి 2022 నుంచి భూములు ధరలు పెంచలేదని గుర్తు చేశారు. భూముల ధరలు పెరుగుతాయని దానితో పాటు ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్‌పరంగా ఆదాయం కూడా లభిస్తుందని చెప్పారు. వరంగల్ మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులను వేగవంతం చేయనున్నామని చెప్పారు.

# రాష్ట్రంలో వైసీపీ ఫిఫ్టీ - ఫిఫ్టీనే.. !



**విజయవాడ, మే 19 పెన్ పవర్:** రాష్ట్రవ్యాప్తంగా వైసిపి సోమవారంనాడు పెట్రోల్, డీజిల్ ధరలకు వ్యతిరేకంగా చేపట్టిన నిరసన కార్యక్రమం కొన్ని కొన్ని జిల్లాల్లో బాగానే జరిగింది. మెజారిటీ జిల్లాల్లో మాత్రం నామమాత్రంగా జరిగింది. ఇక మరికొన్ని జిల్లాల్లో మాత్రం అసలు ఊసే కనిపించ లేదు. విజయవాడ, గుంటూరు అదేవిధంగా నెల్లూరు, కడప, విజయనగరం జిల్లాల్లో వైసిపి చేపట్టిన నిరసన కార్యక్రమానికి స్పందన లభించింది. పలువురు నాయకులు రోడ్డెక్కారు. ప్ల కార్డులు పట్టుకుని తిరిగారు.అదేవిధంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా, కూటమికి వ్యతిరేకంగా నాయకులు వ్యాఖ్యలు చేశారు. పెట్రోల్ ధరలు పెరిగిపోతే సామాన్యుడు జీవించేదెలా అంటూ ప్రశ్నించారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ కొన్ని కొన్ని జిల్లాల్లో మాత్రం అసలు వైసీపీ చేపట్టిన ఈ నిరసన కార్యక్రమం ఎక్కడ కనిపించలేదు. ఉదాహరణకు శ్రీకాకుళం, ఉమ్మడి పశ్చిమగోదావరి, ఉమ్మడి విశాఖపట్నం అదే విధంగా ప్రకాశం జిల్లాలో కూడా వైసిపి చేపట్టిన నిరసన కార్యక్రమాలు పెద్దగా వర్కౌట్ కాలేదు.నాయకులు సైతం ఎక్కడా కనిపించలేదు. కేవలం ఒకరిద్దరు మాత్రమే నాయకులు ప్లకార్డులు పట్టుకుని రోడ్డు ఎక్కారు. మరికొందరు మాత్రం కేవలం సోషల్ మీడియాకు మాత్రమే పరిమితమయ్యారు. ఈ పరిణామాలతో రాష్ట్రంలో వైసిపి పరిస్థితి అర్థమయిపోయింది అన్నది రాజకీయ విశ్లేషకులు చెబుతున్న మాట. క్షేత్రస్థాయిలో ఇప్పటివరకు బలంగా ఉందని, ప్రభుత్వ వ్యతిరేకత తమకు కలిసి వస్తుందని భావిస్తూ వచ్చిన వైసీపీ అధినేతకు ఈ పరిణామం ఒక ఉదాహరణగా నిలుస్తుందని వారు చెబుతున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో కూడా కొన్ని నియోజకవర్గాల్లో మాత్రమే నిరసన కార్యక్రమం చేపట్టారు. నిజానికి వైసీపీకి బలంగా ఉన్న జిల్లాలో ఎన్టీఆర్, గుంటూరు వంటివి కీలకంగా ఉన్నాయి. అయితే ఈ జిల్లాల్లో కూడా సగం మంది నాయకులు మాత్రమే బయటికి వచ్చారు. జగ్గయ్యపేట, తిరువూరు, మైలవరం వంటి నియోజకవర్గాల్లో ఎక్కడ నిరసన కార్యక్రమాలు పెద్దగా కనిపించలేదు. అదేవిధంగా తూర్పుగోదావరి జిల్లాలోని రాజమండ్రిలో

మాత్రమే ఈ నిరసన కార్యక్రమం జరిగింది. మాజీ ఎంపీ మార్గాన్ని భరత్ నిర్వహించారు. మరి మిగిలిన జిల్లాలోని మిగిలిన ప్రాంతాల్లో పరిస్థితి మాత్రం మైనస్ గా మారింది. దీనిని బట్టి వైసీపీ పరిస్థితి ఫిఫ్టీ-ఫిఫ్టీగానే ఉందన్న వాదన వినిపించింది.

# పాపులేషన్ పాలసీపై విమర్శలు గళాన్ని వినిపిస్తున్న మహిళా సంఘాలు

**విజయవాడ, మే 19 పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిపాదించిన సరికొత్త జనాభా విధానం ఇప్పుడు దేశవ్యాప్తంగా సామాజిక, రాజకీయ చర్చలకు కేంద్రబిందువుగా మారింది. భవిష్యత్తులో యువ శ్రామిక శక్తి కొరత ఏర్పడకూడదనే ఉద్దేశంతో ఎక్కువ మంది పిల్లలను కనే దంపతులకు ఆర్థిక ప్రోత్సాహకాలు 3వ బిడ్డకు రూ.30 వేలు, 4వ బిడ్డకు రూ.40 వేలు ఇస్తామని చంద్రబాబు ప్రకటించారు. అయితే, ఈ ప్రతిపాదనపై మహిళా సంఘాలు మరియు ఫెమినిస్టులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. మహిళల శరీరం, ఆరోగ్యం వారి వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన అంశాలని, ఓటు బ్యాంకు రాజకీయాల కోసం మహిళలను పిల్లలను కనే యంత్రాలు గా పరిగణించడం ఏమాత్రం సమంజసం కాదని వారు మండిపడుతున్నారు. ప్రముఖ పీడియాట్రీషియన్ డాక్టర్ శివరంజని సంతోష్ ఈ పాలసీపై సోషల్ మీడియా వేదికగా సంధించిన ప్రశ్నలు వైరల్ అవుతున్నాయి. ప్రభుత్వం ఇచ్చే రూ.30,000 లేదా రూ.40,000 సాయం కొద్ది రోజుల్లోనే ఖర్చయిపోతుందని, ఆ తర్వాత ఆ బిడ్డల పోషణ, చదువు, ఆరోగ్య బాధ్యతలను పేద కుటుంబాలు ఎలా మోస్తాయని ఆమె ప్రశ్నించారు. కేవలం తాత్కాలిక నగదు ఆశ చూపి పేదలను ఎక్కువ మంది పిల్లలకు జన్మనిచ్చేలా ప్రోత్సహించడం వారిని మరిన్ని ఆర్థిక కష్టాల్లోకి నెట్టడమేనని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. మౌలిక వసతులు లేని చోట జనాభా పెంపు శిశు, మాతృ మరణాల రేటును పెంచే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. మాజీ హెల్త్ సెక్రటరీ పీవీ రమేష్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రభుత్వం జనాభా సంఖ్యను పెంచడం కంటే, ప్రస్తుతం ఉన్న జనాభాకు నాణ్యమైన విద్య, ఉచిత వైద్యం, పౌష్టికాహారం అందించడంపై దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలు ఇంకా పూర్తిస్థాయిలో బలోపేతం కాకముందే ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం వల్ల తల్లుల ఆరోగ్య భద్రత ప్రమాదంలో పడుతుందని ఆయన విశ్లేషించారు. నాణ్యమైన మానవ వనరుల అభివృద్ధికి సంఖ్య కంటే సౌకర్యాలు ముఖ్యమని ఆయన కోణంలో స్పష్టం చేశారు. ఈ అంశంపై పుదుచ్చేరి మాజీ లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్ బేడీ, సినీ నటి పూనమ్ కౌర్ వంటి వారు కూడా తమ గళాన్ని వినిపించారు. సామాజిక మాధ్యమాల్లో చంద్రబాబు వ్యాఖ్యలను కొందరు దూరదృష్టి గా అభివర్ణిస్తుంటే, మరికొందరు దీనిని మహిళా వ్యతిరేక ధోరణి గా ట్రోల్ చేస్తున్నారు. ముఖ్యంగా మహిళా సంఘాలు ఈ పాలసీని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. అభివృద్ధి చెందిన దేశాల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని సీఎం ఈ ప్రతిపాదన చేసినప్పటికీ, అది మహిళల ప్రాథమిక హక్కులను ప్రభావితం చేసేలా ఉండకూడదని వారు వాదిస్తున్నారు. సీపీఎం నాయకురాలు బృందా కారత్ కూడా చంద్రబాబు పాపులేషన్ పాలసీని ఖండించారు చంద్రబాబు ఎన్డీయేలో చేరిన తర్వాత సొంత తెలివితేటలను, ఆలోచనా విధానాన్ని తాకట్టు పెట్టేంత దూరంగా వెళ్ళిపోయారా అని ప్రశ్నించారు. రూ. 30,000 ఆశ చూపి, ఒక మహిళకు తన సొంత గర్భంపై ఉన్న ప్రాథమిక హక్కును మీరు లాక్కోవాలని చూస్తున్నారు... ఇప్పుడు ఏం జరుగుతుందంటే, ఈ రూ. 30,000 – రూ. 40,000 ఆశకు లోబడి, ఆ మహిళ కుటుంబ సభ్యులు ఆమెపై విపరీతమైన ఒత్తిడి తెస్తారని ఆందోళన వ్యక్తం చేశారు.మరోవైపు, చంద్రబాబు మద్దతుదారులు మాత్రం ఈ పాలసీని సమర్థిస్తున్నారు. ప్రభుత్వం ఎవరినీ బలవంతం చేయడం లేదని, కేవలం స్వచ్ఛందంగా ముందుకు వచ్చే వారికి ప్రోత్సాహం అందిస్తోందని వారు చెప్తున్నారు. రాబోయే దశాబ్దాల్లో ఏపీలో వృద్ధాప్య సంక్షోభం తలెత్తకుండా ఉండాలంటే ఇప్పుడే మేల్కొనాలని, జనాభా సంతులనం కోసమే ఈ పాలసీని వర్కవుట్ చేస్తున్నారని వారు స్పష్టం చేస్తున్నారు. ఏది ఏమైనా, ముఖ్యమంత్రి లేవనెత్తిన ఈ అంశం ఇప్పుడు జాతీయ మీడియాలో సైతం హాట్ టాపిక్‌గా మారి, భిన్నమైన వాదనలకు దారితీస్తోంది.

చదరపు కిలోమీటర్ కు 480 మంది పైనే

మన దేశంలో జనాభా ఇప్పటికే సుమారు 140 కోట్ల పైగా ఉంది. ఈ నేపథ్యంలో ఇప్పుడు పెంపు అవసరమైన ప్రశ్నలు తలెత్తుతున్నాయి. జనాభా కారణంగా ఇప్పటికే మన దేశంలో వనరులపై ఒత్తిడి పెరుగుతుంది. ప్రజలకు పాలకులు మౌలిక సదుపాయాలు కల్పించలేకపోతున్నారు. మంచి విద్య అందడం లేదు. ఆసుపత్రుల కొరత ఉంది. ఉద్యోగాలు ఉపాధి అవకాశాలు లభించడం లేదు. సంపద కూడా కొందరి వద్దనే ఉంటుంది. ఆర్థిక అంతరాలు పెరుగుతున్నాయి.చదరపు కిలోమీటరుకు కనిపించే జనసాంద్రత భారతదేశంలో ఎక్కువగా ఉంటుంది, ఇది మౌలిక సదుపాయాలపై భారం పెంచుతుంది. రవాణా, ఆరోగ్య, విద్య, నీటి సరఫరా వంటి సేవల అందుబాటును ప్రస్తుత జనాభా కూడా కష్టపడి తీర్చుకుంటోంది. అంతకంటే ఎక్కువ జనాభా పెరగడం పరిస్థితిని మరింత యంత్రంగా మార్చే అవకాశం ఉంది. అమెరికాలో చదరపు కిలోమీటర్ కు 33 మంది, చైనాలో చదరపు కిలోమీటర్ కు 150 మంది ఉన్నారు. మనదేశంలో కూడా ఫెర్టిలిటీ రేటు తగ్గుతుంది. కానీ జనాభా పెంపు ఇప్పట్లో అవసరం లేదు.ఆంధ్రప్రదేశ్‌లో జనాభా 5 కోట్లకు పైగా ఉంది. ఇది దక్షిణ కొరియాతో సమానం. దక్షిణ కొరియా ప్రపంచంలో చాలా మెరుగైన అభివృద్ధి చెందిన దేశం. ఆంధ్రప్రదేశ్లో చాలావరకు మౌలిక సదుపాయాల లేవు. తలసరి ఆదాయంలో ఆంధ్రప్రదేశ్ దక్షిణాది రాష్ట్రాల్లో చివరి స్థానంలో ఉంది. జిడిపి పెంపు ప్రజలకు మెరుగైన జీవనం కల్పించడంపై దృష్టి పెట్టాల్సిన తరుణంలో జనాభా పెంపుకు పిలుపునివ్వడం విమర్శలకు తావిస్తోంది.చంద్రబాబు జనాభా పెంపు గురించి ప్రజలను ప్రోత్సహించడం కన్నా ముందు సదుపాయాలపై దృష్టి పెట్టాలని సూచిస్తున్నారు. అజీర్ణంతో బాధపడుతున్న వ్యక్తి ఆకలితో ఉన్నవాడిని ఒకప్పుడు తినమని సూచించినట్లుగా ఉందన్న విమర్శలు వస్తున్నాయి. అధిక జనాభా సూచన రాజకీయంగా రాకుండా వాస్తవ సమస్యల్ని మరింత పెంచే ప్రమాదం ఉంది.

# లోకల్ పోరుకు వ్యూహాలు

**విజయవాడ, మే 19, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ లో స్థానిక సంస్థల ఎన్నికలకు సమయం దగ్గరపడుతుంది. ఈ మేరకు ఎన్నికల కమిషన్ ఎన్నికలకు సంబంధించి సన్నాహాలు ప్రారంభించింది. ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు చేస్తోంది. దీంతో అన్ని రాజకీయ పార్టీలు అప్రమత్తమయ్యాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో పట్టు నిలుపుకునేందుకు తమ పార్టీ శ్రేణులను సిద్ధం చేస్తున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలకు సెప్టెంబరులో నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది. డిసెంబరు నాటికి ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసి, కొత్త ఏడాది నాటికి నూతన పాలకవర్గాలు కొలువుదీరేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.ఇప్పటికే తెలుగుదేశం పార్టీ జిల్లాల వారీగా సమన్వయ కర్తలు నియమించింది. జిల్లాలకు వెళ్లి నియోజకవర్గ ఎమ్మెల్యేలతో సమావేశమై పార్టీ అభ్యర్థులకు సంబంధించిన మార్గదర్శకాలను వివరించాలని పార్టీ నాయకత్వం నిర్ణయించింది. కొన్ని జిల్లాలకు కొందరు ముఖ్యనేతలకు బాధ్యతలను అప్పగించారు. ఇక కూటమిలోని మరొక మిత్రపక్షమైన జనసేన పార్టీ కూడా జిల్లాల వారీగా పరిశీలికులను నియమించింది. వారు జిల్లాలకు వెళ్లి పార్టీ నేతలతో సమావేశమై స్థానిక సంస్థల ఎన్నికలపై నేతల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నారు. నివేదికను పవన్ కల్యాణ్ కు అందించనున్నారు. బీజేపీ మాత్రం ఇంకా దీనిపై ఇంకా కసరత్తులు మొదలు పెట్టలేదు.మరొకవైపు ప్రతిపక్ష వైసీపీ కూడా ఇప్పటికే స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తమవుతుంది. లండన్ పర్యటన నుంచి వచ్చిన తర్వాత వైసీపీ అధినేత వైఎస్ జగన్ కీలక నేతలతో సమావేశమై స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. రిజర్వేషన్లు, పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి మాత్రమే టిక్కెట్లు ఇవ్వాలని, అలాగే సామాజిక సమీకరణాలను కూడా ఖచ్చితంగా పాటించాలని వైఎస్ జగన్ నేతలను ఆదేశించినట్లు తెలిసింది. తొలుత మున్సిపల్ ఎన్నికలు జరుగుతుండటంతో బూత్ లెవెల్ కమిటీలను పూర్తి చేసి వారిని యాక్టివ్ చేయాలని, ఇప్పటి నుంచే స్థానిక సమస్యలపై పార్టీ శ్రేణులు ఉద్యమించాలని వైఎస్ జగన్ పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. మొత్తం మీద ఆంధ్రప్రదేశ్ లో లోకల్ హాట్ మొదలయిందనే చెప్పాలి

**ఎమ్మెల్యేలకు**

స్థానిక సంస్థల ఎన్నికలు ఎమ్మెల్యేలకు సవాల్ గా మారనున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లవుతుంది. అయితే ఈ రెండేళ్లలో కూటమిలోని టీడీపీ, జనసేన, బీజేపీల మధ్య నియోజకవర్గాల్లో సఖ్యత లేదు. దీంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీ ఇబ్బందులు తలెత్తే అవకాశముందని భావించి మూడు పార్టీల అగ్రనాయకత్వం అప్రమత్తమయింది. పై స్థాయిలో మూడు పార్టీల్లోని అగ్ర నాయకత్వం సఖ్యతగా ఉన్నప్పటికీ నియోజకవర్గ స్థాయి నేతల మధ్య సంబంధాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. పదవులు, కాంట్రాక్టులు, ఇసుక, మద్యం వంటి విషయాల్లో తేడాలు రావడంతో కూటమి నియోజకవర్గాల్లో కలసి లేదన్నది వాస్తవం. స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు ఎమ్మెల్యేల పనితీరుకు కొలమానం కావడంతో వారిలోనూ ఆందోళన నెలకొంది.ఏ పార్టీ ఎమ్మెల్యే అక్కడ ప్రాతినిధ్యం వహిస్తుంటే మిగిలిన పార్టీల నేతలను నిర్లక్ష్యం చేస్తున్నారని ఇప్పటికే అనేక చోట్ల నుంచి ఫిర్యాదులు అధినాయకత్వానికి అందుతున్నాయి. ఇందుకు టీడీపీ, జనసేన, బీజేపీ ఏదీ మినహాయింపు కాదు. తమ గెలుపునకు దోహదపడిన తమ పార్టీకి సంబంధించిన నాయకులకే పదవులు, కాంట్రాక్టులు ఇస్తుండటంతో మిగిలిన పార్టీల నేతలు, క్యాడర్ లో అసంతృప్తి నెలకొంది. అంతెందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలోనే జనసేన, టీడీపీ కార్యకర్తల మధ్య సఖ్యత లేదు. అందుకే అక్కడ టీడీపీ ఇన్ ఛార్జి బాధ్యతల నుంచి వర్మను పార్టీ నాయకత్వం తప్పించాల్సి వచ్చింది.ఇలా ఉత్తరాంధ్ర నుంచి తీసుకుంటే కోస్తాంధ్ర, రాయలసీమలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. నేతల మధ్య ఎంత సమన్వయం కుదిర్చినప్పటికీ ఫలితం ఎలా ఉంటుందోనన్న ఆందోళన మూడు పార్టీల నేతల్లోనూ వ్యక్తమవుతుంది. అందుకే అన్ని పార్టీలు జిల్లా, నియోజకవర్గ స్థాయిలో సమన్వయ కమిటీలను ఏర్పాటు చేసుకుని నేతల మధ్య గ్యాప్ లేకుండా చూసుకోవాలని నిర్ణయించాయి.

## కడపలో రెండు నియోజకవర్గాలపై దృష్టి

**కడప, మే 19, పెన్ పవర్:**
ఏపీ రాజకీయాల్లో వైయస్ షర్మిల దూకుడు పెంచాలని భావిస్తున్నారు. వచ్చే ఎన్నికల నాటికి ఎంపిక చేసిన కొన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని భావిస్తున్నారు. ప్రధానంగా గట్టి అభ్యర్థులను బరిలో దించడం ద్వారా ఓట్లతోపాటు సీట్లు పెంచుకోవాలని చూస్తున్నారు. మరోవైపు తాను సైతం ఈసారి అసెంబ్లీకి పోటీ చేసేందుకు సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది. మొన్నటి ఎన్నికల్లో కడప ఎంపీగా పోటీ చేశారు షర్మిల. త్రిముఖ పోటీలో భాగంగా.. ఆమె ఏకంగా లక్ష యాభై వేలకు పైగా ఓట్లతో విజయం సాధించారు. ఒకానొక దశలో కడప ఎంపీగా అవినాష్ రెడ్డి ఓడిపోతారని కూడా అంచనాలు వచ్చాయి. అయితే రాజకీయ ప్రత్యర్థిగా భావించే జగన్మోహన్ రెడ్డి పార్టీని గట్టిగానే దెబ్బతీయగలిగారు షర్మిల. కడప జిల్లాలో కూటమికి ఏడు అసెంబ్లీ స్థానాలు లభించాయి అంటే.. షర్మిల ప్రభావం అధికంగా ఉంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీపై. వైసిపి ఓడిపోయేందుకు షర్మిల దోహదపడ్డారు.అయితే ఈసారి పార్లమెంట్ స్థానానికి కాకుండా అసెంబ్లీకి పోటీ చేయాలని భావిస్తున్నారు షర్మిల. దానికి కారణం లేకపోలేదు. అసెంబ్లీలో తన వాయిస్ వినిపించడం ద్వారా తన పొలిటికల్ కెరీర్ కు ఒక నిర్మాణం జరుపుకోవాలని చూస్తున్నారు. ఒకవేళ జగన్ మోహన్ రెడ్డి ప్రతిపక్షానికి పరిమితం అయినా.. ఆయన అసెంబ్లీకి రారు. అధికారంలోకి వస్తే అదే జగన్మోహన్ రెడ్డి పై గట్టిగానే తన వాయిస్ వినిపించవచ్చు. ఈ రెండు కారణాలతోనే షర్మిల ఇప్పుడు అసెంబ్లీ వైపు మొగ్గు చూపుతున్నారు. తనకు సేఫ్ గా ఉండే నియోజకవర్గాలను ఎంచుకునే పనిలో ఉన్నారు. రాయలసీమలో అయితే కలిసి వస్తుందన్న అంచనా. ఆపై కడప జిల్లాలో అయితే సునాయాసంగా విజయం సాధించవచ్చు అనేది ఆమె అభిప్రాయం. అందుకే కడప జిల్లాలో ఆమె అన్వేషణ ప్రారంభించినట్లు తెలుస్తోంది.కడప జిల్లాలో ప్రధానంగా రెండు నియోజకవర్గాలపై ఆమె దృష్టి పెట్టారు. ముఖ్యంగా కమలాపురం నియోజకవర్గం పై ఫోకస్ పెట్టారు. దానికి కారణం లేకపోలేదు. ఆ నియోజకవర్గం తన తల్లి విజయమ్మ పుట్టినిల్లు. తన మేనమామ రవీంద్రనాథ్ రెడ్డి అక్కడ ప్రాతినిధ్యం వహిస్తూ వచ్చారు. మొన్నటి ఎన్నికల్లో ఓడిపోయారు. ఆ నియోజకవర్గ అయితే సేఫ్ జోన్ గా ఉంటుందని భావిస్తున్నట్లు సమాచారం. కడప నియోజకవర్గం పై కూడా ఆమె దృష్టి పెట్టారట. జిల్లా కేంద్రం కావడంతో అక్కడ నుంచి రాజకీయాలు చేస్తే బాగుంటుందన్న అభిప్రాయానికి వస్తున్నారట. పైగా కడప అసెంబ్లీ నియోజకవర్గంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి కుటుంబ అభిమానులు ఎక్కువ. మరి షర్మిల ఎలాంటి అడుగులు వేస్తారో చూడాలి.

## చంద్రబాబు.. లోకేష్... దేవాన్ష

**విజయవాడ, మే 19, పెన్ పవర్:** చంద్రబాబు కుటుంబంలో ఏది జరిగిన ఇప్పుడు ప్రత్యేక ఆకర్షణే. ఇప్పటివరకు చంద్రబాబు.. తరువాత లోకేష్.. ఇప్పుడు దేవాన్ష్ అన్నట్టు పరిస్థితి మారింది. చదువుతో పాటు ఇతరత్రా అంశాల్లో సైతం ముందున్నారు దేవాన్ష్. మొన్నటి వరకు చదరంగంలో సైతం సత్తా చాటారు. ప్రపంచ స్థాయి పోటీల్లో పాల్గొని నైపుణ్యం కనబరిచారు. ఇప్పుడు మరో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు దేవాన్ష్. ఓ యూట్యూబ్ ఛానల్ ను ప్రారంభించారు. పురాతన జంతువులతో పాటు అంశాలను తనదైన శైలిలో వివరించేందుకు సిద్ధపడ్డారు. యూట్యూబ్ ఛానల్ పరిచయ కార్యక్రమంలో భాగంగా కుమారుడు దేవాన్షుతో పాటు లోకేష్ పాలుపంచుకున్నారు. ప్రోమో వీడియోలో లోకేష్ సైతం కనిపించారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.నారాతోపాటు నందమూరి కుటుంబానికి సైతం దేవాన్స్ స్పెషల్. నందమూరి బాలకృష్ణ కుమార్తె బ్రాహ్మణిని లోకేష్ వివాహం చేసుకున్నారు. ఇరు కుటుంబాలకు పెద్ద మనవడు దేవాన్ష్. బాలకృష్ణకు ఏకైక కుమారుడు లోకేష్ కావడంతో.. దేవాన్ష్ సైతం ఏకైక కుమారుడు లోకేష్ దంపతులకు. అయితే చిన్ననాటి నుంచి నానమ్మ భువనేశ్వరి పర్యవేక్షణలోనే పెరుగుతున్నాడు. ఏటా సంక్రాంతి వేడుకల సమయంలో నారావారిపల్లిలో సైతం దేవాన్స్ సందడి చేస్తుంటాడు. గ్రామానికి వెళ్ళిన క్రమంలో తోటి చిన్నారులతో ఆటలాడుతుంటాడు. కర్ర సాములో సైతం ప్రావీణ్యం పొందాడు. ముఖ్యంగా చెస్ లో రాణిస్తూ వచ్చాడు. ప్రపంచ స్థాయి పోటీల్లో సైతం పాల్గొంటూ వచ్చాడు. ఇప్పుడు కేవలం పరిశోధనాత్మకమైన, ప్రాచీనమైన డైనోసార్లు, ఇతరత్రా జంతువుల గురించి తనకు తెలిసిన విషయాన్ని పంచుకునేందుకు డినోడిట్స్ పేరుతో యూట్యూబ్ ఛానల్లో అందుబాటులోకి వస్తున్నాడు.కచ్చితంగా ఒక ముఖ్యమంత్రి మనవడు, ఒక మంత్రి కుమారుడు, ప్రముఖ హీరో మనవడు, సెలబ్రిటీ హోదాలో ఇప్పుడు దేవాన్సు యూట్యూబ్ ద్వారా పరిచయం అవుతుండడం మాత్రం గొప్ప విషయం. ఎందుకంటే ఆయన ఎంచుకునేందుకు సినిమా రంగంతో పాటు రాజకీయరంగం ఎలానూ ఉంది. ఒక పద్ధతి ప్రకారం దేవాన్ష్ విషయంలో అడుగులు వేస్తోంది నారా కుటుంబం. ఈ ప్రత్యేక యూట్యూబ్ ఛానల్స్ కు లక్షల్లో అప్పుడే వ్యూయర్ షిప్ వస్తోంది. మున్ముందు కచ్చితంగా ఇది సంచలనాలకు వేదిక కానుంది. ఎక్కువమంది నారా దేవాన్సు కు శుభాకాంక్షలు చెబుతున్నారు.దేవాన్ష్ ఒక యూట్యూబ్ ఛానల్ ను ప్రారంభించాడు. రాక్షస బల్లులు, శిలాజాలు, పురాతన అవశేషాల గురించి కొంతకాలంగా దేవాన్ష్ పరిశోధన చేస్తున్నాడు. వివిధ పుస్తకాలలో ప్రచురితమైన అంశాలను క్రోడీకరించి.. తాను తెలుసుకున్న విషయాలను.. ఆశ్చర్యానికి గురిచేసే అంశాలను.. ఆకట్టుకునే విధంగా రూపొందించాడు. ఈకాలపు పిల్లలకు అర్థమయ్యే విధంగా వాటిని రూపొందించాడు. వీటిని పాడ్ కాస్ట్ రూపంలో తన యూట్యూబ్ ఛానల్ లో ప్రసారం చేయబోతున్నాడు.సాధారణ యూట్యూబ్ ఛానల్ మాదిరిగా కాకుండా.. దానికోసం ఒక డైనోసార్ ప్రపంచాన్ని సృష్టించాడు దేవాన్ష్. ప్రాచీన ప్రపంచంలోకి ప్రేక్షకుడి లాగా తన తండ్రిని ఆహ్వానించాడు. దీనిపై అనేక ప్రశ్నలు నారా లోకేష్ అడిగితే.. దేవాన్ష్ ఏ మాత్రం తడుముకోకుండా సమాధానం చెప్పాడు. ఇదే విషయాన్ని నారా లోకేష్ సోషల్ మీడియాలో ప్రస్తావించారు. దీనికి సంబంధించిన స్పెషల్ వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.నారా దేవాన్ష్ కొంతకాలంగా శిలాజాలు.. పురాతన సంఘటనలు.. వందల సంవత్సరాల క్రితం జీవించిన జంతువులు.. వంటి వాటి గురించి తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. తాను తెలుసుకున్న విషయాలను.. పాడ్ కాస్ట్ రూపంలో చెప్పడానికి నారా దేవాన్ష్ ప్రయత్నిస్తున్నారు. నారా లోకేష్ ప్రోమో వీడియో రిలీజ్ చేయడంతో.. నారా దేవాన్ష్ యూట్యూబ్ ఛానల్ మీద అంచనాలు భారీగా పెరిగిపోయాయి.

## కమలంపై పసుపు గుర్రు




**విశాఖపట్టణం మే 19, పెన్ పవర్:** ఏపీలో కూటమి ప్రభుత్వానికి సారథ్యం వహిస్తోంది తెలుగుదేశం. కేంద్ర ప్రభుత్వంలో సైతం కీలక భాగస్వామి. అందుకే రాష్ట్ర ప్రయోజనాల తో పాటు రాజకీయ ప్రయోజనాల విషయంలో రాష్ట్రానికి పెద్ద పీట వేస్తోంది కేంద్రం. అయితే అదే స్థాయిలో ఏపీ నుంచి బిజెపి ప్రాతినిధ్యం కోరడం తెలుగుదేశం పార్టీకి లోటు. తాజాగా రాజ్యసభ పదవులకు సంబంధించిన ఎంపిక విషయంలో బిజెపి పట్టుబడుతుండడంతో టిడిపి సీనియర్లు మదన పడుతున్నారు. మరోసారి ఏపీ నుంచి రాజ్యసభ పదవి కోరుతోంది బిజెపి. కానీ ఆ పదవులపై ఆశలు పెట్టుకున్న తెలుగుదేశం సీనియర్లు పెదవి విరుస్తున్నారు. ఎన్ని రోజులపాటు పార్టీ కోసం కష్టపడితే.. తమకు ఎటువంటి ప్రయోజనం లేకుండా పోతుందని.. తమకు వచ్చే అవకాశాలను బిజెపి తన్నుకుపోతోందని ఆవేదనతో ఉన్నారు.ఏపీలో కూటమి అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతోంది. టిడిపి సీనియర్లు చాలామంది పదవుల కోసం ఎదురుచూస్తున్నారు. ఇందులో సీట్లు త్యాగం చేసిన వారు ఉన్నారు. టిడిపి ఆవిర్భావం నుంచి పనిచేస్తున్న వారు ఉన్నారు. అయితే ఈ రెండేళ్ల కాలంలో రెండుసార్లు రాజ్యసభ, అదే స్థాయిలో ఎమ్మెల్సీ పదవుల భర్తీ జరిగింది. ఆ సమయంలో బిజెపి ఎంట్రీ ఇస్తోంది. పదవులను తీసుకుంటోంది. రెండుసార్లు రాజ్యసభ పదవి అలానే తీసుకుంది. ఎమ్మెల్సీ పదవులను సైతం కూటమి ఖాతాలో పొందింది. ఇప్పుడు మరోసారి రాజ్యసభ పదవి కోరుతుండడంపై టిడిపి సీనియర్లలో ఆగ్రహం వ్యక్తం అవుతోంది.ఒకసారి బిజెపితో చెడి చాలా రకాలు ఇబ్బందులు పడ్డారు చంద్రబాబు. అందుకే కేంద్ర పెద్దలతో సఖ్యత గా గడుపుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రం నుంచి నలుగురు రాజ్యసభ సభ్యులు పదవీ విరమణ చేయనున్నారు. ఆ పదవులన్నీ టిడిపి కూటమికి దక్కనున్నాయి. అయితే ఇప్పుడు ఆ నాలుగింటిలో ఒక పదవిని కోరుతోంది బిజెపి. జనసేనకు ఒకటి సర్దుబాటు చేయాల్సి ఉంటుంది. ఎందుకంటే ఆ పార్టీకి రాజ్యసభలో ప్రాతినిధ్యం లేదు. అందుకే కచ్చితంగా ఇవ్వాల్సి ఉంటుంది. అయితే బిజెపితో పాటు జనసేనకు రెండు పోతే టిడిపికి మిగిలేది కేవలం రెండు మాత్రమే. ఆ రెండింటిలో పదవీ విరమణ చేస్తున్న సానా సతీష్ కు కొనసాగింపు ఇవ్వాల్సి ఉంటుంది. ఇక మిగిలింది ఒకటే. దానికోసం చాలామంది ఆశావహులు ఎదురుచూస్తున్నారు. బిజెపి పోటీలో లేకపోతే.. టిడిపి కి మూడు, జనసేనకు ఒకటి తేలిపోయేది. అలా కాకుండా బిజెపి సైతం ఒక పదవి కోరుతుండడం పై టీడీపీ సీనియర్లు ఆగ్రహంగా ఉన్నారు. కానీ రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా సర్దుబాటు చేసుకోవాల్సిందని చంద్రబాబు భావిస్తున్నారు. కానీ ఇన్ని రోజులు పార్టీ కోసం పనిచేసిన తమ పరిస్థితి ఏంటి అని టిడిపి సీనియర్లు మదనపడుతున్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# బీఎస్ఎఫ్ కి 'చికెన్ నెక్'.. చైనా వ్యూహాలకు చెక్.. బెంగాల్ సీఎం సువేందు సంచలనం



జాతీయ భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. దేశంలోనే అత్యంత వ్యూహాత్మక ప్రాంతమైన సిలిగురి కారిడార్ పరిధిలోని సరిహద్దు ప్రాంతాలలో 120 ఎకరాలకు పైగా భూమి, జాతీయ రహదారి మార్గాలను సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్)కి అప్పగించేందుకు తొలి క్యాబినెట్ భేటీలోనే ఆమోదం ముద్ర వేసిన సువేందు అధికారి తాజాగా మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఈశాన్య రాష్ట్రాలను భారతదేశ ప్రధాన భూభాగంతో కలిపే అత్యంత సున్నితమైన, వ్యూహాత్మక 22 కిలోమీటర్ల 'చికెన్ నెక్'గా పిలిచే సిలిగురి కారిడార్ లోని భూమిని బీఎస్ఎఫ్ కి అప్పగించాలని నిర్ణయం తీసుకున్నారు.

పశ్చిమ బెంగాల్ నూతన ముఖ్యమంత్రిగా సువేందు అధికారి పగ్గాలు చేపట్టడమే ఆలస్యం అన్నట్లు సంచలన నిర్ణయాలు తీసుకుంటున్నారు. ప్రధానంగా దశాబ్దాలుగా దేశ రక్షణకు సవాలు విసురుతున్న సమస్యలను చాకచక్యంగా పరిష్కరిస్తున్నారని అభినందనలు అందుకుంటున్నారు. రాష్ట్రంలోని అత్యంత సున్నితమైన, వ్యూహాత్మక 22 కిలోమీటర్ల 'చికెన్ నెక్' ప్రాంతంలో సరిహద్దు ఫెన్సింగ్ నిర్మాణానికి సీఎం సువేందు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఇందుకు వీలుగా భూమిని సరిహద్దు భద్రతా దళానికి అప్పగిస్తూ మంత్రివర్గంలో తీర్మానం చేశారు. 45 రోజుల్లోనే ఈ ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులను ముఖ్యమంత్రి సువేందు అధికారి ఆదేశించారు. బంగ్లాదేశ్‌తో సుదీర్ఘ సరిహద్దు కలిగిన ఈ ప్రాంతంలో పూర్తి పట్టు కేంద్రం చేతుల్లోకి వెళ్లనుండటం విశేషంగా వ్యాఖ్యానిస్తున్నారు.

**చికెన్ నెక్ రక్షణే దేశ రక్షణ**

భౌగోళికంగా 'సిలిగురి కారిడార్' లేదా చికెన్ నెక్ అనేది భారతదేశానికి అత్యంత బలహీనమైన, కీలకమైన లింక్ గా చెబుతున్నారు. చైనా, నేపాల్, భూటాన్, బంగ్లాదేశ్ దేశాల సరిహద్దులకు అత్యంత సమీపంలో ఉండే ఈ ఇరుకైన మార్గం ద్వారానే ఈశాన్య రాష్ట్రాలకు రవాణా, సైనిక బలగాల కదలికలు సాగుతాయని చెబుతున్నారు. ఇక బంగ్లాదేశ్ నుండి జరిగే అక్రమ చొరబాట్లు, ఉగ్రవాద మూలాల కదలికలు, నకిలీ నోట్ల చలామణి, డ్రగ్స్ స్మగ్లింగ్‌కు ఈ కారిడార్ ప్రధాన కేంద్రంగా మారిందనే ఆరోపణలు ఉన్నాయి. పశ్చిమబెంగాల్ ప్రభుత్వం తాజా నిర్ణయంతో ఇకపై దేశభద్రతకు ముప్పు వాటిల్లే కార్యక్రమాలకు అడ్డుకట్ట పడనుందని చెబుతున్నారు. సరిహద్దు వెంబడి ఫెన్సింగ్ లేని ప్రాంతాలలో బీఎస్ఎఫ్ కు భూమి లభించడం వల్ల, వ్యూహాత్మక వాచ్ టవర్ల నిర్మాణం, పెట్రోలింగ్ రోడ్ల ఏర్పాటు సులువవుతుందని సైనిక రంగ నిపుణులు చెబుతున్నారు. అదేసమయంలో దేశ రక్షణకు సంబంధించి కేంద్ర హోంశాఖ, రాష్ట్ర ప్రభుత్వం ఒకే తాటిపైకి రావడం వల్ల జాతీయ భద్రత మునుపెన్నడూ లేనంతగా పటిష్టం కానుందని వ్యాఖ్యానిస్తున్నారు. గత మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం ఈ భూమి బదిలీని కావాలనే తొక్కిపెట్టిందనే విమర్శలను గుర్తుచేస్తున్నారు. సరిహద్దు జిల్లాలైన మాల్దా, ముర్షిదాబాద్, దినాజ్‌పూర్, సిలిగురి ప్రాంతాలలో అక్రమ వలసదారులు కీలక ఓటు బ్యాంకుగా మారారని అంటున్నారు. బీఎస్ఎఫ్ పరిధిని పెంచితే తమ రాజకీయ ప్రయోజనాలకు గండి పడుతుందనే ఉద్దేశంతో గత ప్రభుత్వం భూసేకరణకు సహకరించలేదని పరిశీలకులు విశ్లేషిస్తున్నాయి. అయితే ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన సువేందు అధికారి ముందుగా ఈ సమస్యపైనే దృష్టి పెట్టి తన రాజకీయ ప్రత్యర్థి ఓటు బ్యాంకును దెబ్బతీశారని అంటున్నారు. సువేందు అధికారి తీసుకున్న ఈ 'ఫస్ట్ స్ట్రైక్' నిర్ణయం బెంగాల్ భవిష్యత్తుపై, దేశ భద్రతపై దీర్ఘకాలిక ప్రభావం చూపనుందని అంటున్నారు. సరిహద్దులు పూర్తిగా మూసివేయడటం వల్ల బెంగాల్‌లోని సరిహద్దు జిల్లాల్లో వేగంగా మారుతున్న జనాభా సమతుల్యత అదుపులోకి వస్తుందని చెబుతున్నారు. అదేసమయంలో చికెన్ నెక్ ప్రాంతాన్ని బ్లాక్ చేసి, ఈశాన్య భారతాన్ని వేరు చేయాలనే చైనా వ్యూహాలకు చెక్ చెప్పినట్లేనని విశ్లేషిస్తున్నారు.

# వచ్చే ఎన్నికల్లో మా ఆవిడ పోటీ: మంచు మనోజ్



కలెక్షన్ కింగ్ మోహన్‌బాబు చిన్నకుమారుడు మంచు మనోజ్.. తాజాగా సంచలన వ్యాఖ్యలు చేశారు. వచ్చే 2029 ఎన్నికల్లో తన సతీమణి మంచు మౌనిక ఎన్నికల రంగంలోకి దిగుతున్నట్టు వెల్లడించారు. రాజకీయం తమకు కొత్తకాదని పేర్కొన్న మంచు.. ప్రజాసేవ కోసమే రాజకీయాల్లోకి రావాలని నిర్ణయించు కున్నట్టు వెల్లడించారు. రాజకీయాల్లో ఇప్పటికే తాము భాగస్వామ్య మయ్యామని ఆయన తెలిపారు.

ప్రస్తుతం ఐక్య పేరుతో స్వతంత్ర సంస్థను స్థాపించిన మనోజ్ దంపతులు.. సమాజంలోని పేదల పక్షాన నిలబడుతామని ప్రకటించారు. వారి సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకువస్తామ న్నారు. ఈ క్రమంలో తమకుఎవరి సహాయం అవసరం లేదని.. తమ సొంత సొమ్మునే ఖర్చు పెడుతున్నామన్నారు. ఇది పూర్తిగా స్వచ్ఛంద సంస్థ అని వివరించారు. దీనిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావొచ్చన్నారు.

తన భార్య మౌనిక వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తారని మనోజ్ వెల్లడించారు. అయితే.. రాజకీయాలకు.. తాము స్థాపించిన ఐక్య సంస్థకు ఎలాంటి సంబంధం లేదన్నారు. రాజకీయాలు చేయడం.. రాజకీయాల్లో కొనసాగడం తమ రెండుకుటుంబాలకు కొత్తకాదన్నారు. మౌనిక తండ్రి, సోదరి కూడా రాజకీయాల్లోనేఉన్న విషయాన్నిఆయన గుర్తు చేశారు. తన తండ్రి కూడా రాజకీయాలు చేశారని .. ప్రస్తుతం కొంత గ్యాప్ వచ్చిందని చెప్పారు. తిరిగి రాజకీయాల్లోకి రావాలని నిర్ణయించుకున్నామన్నారు.

**ఏ పార్టీ.. ?**

అయితే.. తన సతీమణి మౌనిక ఏ పార్టీ నుంచి పోటీ చేస్తారన్న విషయంపై మనోజ్ స్పష్టత ఇవ్వలేదు. కానీ.. ఇటీవల కాలంలో ఈ కుటుంబం టీడీపీకి చేరువగా ఉంటోంది. తరచుగా మంత్రి నారా లోకేష్ తో నూ మనోజ్ భేటీ అవుతున్నారు. ఈ నేపథ్యంలో టీడీపీ తోనే వీరి రాజకీయాలు కొనసాగుతాయా? లేక.. వైసీపీ వైపు చూస్తారా? అనేది స్పష్టత రావాల్సి ఉంటుంది. మౌనిక సోదరి.. అఖిల ప్రియ ప్రస్తుతం ఆళ్లగడ్డ(కర్నూలు జిల్లా) నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఉన్నారు. గతంలో మంత్రిగా కూడా పనిచేశారు. మౌనిక తండ్రి నాగిరెడ్డి, తల్లి శోభ లుకూడా రాజకీయాల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నవారే కావడం గమనార్హం.

# ఇక.... డైలీనా?: మళ్లీ పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు!

దేశవ్యాప్తంగా పెట్రోలు, డీజిల్ ధరలు మరోసారి పెరిగాయి. ఇటీవల మూడు రోజుల కిందట పెట్రోలు, డీజిల్‌పై 3.4 రూపాయల చొప్పున పెంచిన విషయం తెలిసిందే. దీంతో దేశవ్యాప్తంగా కొన్ని వర్గాల ప్రజలు ఆందోళనకు కూడా దిగారు. ఇక, నిత్యావసర వస్తువుల నుంచి అన్ని వినియోగ వస్తువుల ధరలు కూడా పెరిగిపోయాయి. ఈ వ్యవహారంపై ఒకవైపు దేశంలో చర్చ జరుగుతున్న నేపథ్యంలో తాజాగా మరోసారి ధరలు పెరిగాయి. లీటరు పెట్రోలు, డీజిల్‌పై 90 పైసలు చొప్పున పెంచుతూ.. చమురు కంపెనీలు నిర్ణయించారు. మంగళ వారం ఉదయం 6 గంటల నుంచే ఈ నిర్ణయాన్ని అమలు చేస్తున్నాయి. దీంతో ధరలు మరింత పెరిగిన ట్టు అయింది. ఏపీలో లీటరు పెట్రోలు 114 రూపాయలకు చేరిపోయింది. ఇక, డీజిల్ 101 రూపాయలకు చేరింది. ఫలితంగా ఈ ప్రభావం నిత్యావసర సరుకుల ధరలపై ఎక్కువగా ఉంటుందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.




**డైలీ పెంచుతారా?**

ప్రస్తుతం పెరుగుతున్న ఇంధన ధరలను గమనిస్తే.. ఇక నుంచి ప్రతి రోజూ పెంచుతారా? అనే డౌట్ వస్తోంది. అయితే.. ఆ అవకాశం మెండుగానే ఉందని చమురు కంపెనీలు కూడా చెబుతున్నాయి. ప్రస్తుతం తమకు రోజుకు 500 కోట్ల రూపాయల మేరకు నష్టం వస్తోందని అంటున్నాయి. మరోవైపు.. కేంద్ర ప్రభుత్వం కూడా.. ఎక్సైజ్ సుంకాన్ని ఎత్తేసిన విషయం తెలిసిందే. అయినప్పటికీ.. కంపెనీలపై భారం పడుతోంది. దీంతో సుమారు.. 125 రూపాయల వరకు పెట్రోలు, డీజిల్ ధరలు పెరిగినా ఆశ్చర్యం లేదని అంటున్నారు.

**ఎందుకు?**

పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు.. రోజుకో తీరుగా మారుతున్నాయి. నిన్నటి వరకు యుద్ధ విరామం ప్రకటించామని చెబుతున్న అమెరికా అధ్యక్షుడు.. ఇప్పుడు ఏకంగా అణు యుద్ధం జరిగినా ఆశ్చర్యం లేదన్న సంకేతాలు ఇస్తున్నారు. మరోవైపు ఇరాన్ కూడా.. పౌరులను అప్రమత్తం చేస్తోంది. ఈ పరిణామాలతో అన్ని దేశాలు కూడా.. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకున్న చందంగా.. ప్రస్తుత సమయంలోనే ఇంధనాన్ని విరివిగా(యుద్ధ విరామం) కొనుగోలు చేస్తున్నాయి. దీంతో ధరలు ఆకాశాన్ని చేరుతున్నాయి.

# ఎంపీ కి జీతంతో పాటు ఎలాంటి ప్రయోజనాలు కలుగుతాయో మీకు తెలుసా?



భారతదేశంలో పార్లమెంట్ సభ్యుడు కావడం అనేది కేవలం అధికారం, బాధ్యతలతో కూడుకున్నది మాత్రమే కాదు. దేశ ప్రజల సేవ కోసం ఎన్నికయ్యే వీరికి ప్రభుత్వం తరపున భారీగా జీతభత్యాలు, రకరకాల ప్రయోజనాలు అందుతాయి. కేవలం నెలకు వచ్చే శాలరీ మాత్రమే కాకుండా ఉచిత నివాసం, ప్రయాణ సౌకర్యాలు, పెన్షన్, వైద్యం, ఉచిత విద్యుత్ వంటి ఎన్నో రకాల పన్ను రహిత సదుపాయాలు వీరికి లభిస్తాయి. సామాన్య ప్రజలకు ఆశ్చర్యం కలిగించే ఆ పూర్తి వివరాలు ఇలా వున్నాయి..

**అదిరిపోయే నెలవారీ జీతం:**

మన దేశంలో ఒక ఎంపీకి నెలకు బేసిక్ శాలరీ 1,24,000 రూపాయల వరకు ఉంటుంది. దీనితో పాటు పార్లమెంట్ సమావేశాలు జరిగినప్పుడు ప్రతిరోజూ హాజరైనందుకు అదనంగా డైలీ అలవెన్స్ కూడా ఇస్తారు. వీటన్నింటితో కలిపి ఒక ప్రజాప్రతినిధికి ప్రతి నెలా చేతికి వచ్చే అమౌంట్ చాలా ఎక్కువగా ఉంటుంది.

**ఉచిత ఫోన్, ఇంటర్నెట్ సదుపాయం:**

ఇక ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండటం కోసం వీరికి ఆఫీస్ ఖర్చుల కింద నియోజకవర్గ అలవెన్స్ లభిస్తుంది. అంతేకాక దీనితో పాటు ప్రతి సంవత్సరం లక్షకు పైగా ఉచిత ఫోన్ కాల్స్ మాట్లాడుకునే సదుపాయం, హై-స్పీడ్ ఇంటర్నెట్ కనెక్షన్ వుంటుంది ,వీటి కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా డబ్బులు సుమారు 1,50,000 రూపాయలు చెల్లిస్తుంది.

**ఉచిత విమాన, రైలు ప్రయాణాలు:**

ఎంపీలు తమ విధుల కోసం దేశవ్యాప్తంగా ప్రయాణించడానికి భారీగా రాయితీలు ఉంటాయి. ప్రతి సంవత్సరం వీరికి నిర్దేశిత సంఖ్యలో ఉచిత విమాన టికెట్లు లభిస్తాయి. అంతేకాదు, ఇండియన్ రైల్వేస్‌లో ఫస్ట్ క్లాస్ ఏసీలో తమ కుటుంబ సభ్యులతో కలిసి ఉచితంగా ప్రయాణించే గోల్డెన్ ఛాన్స్ వీరికి ఉంటుంది.

**ఉచిత విద్యుత్, వాటర్ సప్లై:**

ఢిల్లీ లేదా వారి సొంత నియోజకవర్గాల్లో ప్రభుత్వం కల్పించే క్వార్టర్స్ లేదా బంగ్లాలలో వీరు నివసిస్తారు. ఈ ఇళ్లకు ప్రతి సంవత్సరం ఒక లిమిట్ వరకు ఉచితంగా కరెంట్ దాదాపు 50,000 యూనిట్లు, అలాగే ఉచితంగా వాటర్ సప్లై వాడుకునే వీలుంటుంది. ఇక దీనివల్ల వీరికి పవర్ బిల్లుల భారం అస్సలు ఉండదు.

**మెడికల్ కేర్, లైఫ్ టైమ్ పెన్షన్:**

కేవలం పదవిలో ఉన్నప్పుడే కాకుండా, పదవీ కాలం ముగిసిన తర్వాత కూడా వీరికి బెనిఫిట్స్ అందుతాయి. సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్ కింద వీరికి, వీరి ఫ్యామిలీకి బెస్ట్ హాస్పిటల్స్‌లో ఉచిత వైద్యం లభిస్తుంది. అంతేకాదు, కేవలం ఒక్కసారి ఎంపీగా గెలిచినా కూడా జీవితాంతం నెలవారీ పెన్షన్ పొందే హక్కు వీరికి ఉంటుంది. అది సుమారు నెలకి 31,000 రూపాయలు వుంటుంది.

దేశ ప్రజల కోసం రేయింబవళ్లు కష్టపడే ప్రజాప్రతినిధులకు ప్రభుత్వం ఈ స్థాయి సదుపాయాలు కల్పించడం అవసరమే అయినప్పటికీ.. పన్నులు కట్టే సామాన్య జనానికి మాత్రం ఈ లిస్ట్ చూస్తే ముక్కున వేలేసుకోవడం ఖాయం. మరి మన టాక్స్ మనీతో వీరు పొందుతున్న ఈ విలాసవంతమైన బెనిఫిట్స్ వీరికి కలుగుతున్నాయి అని తెలిసి సామాన్య జనం ఆశ్చర్య పోతున్నారు.

# టెక్సాస్ లో టమోటాల కోసం లొల్లి.. భారతీయులపై తగ్గని విద్వేషం..

అమెరికా... అవకాశాల గని మాత్రమే కాదు.. అప్పుడప్పుడు 'అతి' మేధావులకు అడ్డా కూడా. ముఖ్యంగా మన దేశీయులు అక్కడ కష్టపడి ఎదుగుతుంటే.. చూసి ఓర్వలేక కొందరు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు కెమెరాలు పట్టుకుని రోడ్లపై పడుతున్నారు. తాజాగా టెక్సాస్‌లో ఇలాంటిదే ఒక విచిత్రమైన కాస్త 'ఘాటైన' సీన్ జరిగింది.

**సీన్ లోకి వచ్చిన 'కాంగ్రెస్' అభ్యర్థి!**

టెక్సాస్‌కు చెందిన నిక్ ప్లంబ్ అనే ఒక మహానుభావుడు ఉన్నాడు. ఈయన గారు గతంలో రిపబ్లికన్ పార్టీ తరఫున కాంగ్రెస్‌కు పోటీ చేసి పాపం గెలవలేదు లెండి ఖాళీగా ఉన్నట్టున్నారు. హ్యూస్టన్‌లోని మన భారతీయులు పెట్టిన "సంగం సూపర్ మార్కెట్" బయట మనవాళ్లు పెట్టిన కూరగాయలు, పండ్ల బుట్టలు ఈయన కంటపడ్డాయి. అంతే చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉందిగా... ఇంకేం, కెమెరా ఆన్ చేసి ఒక రేంజ్‌లో రెచ్చిపోయాడు.

**ప్లంబ్ గారి ఆవేదన ఇదీ**

"ఇండియాలోని థర్డ్ వరల్డ్ గల్లీలు ఇప్పుడు హ్యూస్టన్‌లోకి వచ్చేశాయి. రోడ్డు పక్కన, వేడి వాతావరణంలో కూరగాయలు పెట్టి ఫుడ్ సేఫ్టీని గాల్లో కలిపేశారు. ఇది అమెరికా... ఇక్కడ ఇలాంటి తక్కువ ప్రమాణాలు అస్సలు ఒప్పుకోం!" అంటూ సోషల్ మీడియాలో పెద్ద లెక్చరే దంచికొట్టాడు. భారతీయులపై ఉన్న కాస్త 'పాత కక్ష'ను ఇలా కూరగాయల వంకతో బయటపెట్టాడన్నమాట మన మాజీ అభ్యర్థి!

**క్లాస్ పీకబోతే... 'మాస్' కౌంటర్ ఇచ్చిన దేశీ ఓనర్!**



వీడియో వైరల్ అవ్వడమే తరువాయి... మన సంగం సూపర్ మార్కెట్ ఓనర్ గారు సీన్‌లోకి ఎంట్రీ ఇచ్చారు. నిక్ ప్లంబ్ ఏదో పెద్ద గొడవ జరుగుతుందని ఆశించి ఉంటాడు కానీ, మనోడు ఇచ్చిన కూల్ అండ్ స్ట్రాంగ్ కౌంటర్‌తో ప్లంబ్ గారి ఫ్యూజులు ఎగిరిపోయాయి.


**ఆ సంభాషణ హైలైట్స్ ఇవే**

"అయ్యా నిక్ గారూ... మీ వీడియో చూశాను. ఫుడ్ సేఫ్టీ గురించి చెప్పడం మంచిదే. కానీ ప్రస్తుతం స్టోర్‌లో భారీ సేల్ నడుస్తోంది. లోపల స్థలం లేక తాత్కాలికంగా కాసేపు బయట పెట్టాం. రాత్రి పూట లోపలే పెడతాం" అని చాలా పద్ధతిగా రూల్స్ వివరించాడు. "నేను 35 ఏళ్లుగా అమెరికాలోనే ఉంటున్నా. మీలాగే నేనూ గత ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్‌కే ఓటేశాను. అక్రమ వలసలను నేనూ అస్సలు ఒప్పుకోను" అని చెప్పేసరికి నిక్ ప్లంబ్ గారికి ఏం మాట్లాడాలో అర్థం కాలేదు. సొంత పార్టీ ఓటరునే టార్గెట్ చేశానా అని లోపల ఫీలయ్యుంటారు! "హెల్త్ ఇన్‌స్పెక్టర్ వచ్చి ఇవన్నీ పారేయమంటే ఇప్పుడే పారేస్తా. సమస్యల నుంచి పారిపోయే రకం కాదు నేను. నమ్మకం లేకపోతే మరో రెండు రోజులు పోయాక వచ్చి చూసుకో" అని ధైర్యంగా ఇన్విటేషన్ ఇచ్చాడు.

అమెరికాలో భారతీయుల ప్రాధాన్యం, ఎదుగుదల చూసి తట్టుకోలేక కొందరు ఇలాంటి 'చిన్నచిన్న' విషయాలను కూడా 'గ్లోబల్ ఇష్యూస్' లాగా పోస్ట్ చేస్తుంటారు. ఏదేమైనా మన దేశీ ఓనర్ గారు మాత్రం నిక్ ప్లంబ్ విద్వేష ప్రచారానికి తన 'కూల్ అండ్ స్మార్ట్' సమాధానంతో గట్టిగానే చెక్ పెట్టారు.

# మీ ఐఫోన్‌లో గ్రీన్, ఆరెంజ్ చుక్కలు కనిపిస్తున్నాయా?.. వాటి అర్థం ఇదే!

- ఐఫోన్‌లోని గ్రీన్, ఆరెంజ్ చుక్కలు మీ ప్రైవసీకి సంబంధించిన కీలక సంకేతాలు
- ఆకుపచ్చ చుక్క కనిపిస్తే మీ కెమెరా వాడుకలో ఉన్నట్లు అర్థం
- నారింజ రంగు చుక్క మీ మైక్రోఫోన్ యాక్టివ్‌గా ఉందని చెబుతుంది
- అనుమానం వస్తే కంట్రోల్ సెంటర్ ఓపెన్ చేసి ఏ యాప్ వాడుతుందో తెలుసుకోవచ్చు
- సెట్టింగ్స్‌లోకి వెళ్లి అనవసరమైన యాప్‌లకు కెమెరా, మైక్ పర్మిషన్లను ఆపేయవచ్చు




**హైదరాబాద్ పెన్ పవర్:** మీరు ఐఫోన్ వాడుతున్నారా? అయితే ఫోన్ కాల్స్ మాట్లాడేటప్పుడు లేదా వీడియో రికార్డ్ చేస్తున్నప్పుడు స్క్రీన్ పైభాగంలో చిన్నగా ఆకుపచ్చ లేదా నారింజ రంగు చుక్క కనిపించడాన్ని ఎప్పుడైనా గమనించారా? చాలామంది వీటిని చూసినా, వాటి గురించి పెద్దగా పట్టించుకోరు. కానీ, ఇవి యాపిల్ తన వినియోగదారుల ప్రైవసీ కోసం అందిస్తున్న అత్యంత కీలకమైన ఫీచర్లు. మీ ప్రమేయం లేకుండా ఏదైనా యాప్ మీ ఫోన్‌లోని కెమెరా లేదా మైక్రోఫోన్‌ను వాడుతుంటే, ఈ చుక్కలు మిమ్మల్ని అప్రమత్తం చేస్తాయి. డిజిటల్ భద్రతకు ప్రాధాన్యత పెరిగిన ఈ రోజుల్లో ఈ చిన్న సంకేతాల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవడం చాలా అవసరం.

**గ్రీన్ డాట్: కెమెరా యాక్టివ్‌గా ఉంది**

మీ ఐఫోన్ స్క్రీన్‌పై ఆకుపచ్చ చుక్క (గ్రీన్ డాట్) కనిపిస్తోందంటే, ఏదో ఒక యాప్ మీ కెమెరాను ఉపయోగిస్తోందని అర్థం. సాధారణంగా ఫొటోలు తీస్తున్నప్పుడు, వీడియో రికార్డ్ చేస్తున్నప్పుడు, ఫేస్‌టైమ్ లేదా ఇతర వీడియో మీటింగ్‌లలో ఉన్నప్పుడు ఇది కనిపించడం సహజం. ఒకవేళ ఏదైనా యాప్ కెమెరాతో పాటు మైక్రోఫోన్‌ను కూడా ఒకేసారి ఉపయోగిస్తున్నా, మీకు కేవలం ఆకుపచ్చ చుక్క మాత్రమే కనిపిస్తుంది. ఇది కెమెరా వినియోగానికి ప్రధాన సూచిక.

**ఆరెంజ్ డాట్: మైక్రోఫోన్ వాడుకలో ఉంది**

మీరు ఫోన్ కాల్స్ మాట్లాడుతున్నప్పుడు, వాయిస్ నోట్స్ రికార్డ్ చేస్తున్నప్పుడు, సిరితో మాట్లాడుతున్నప్పుడు లేదా వాయిస్ మెసేజ్‌లు పంపుతున్నప్పుడు స్క్రీన్‌పై నారింజ రంగు చుక్క (ఆరెంజ్ డాట్) కనిపిస్తుంది. మీ ఐఫోన్ మైక్రోఫోన్ యాక్టివ్‌గా ఉందని, మీరు మాట్లాడేది రికార్డ్ అవుతోందని చెప్పడమే దీని ఉద్దేశం.

**అనుమానం వస్తే ఏం చేయాలి?**

చాలా సందర్భాల్లో మనకు తెలిసే ఈ చుక్కలు కనిపిస్తాయి. కానీ, మీరు కెమెరా లేదా మైక్రోఫోన్‌తో సంబంధం లేని యాప్‌ను ఉపయోగిస్తున్నప్పుడు కూడా ఈ చుక్కలు కనిపిస్తే కాస్త అప్రమత్తంగా ఉండాలి. బహుశా ఏదైనా యాప్ బ్యాక్‌గ్రౌండ్‌లో మీ కెమెరా లేదా మైక్రోఫోన్‌ను యాక్సెస్ చేస్తుండవచ్చు. అనుమానం వచ్చిన వెంటనే, మీ ఐఫోన్ స్క్రీన్ పై కుడివైపు నుంచి కిందికి స్వైప్ చేసి కంట్రోల్ సెంటర్ ఓపెన్ చేయండి. అక్కడ పైభాగంలో, ఇటీవల ఏ యాప్ మీ కెమెరా లేదా మైక్రోఫోన్‌ను ఉపయోగించిందో పేరుతో సహా స్పష్టంగా చూపిస్తుంది.

వినియోగదారుల భద్రత దృష్ట్యా ఈ ఇండికేటర్లను డిజేబుల్ చేసే అవకాశాన్ని యాపిల్ ఇవ్వలేదు. ఒకవేళ ఏదైనా యాప్ అనవసరంగా మీ కెమెరా లేదా మైక్‌ను యాక్సెస్ చేస్తుందని మీకు అనుమానం ఉంటే, వెంటనే 'సెట్టింగ్స్' ఓపెన్ చేసి, ప్రైవసీ అండ్ సెక్యూరిటీ'లోకి వెళ్లి 'కెమెరా' లేదా 'మైక్రోఫోన్' ఆప్షన్‌ను ఎంచుకోవాలి. అక్కడ ఏయే యాప్‌లకు అనుమతులు ఉన్నాయో జాబితా కనిపిస్తుంది. నమ్మకం లేని లేదా అనవసరమైన యాప్‌లకు పర్మిషన్లను స్విచ్ ఆఫ్ చేయడం ద్వారా మీ ప్రైవసీని కాపాడుకోవచ్చు.

# వామ్మో.. పెట్రోల్, డీజిల్ రేట్ల బాదుడు! లీటరుకు మరో రూ.25 పెరిగే ఛాన్స్




**హైదరాబాద్ పెన్ పవర్:** ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగియటంతో గత 11 వారాలుగా స్థిరంగా ఉన్న ఇంధన ధరలకు ఎట్టకేలకు బ్రేక్ పడింది. ఆయిల్ కంపెనీలు రేట్ల పెంపును షురూ చేశాయి. దీంతో వారం రోజుల గ్యాప్ లోనే రెండోసారి ధరలు పెరిగాయి. దీంతో నేడు పెట్రోల్ ధర లీటరుకు 87 పైసలు, డీజిల్ ధర లీటరుకు 91 పైసలు పెరిగింది. ఈ బాదుడు ఇక్కడితో ఆగేలా లేదని.. రాబోయే రోజుల్లో లీటరుకు మరో రూ.25 వరకు పెరిగే అవకాశం ఉందని నోమురా సంస్థ తన అంచనాలు బయటపెట్టింది.

ఈ హఠాత్ ధరల పెంపు వెనుక అంతర్జాతీయ రాజకీయాలు, సముద్ర రవాణా ఆంక్షలు ఉన్నాయి. అమెరికా-ఇరాన్ దేశాల మధ్య యుద్ధ వాతావరణం కారణంగా ప్రపంచంలోనే అత్యంత కీలకమైన ముడిచమురు రవాణా మార్గం 'హార్ముజ్ జలసంధి'ని ఇరాన్ మూసివేసింది. దీంతో సరఫరా దెబ్బతిని ముడిచమురు ధరలు ఒక్కసారిగా పెరిగాయి. ఈ సంక్షోభాన్ని అధిగమించడానికి భారత్.. రష్యా, వెనిజులా నుంచి అదనపు ప్రీమియం చెల్లించి క్రూడ్ దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. పరిస్థితి తీవ్రతను గమనించిన ప్రధాని మోదీ.. ప్రజలు ఇంధనాన్ని పొదుపుగా వాడాలని, ఐటీ కంపెనీలు తమ ఉద్యోగులకు మళ్లీ వర్క్ ఫ్రమ్ హోమ్ ఇవ్వాలని ఇటీవల సూచించారు.

గత వారం పెట్రోల్ డీజిల్ మీద లీటరుకు రూ.3 చొప్పున పెంచినప్పటికీ ఆయిల్ కంపెనీల నష్టాలు పూడటం లేదని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. ఇండియన్ ఆయిల్, భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియం సంస్థలు పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ అమ్మకాల ద్వారా ప్రతిరోజూ ఏకంగా రూ.1,380 కోట్ల ఆదాయాన్ని నష్టపోతున్నాయి నోమురా, ఎలారా క్యాపిటల్ ఇచ్చిన సంయుక్త రిపోర్ట్ పేర్కొంది. గ్యాస్ సిలిండర్ ఒక్కంటిపై రూ.420 నుండి రూ.670 వరకు నష్టం వస్తోందట. ఇదే పరిస్థితి కొనసాగితే రాబోయే 2 నుండి 10 ఏళ్లలో ప్రభుత్వ రంగ ఆయిల్ కంపెనీలు తమ మొత్తం పెట్టుబడిని కోల్పోయి మూతపడే ప్రమాదం ఉందని నోమురా హెచ్చరించింది. ఈ భారీ నష్టాల నుంచి కంపెనీలను కాపాడేందుకు.. 2022 నాటి రష్యా-ఉక్రెయిన్ యుద్ధ సమయం లాగే, రాబోయే రోజుల్లో కూడా రోజుకు కొన్ని పైసల చొప్పున ధరలను పెంచే దిశగా మోడీ సర్కార్ ముందుకెళ్లే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

# గుళ్ళలోని బంగారాన్ని అమ్మేయబోతున్నారా..? కేంద్ర ఆర్థిక శాఖ కీలక ప్రకటన





**హైదరాబాద్ పెన్ పవర్:** దేశంలోని దేవాలయాలు, మతపరమైన సంస్థల దగ్గర ఉన్న బంగారాన్ని మోడీ ప్రభుత్వం స్వాధీనం చేసుకోబోతోందంటూ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో వస్తున్న వార్తలపై కేంద్ర ప్రభుత్వం ఎట్టకేలకు స్పందించింది. గుళ్ళలోని బంగారాన్ని మానిటైజ్ అంటే రూపంలోకి మార్చే ఆలోచనలు లేదా ప్లాన్స్ తమ ప్రభుత్వానికి లేదని కేంద్ర ఆర్థిక శాఖ స్పష్టమైన వివరణ ఇచ్చింది. ఇలాంటి ఊహాగానాలు, పుకార్లు పూర్తిగా అబద్ధమైనవని.. ప్రజలను తప్పుదోవ పట్టించేవిగా ఎక్స్ ఖాతాలో తేల్చేసింది. గుళ్ళల్లో భద్రపరిచిన బంగారానికి బదులుగా కేంద్ర ప్రభుత్వం టెంపుల్ ట్రస్టులకు 'గోల్డ్ బాండ్స్' జారీ చేయనుందని, ఇందుకు సంబంధించిన ప్రతిపాదనకు ఆమోదం పడిందంటూ ప్రచారం జరిగింది. దీనివల్ల ప్రజల్లో నెలకొన్న అనుమానాలను క్లియర్ చేసేందుకు ఆర్థిక శాఖ ఈ ప్రకటన విడుదల చేసింది. దేవాలయాల గోపురాలు, తలుపులు, ఇతర నిర్మాణాలపై ఉండే బంగారు పూతలను, ప్లేట్లను వ్యూహాత్మక బంగారు నిల్వలుగా పరిగణిస్తారనే ప్రచారంలోనూ ఎలాంటి నిజం లేదని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో స్పష్టం చేసింది. ఇలాంటి తప్పుడు వార్తలను ప్రజలు నమ్మవద్దని, ఇతరులకు షేర్ చేయవద్దని ప్రభుత్వం కోరింది. ఇలాంటి పుకార్లు సమాజంలో అనవసర గందరగోళాన్ని సృష్టిస్తాయని పేర్కొంది. అధికారిక పాలసీ నిర్ణయాలు, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన ఏ సమాచారమైనా కేవలం ప్రభుత్వ వెబ్‌సైట్లు, ప్రెస్ రిలీజ్‌లు, వెరిఫైడ్ అధికారిక సోషల్ మీడియా అకౌంట్ల ద్వారా మాత్రమే షేర్ చేయబడుతుందని వెల్లడించింది. కేంద్ర ప్రభుత్వం ఇలాంటి ఒక పుకారుపై వారం రోజుల్లోనే క్లారిటీ ఇవ్వడం ఇది రెండోసారి. దీనికి ముందు విదేశీ ప్రయాణాలపై ప్రభుత్వం కొత్తగా పన్ను విధించబోతోందనే వార్తలను స్వయంగా ప్రధాని మోడీ ఖండించారు. ప్రస్తుతానికి అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు విపరీతంగా పెరుగుతుండటంతో దేశీయంగా ఫారెక్స్ నిల్వలను కాపాడుకోవడం ప్రభుత్వానికి పెద్ద సవాలుగా మారింది. ఈ సంక్షోభాన్ని మేనేజ్ చేయడానికి కేంద్రం పెట్రోల్ ధరల పెంపు, బంగారం దిగుమతులపై పన్నులు పెంచడం, పొదుపు చర్యలు వంటి వివిధ మార్గాలను అన్వేషిస్తోంది. వీటి కోసం దేవాలయాల బంగారాన్ని ముట్టుకునే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని కేంద్రం ఖరాఖండిగా చెప్పేసింది.

# గౌతమ్ అదానీకి క్లీన్ చిట్.. అమెరికాలో కేసులన్నీ పర్మనెంట్‌గా క్లోజ్, దూసుకెళ్తున్న అదానీ స్టాక్స్



**హైదరాబాద్ పెన్ పవర్:** భారతీయ అపర కుబేరుడు, అదానీ గ్రూప్ అధినేత గౌతమ్ అదానీకి అమెరికాలో చాలా పెద్ద ఊరట లభించింది. ఆయనపై నమోదైన అన్ని రకాల క్రిమినల్, సెక్యూరిటీస్ ఫ్రాడ్ ఆరోపణలను అమెరికా న్యాయ శాఖ శాశ్వతంగా కొట్టివేసింది. న్యూయార్క్ కోర్టులో నడుస్తున్న ఈ హై-ప్రొఫైల్ కేసును 'విత్ ప్రిజుడీస్' కింద కొట్టేయాలని ప్రాసిక్యూటర్లు కోరడంతో.. ఈ కేసును ఇక ఎప్పటికీ తిరిగి తెరిచే అవకాశం లేకుండా పర్మనెంట్ గా క్లోజ్ చేశారు. గౌతమ్ అదానీతో పాటు ఆయన మేనల్లుడు సాగర్ అదానీపై ఉన్న ఆరోపణలన్నీ దీంతో పటాపంచలై క్లీన్ చిట్ వచ్చేసింది.

**కేసు కొట్టేయడానికి అసలు కారణాలు..**

భారత్‌లో సోలార్ ప్రాజెక్టుల కాంట్రాక్టుల కోసం అదానీ గ్రూప్ లంచాలు ఇచ్చిందంటూ.. అమెరికా ఇన్వెస్టర్లను తప్పుదోవ పట్టించిందంటూ గతంలో ఆరోపణలు వచ్చాయి. అయితే సుదీర్ఘ లీగల్ పోరాటం తర్వాత ఈ కేసులో అదానీకి వ్యతిరేకంగా ఎలాంటి సరైన ఆధారాలు లేవని, పైగా ఈ వ్యవహారానికి అమెరికాతో నేరుగా ఎటువంటి సంబంధాలు లేవని అమెరికా ప్రాసిక్యూటర్లు తేల్చారు. ఈ కేసుపై మరిన్ని వనరులను, సమయాన్ని వృథా చేయదలచుకోలేదని కోర్టుకు తెలిపారు.

దీనికి తోడు గత కొన్ని రోజులుగా అదానీ గ్రూప్ అమెరికాలోని ఇతర లీగల్ వివాదాలను సైతం సెటిల్ చేసుకుంది. యూఎస్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ సివిల్ కేసులను ఎలాంటి తప్పు ఒప్పుకోకుండానే గౌతమ్ అదానీ 6 మిలియన్ డాలర్లు, సాగర్ అదానీ 12 మిలియన్ డాలర్లు చెల్లించి పరిష్కరించుకున్నారు. అలాగే ఇరాన్ ఆంక్షల ఉల్లంఘనకు సంబంధించిన ఎల్‌పీజీ దిగుమతుల వివాదాన్ని కూడా యూఎస్ ట్రెజరీకి 275 మిలియన్ డాలర్లు చెల్లించి, పూర్తి సహకారం అందిస్తూ అదానీ గ్రూప్ ముగించింది.

**రాకెట్‌లా దూసుకెళ్తున్న అదానీ గ్రూప్ స్టాక్స్..**

అమెరికా కోర్టు నుండి వచ్చిన ఈ సంచలన తీర్పుతో అదానీ గ్రూప్ కంపెనీల షేర్లు భారతీయ స్టాక్ మార్కెట్లో భారీ లాభాలతో దూసుకుపోతున్నాయి. ఇన్వెస్టర్లలో నమ్మకం పెరగడంతో గ్రూప్ స్టాక్స్ అన్నీ గ్రీన్ జోన్‌లోకి వచ్చాయి. అదానీ ఎంటర్‌ప్రైజెస్, అదానీ గ్రీన్ ఎనర్జీ, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్, అదానీ పోర్ట్స్, ఏసీసీ, అంబుజా సిమెంట్స్ ఇంట్రాడేలో లాభాల జోరును కొనసాగిస్తున్నాయి. మట్టుత్వానికి అమెరికాలో కేసుల క్లోజర్ అదానీ గ్లోబల్ బిజినెస్ విస్తరణకు ఉన్న పెద్ద అడ్డంకిని తొలగించినట్లయింది. హిండెన్‌బర్గ్ వివాదం తర్వాత అదానీ కెరీర్‌లో ఇదొక అతిపెద్ద లీగల్ విజయంగా కార్పొరేట్ వర్గాలు భావిస్తున్నాయి.

# ఇకపై పేరెంట్స్ ఫోన్లతో పనిలేదు.. పిల్లల కోసమే ప్రత్యేకంగా 'పేటీఎం పాకెట్ మనీ'




**హైదరాబాద్ పెన్ పవర్:** డిజిటల్ పేమెంట్స్ దిగ్గజం పేటీఎం సరికొత్త ఫీచర్‌ను తీసుకొచ్చింది. బ్యాంక్ అకౌంట్ లేని టీనేజర్లు సైతం తమ సొంత మొబైల్ ఫోన్ల ద్వారా యూపీఐ పేమెంట్లు చేసుకునేలా 'పేటీఎం పాకెట్ మనీ' ఫీచర్‌ను మే 18న లాంచ్ చేసింది. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా 2024 ఆగస్టులో ప్రవేశపెట్టిన 'యూపీఐ సర్కిల్' టెక్నాలజీ ఆధారంగా ఈ సేవలు పనిచేస్తాయి. ఈ కొత్త ఫీచర్ ద్వారా స్కూల్, కాలేజీ విద్యార్థులు క్యాష్ కోసం తల్లిదండ్రులపై ఆధారపడాల్సిన అవసరం ఉండదు. అలాగే ప్రతిదానికీ ఓటీపీలు అడగడం, వాట్సాప్‌లో క్యూఆర్ కోడ్‌లు పంపాల్సిన తలనొప్పులు ఇకపై ఉండబోవు. ఈ ఫీచర్ టీనేజర్లకు స్వేచ్ఛను ఇవ్వడమే కాకుండా.. తల్లిదండ్రులకు పూర్తి నియంత్రణను అందిస్తుంది. పేరెంట్స్ తమ బ్యాంక్ అకౌంట్ ద్వారా పిల్లలకు నెలకు ఎంత ఖర్చు చేయాలో లిమిట్ సెట్ చేయవచ్చు ఇందులో. అలాగే పేటీఎం స్పెండ్ సమ్మరీ ఫీచర్ ద్వారా పిల్లలు ఎక్కడెక్కడ, దేనికోసం డబ్బులు ఎంత ఖర్చు చేస్తున్నారో రియల్ టైమ్‌లో ట్రాక్ చేయవచ్చు. దీనివల్ల పిల్లల్లో చిన్నతనం నుంచే బాధ్యతాయుతమైన మనీ హ్యాబిట్స్ అలవడుతాయి. ఈ పాకెట్ మనీ సేవలను సేవింగ్స్, కరెంట్ అకౌంట్లపై యాక్టివేట్ చేసుకోవచ్చు. అయితే దీని ద్వారా అంతర్జాతీయ పేమెంట్లు చేయడం, క్యాష్ విత్‌డ్రా చేసుకోవడం లాంటివి మాత్రం కుదరదు. సేఫ్టీ పరంగా పేటీఎం ఇందులో కఠినమైన రూల్స్ పెట్టింది. ఒక సింగిల్ పేమెంట్ గరిష్ఠంగా రూ.5వేల వరకు మాత్రమే చేయొచ్చు. అలాగే నెలకు మొత్తం రూ.15వేలు పరిమితి ఉంటుంది. అంతేకాదు ఫీచర్ సెటప్ చేసిన మొదటి 30 నిమిషాల్లో కేవలం రూ.500 వరకు, మొదటి 24 గంటల్లో రూ.5వేల వరకు మాత్రమే ట్రాన్సాక్షన్లు జరిగేలా ఇన్‌బిల్ట్ సేఫ్టీ కంట్రోల్స్ ఉన్నాయి. ఈ సేవలను వినియోగించాలంటే మొబైల్ డివైజ్ లాక్ తప్పనిసరి. తల్లిదండ్రులు తమ పేటీఎం యూపీఐ పిన్ ఉపయోగించి ఎప్పుడైనా ఈ యాక్సెస్‌ను మార్చొచ్చు లేదంటే పూర్తిగా రద్దు చేయవచ్చు. దీన్ని యాక్టివేట్ చేయడం చాలా ఈజీ. మొదట పేటీఎం యాప్‌ను లేటెస్ట్ వెర్షన్‌కి అప్‌డేట్ చేయాలి. యాప్ ఓపెన్ చేసి 'టు మొబైల్- కాంటాక్ట్' ఆప్షన్‌పై క్లిక్ చేసి, అక్కడ 'పాకెట్ మనీ' ఆప్షన్ ని ఎంచుకోవాలి. ఆ తర్వాత పిల్లల కాంటాక్ట్ నంబర్ లేదా వారి యూపీఐ ఐడీని ఎంటర్ చేసి, అవసరమైన డాక్యుమెంట్ వెరిఫికేషన్ పూర్తి చేయాలి. అనంతరం నెలకు ఎంత లిమిట్ పెట్టాలో సెలెక్ట్ చేసుకుని.. మీ ప్రైమరీ బ్యాంక్ అకౌంట్‌ను ఎంచుకుని పేటీఎం యూపీఐ పిన్ ఎంటర్ చేయాలి. చివరిగా అవతలి వ్యక్తి ఫోన్‌కు వచ్చే ఇన్విటేషన్‌ను వారు యాక్సెప్ట్ చేస్తే పేటీఎం పాకెట్ మనీ యాక్టివేట్ అయిపోతుంది.



# హానికరమైన అవపాతాలు

మనుషులు, మొక్కలు, జలచరాలు తదితర జీవులతో పాటు నేలలు, కట్టడాలపైనా ఆమ్లవర్షాలు హానికరమైన ప్రభావాన్ని చూపుతున్నాయి. సల్ఫర్ డయాక్సైడ్, నైట్రోజన్ డయాక్సైడ్ ఉద్గారాలతో వాతావరణంలోని నీటి బిందువులు కలుషితమై వర్షం, మంచు, పొగమంచు, పొడి ధూళి రూపంలో భూమిపై పడుతోంది. వాతావరణంలోని కాలుష్య కారకాలకు తోడు శిలాజ ఇంధనాల దహనంతో తలెత్తుతున్న ఈ పరిస్థితులకు ప్రభావాలు, పర్యవసానాలు, నియంత్రణ చర్యల గురించి పోటీ పరీక్షార్థులకు పరిజ్ఞానం ఉండాలి. ఆమ్ల వర్షాలు ప్రపంచవ్యాప్తంగా సృష్టించిన అనర్థాలు, పర్యావరణ వ్యవస్థలతో పాటు మనుషుల ఆరోగ్యంపై కలిగిస్తున్న దుష్ప్రభావాలపై అవగాహన పెంపొందించుకోవాలి.

నీటి ద్రావణానికి ఉండే ఆమ్లత్వం లేదా క్షారత్వాన్ని కొలవడానికి పీహెచ్ స్కేలు ఉపయోగిస్తారు. 1909లో సోరెన్‌సన్ అనే డానిష్ శాస్త్రవేత్త ఈ స్కేలును కనిపెట్టారు. ఇందులో '0' (బలమైన ఆమ్లం) నుంచి 14 (బలమైన ఆల్కలీన్) వరకు రీడింగ్ ఉంటుంది. స్కేలులో పాయింట్ 7 తటస్థతను సూచిస్తుంది.

**ఆమ్ల వర్షాలు**

అన్ని రకాల ఆమ్ల అవపాతాలను వివరించడానికి ఉపయోగించే విస్తృత పదం 'ఆమ్ల వర్షం (యాసిడ్ రెయిన్)'..వాతావరణ కాలుష్య కారకాలైన సల్ఫర్, నత్రజని ఆక్సైడ్‌లు సల్ఫ్యూరిక్, నైట్రిక్ ఆమ్లాలుగా మారినప్పుడు అవపాతం మరింత ఆమ్లంగా మారుతుంది. ఆమ్ల నిక్షేపణ, ఆమ్ల వర్షం, ఆమ్ల అవపాతం తదితరాలన్నీ వాయు కాలుష్య రూపాలే. 'యాసిడ్ రెయిన్' అనే పదాన్ని మొదటగా 1870లో రాబర్ట్ అంగస్ స్మిత్ అనే శాస్త్రవేత్త ఇంగ్లండ్‌లోని మాంచెస్టర్ నగరంలో ఉపయోగించారు. ఆమ్లవర్షం సమస్య కొత్తదేమీ కాదు. కానీ సమస్య స్వభావం పట్టణాలు, నగరాలకు విస్తరించడంతో అంతర్జాతీయ సమస్యగా మారింది. స్మిత్ కాలంలో పట్టణాలు, నగరాల్లో ఆమ్లవర్షం కురిసింది. ప్రస్తుతం వాతావరణంలోకి కాలుష్యాన్ని వెదజల్లే పొడవైన చిమ్నీలను ప్రవేశపెట్టడంతో కాలుష్య కారకాలు వేల కిలోమీటర్లు రవాణా అవుతున్నాయి.

**ఆమ్ల కాలుష్య కారకాల మూలాలు:**

వాతావరణంలో కార్బన్ డయాక్సైడ్ వల్ల అవపాతం సహజంగా ఆమ్ల స్వభావంతో ఉంటుంది. శిలాజ ఇంధనాలను మండించడం వల్ల సల్ఫర్ డయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్ ఉత్పత్తి అవుతాయి. ఇవి అవపాతం ఆమ్ల గుణాన్ని పెంచుతాయి. సల్ఫర్ డయాక్సైడ్, నత్రజని ఆక్సైడ్‌ల ఉత్పత్తి, అగ్ని పర్వతాలు, మహాసముద్రాలు, జీవక్షయం, అడవుల్లో మంటలు మొదలైనవి ఆమ్ల కాలుష్యానికి సహజ కారణాలు. వాటితోపాటు దహన వనరులు కూడా కారకాలే.ఇటీవలి దశాబ్దాల్లో విద్యుత్తు డిమాండ్, మోటారు వాహనాల సంఖ్య పెరగడంతో ఆమ్లీకరణ కాలుష్య కారకాలు, ఉద్గారాలు విపరీతంగా పెరిగాయి. 1950 తర్వాత వచ్చిన పరిణామాలతో కాలుష్య కారక ఉద్గారాలు ఉత్తరార్ధ గోళంలో, ముఖ్యంగా ఐరోపా, ఉత్తర అమెరికాల్లో కేంద్రీకృతమయ్యాయి. దీంతో ఆ దేశాల్లో అవపాతం ఆమ్ల స్వభావాన్ని సంతరించుకుంది. 1970, 1980లో స్కాండినేవియన్ దేశాలు చెట్లు, మంచినీటిపై ఆమ్ల ప్రభావాలను గుర్తించాయి. దానికి కారణమైన కాలుష్యాల్లో ఎక్కువ భాగం ఇతర దేశాల నుంచి రవాణా అయినవే అని గ్రహించారు. దీంతో ఆమ్ల వర్షం అంతర్జాతీయ ఆందోళనగా మారింది.

**ఆమ్ల వర్షం ప్రభావాలు**

**చేప జాతులకు ముప్పు**

ఆమ్ల వర్షం కారణంగా జర్మనీ, ఇతర ఐరోపా దేశాల్లోని అనేక నీటివనరుల పీహెచ్ విలువ ఐదు కంటే తక్కువగా ఉంటుంది. ఈ ఆమ్ల స్థాయి అనేక చేప జాతులకు ప్రాణాంతకం. ఆమ్ల నీరు మట్టి నుంచి అల్యూమినియాన్ని విడుదల చేస్తుంది. ఇది ప్రవాహాల్లో కలిసి నీటి వనరుల్లోకి చేరుతుంది. ఆల్కలీన్ లేదా న్యూట్రల్ సరస్సుల్లో రాళ్లు, మట్టి, సెడిమెంట్లలో అల్యూమినియం సాంద్రత తక్కువగా ఉంటుంది. పీహెచ్ తగ్గినప్పుడు గతంలో కరగని అల్యూమినియం నీటి ద్రావణంలోకి వెళుతుంది. దాంతో చేపలకు ఆక్సిజన్ సరఫరా తగ్గిపోతుంది.

**భౌగోళిక పర్యావరణ వ్యవస్థపై ప్రభావం**

1) కిరణజన్య సంయోగక్రియ, పెరుగుదల రేటు తగ్గుతుంది.
2) కరవు, వ్యాధులకు సున్నితంగా మారుతుంది.
3) బీన్స్, ముల్లంగి, పాలకూర లాంటి వివిధ రకాల పంటల్లో ఎదుగుదల మందగిస్తుంది.
4) నైట్రోజన్ ఫిక్సింగ్ బ్యాక్టీరియా కార్యకలాపాలు తీవ్రంగా ప్రభావితమవుతాయి. ఇది చివరికి నైట్రోజన్ వలయానికి ఆటంకం కలిగిస్తుంది.
5) స్ప్రూస్, పైన్ బూడిద, బిర్చ్ మొదలైన చెట్లు ఆమ్ల నిక్షేపణకు ఎక్కువగా గురవుతాయి.



**సరస్సు పర్యావరణ వ్యవస్థపై ప్రభావం**

అమెరికా, కెనడా, నార్వే తదితర దేశాల్లో వేలాది సరస్సులు ఆమ్లత్వం వల్ల నిరుపయోగంగా మారాయి. ఇందులో ఫైటోప్లాంక్టన్ తక్కువ స్థాయిలో ఉంటుంది. పెంకులున్న నత్తలు, క్లామ్స్, ఇతర జంతువులు ఆమ్ల నీటిలో సులభంగా కరిగిపోతాయి. వీటితో పాటు చేపలూ మరణిస్తాయి. డ్రాగన్ ఫ్లై లార్వా, వాటర్ బోట్ మ్యాన్ లాంటి కొన్ని కీటకాలు ఆమ్ల సరస్సుల్లో ఆహార గొలుసు పైభాగంలో ఉన్న చేపల స్థానాన్ని భర్తీ చేస్తాయి. నీటి మొక్కలు చనిపోతాయి. సరస్సు నాచుతో నిండిపోయి, ఇతర సూక్ష్మజీవులూ నశిస్తాయి.




**నిర్మాణ సామగ్రి నష్టం**

ఆమ్ల వర్షంతో రంగులు, స్టీల్, ప్లాస్టిక్ తదితర భవన నిర్మాణ సామగ్రితో పాటు పాలరాయి, సున్నపురాయి మొదలైన వాటికి నష్టం జరుగుతుంది. వాతావరణంలో పెరిగిన ఆమ్లత వల్లే తాజ్‌మహల్ సహజ సౌందర్యం మసకబారుతోంది. దీనికి 40 కిలోమీటర్ల దూరంలో చమురుశుద్ధి కర్మాగారం ఏర్పాటు చేయడమే ఇందుకు కారణం.

**మానవాళికి రోగాలు**

వాతావరణ ఆమ్లత్వం దీర్ఘకాలిక శ్వాసకోశ సమస్యలను కలిగిస్తుంది. రాగి, కాడ్మియం, జింక్, పాదరసం తదితర భార లోహాలు ఆమ్ల వర్షం ద్వారా నేల, శిలల నుంచి విడుదలవుతాయి. ఇవి ఆహార గొలుసులోని మొక్కలు, జంతువుల ద్వారా లేదా తాగునీటి రూపంలో మనుషుల శరీరంలోకి చేరతాయి. వాహనాల్లో ఇంధనం మండినప్పుడు వాయు కాలుష్య కారకాలు ఉత్పత్తి అవుతాయి. యూఎస్, జపాన్ 1970ల్లో మోటారు వాహనాల ఉద్గారాలను నియంత్రించడానికి కఠినమైన ప్రమాణాలను ప్రవేశపెట్టాయి.వాహన ఉద్గారాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా మనుషుల ఆరోగ్యానికి ప్రమాదకరం. వాటి ప్రభావంతో రక్తానికి ఆక్సిజన్ మోసే సామర్థ్యం క్షీణించడంతోపాటు, శ్వాస సమస్యలు ఏర్పడతాయి. ఉత్ప్రేరక కన్వర్టర్ల వాడకంతో వాహనాల ఉద్గారాలను తగ్గించవచ్చు.

**పరిష్కార మార్గాలు**

**పారిశ్రామిక ఉద్గారాల నియంత్రణ:** అనేక పారిశ్రామిక వనరుల్లో దహన ప్రక్రియల కారణంగా సల్ఫర్ డయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్‌ల ఆమ్ల ఉద్గారాలు ఉత్పన్నమవుతాయి. వాటిని తగ్గించడానికి పలు సాంకేతికతలు అందుబాటులో ఉన్నాయి. వాటిని దహనానికి ముందు, దహన సమయంలో లేదా తర్వాత ఉపయోగించవచ్చు.

**ప్రత్యామ్నాయ ఇంధనాలు:** కొన్ని ఇంధనాలు సహజంగానే ఆమ్ల ఉద్గారాల పరంగా తక్కువ కాలుష్యాన్ని ఉత్పత్తి చేస్తాయి. కాల్చే బొగ్గులో ఉన్న సల్ఫర్ పరిమాణం ఆధారంగా కాలుష్యం పెరుగుతుంది. థర్మల్ కేంద్రాల్లో తక్కువ సల్ఫర్ ఉండే శిలాజ ఇంధనాల వినియోగాన్ని ప్రోత్సహించడం, జల, పవన విద్యుత్తు, అలల విద్యుత్తు లాంటి ప్రత్యామ్నాయ ఇంధన వనరులను ఉపయోగించుకోవడం మొదలైన చర్యలు కాలుష్యాన్ని తగ్గిస్తాయి. డీ-సల్ఫరైజేషన్ ప్రక్రియ వినియోగం, ఇంజిన్లలో మార్పులు తదితర పద్ధతులు కూడా మేలు చేస్తాయి.

ఆమ్ల జలాల్లో హేచరీ చేపలు: ఆమ్లీకరించిన సరస్సుల్లో పర్యావరణ సమతౌల్యత నిర్వహణకు ఈ విధానాన్ని చేపడతారు. చేపల సంఖ్య మరింత క్షీణించడకుండా ఈ పద్ధతి ఉపయోగపడుతుంది. భూమి క్షీణతతో భారత వ్యవసాయ ఉత్పత్తిలో 11%-26% వరకు నష్టపోతుండగా, ఆమ్ల వర్షాలు మరింత పెంచుతున్నాయి.

# రిటైర్మెంట్ ప్రకటించని మీా ధోని.. చెపాక్‌లో భావోద్వేగానికి గురైన ఫ్యాన్స్! 2027లో 'తలా' రీఎంట్రీ?



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026 సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ అభిమానులు అత్యంత ఆసక్తిగా ఎదురుచూసిన క్షణం రానే వచ్చింది. సోమవారం రాత్రి చెపాక్ వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్ తో జరిగిన మ్యాచ్ ముగిసిన తర్వాత.. టీమిండియా లెజెండ్ మహేంద్ర సింగ్ ధోని రిటైర్మెంట్ ప్రకటిస్తారనే ఊహాగానాలు గట్టిగా వినిపించాయి. కానీ, ధోని మరోసారి తన రిటైర్మెంట్‌పై ఎలాంటి అధికారిక ప్రకటన చేయకుండా సస్పెన్స్ కొనసాగించడంతో అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు.

**నో రిటైర్మెంట్:**
సన్‌రైజర్స్‌తో మ్యాచ్ ముగిసిన అనంతరం, ధోని సీఎస్‌కే జట్టు సభ్యులతో కలిసి మైదానంలో కాసేపు తిరిగారు. కిక్కిరిసిపోయిన ఎంఏ చిదంబరం స్టేడియం (చెపాక్) మొత్తం 'ధోని.. ధోని..' అనే నినాదాలతో హోరెత్తిపోయింది. ఈ సీజన్‌లో చెన్నైకి ఇదే చివరి హోమ్ మ్యాచ్ కావడంతో.. 'తలా' తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని ప్రకటిస్తాడని ఫ్యాన్స్ భావించారు. కానీ, ధోని మౌనంగానే ఉండిపోవడంతో, ఆయన వచ్చే ఏడాది (IPL 2027) కూడా ఆడబోతున్నాడనే కొత్త ఆశలు చిగురించాయి.

**గాయం కారణంగా మ్యాచ్‌కు దూరం:**
గాయం కారణంగా సన్‌రైజర్స్‌తో జరిగిన ఈ కీలక మ్యాచ్‌లో ధోని బరిలోకి దిగలేదు. అయినప్పటికీ, మ్యాచ్ ముగిశాక ఆయన స్టేడియంలోకి అడుగుపెట్టడమే ఆ రాత్రికి అతి పెద్ద హైలైట్‌గా నిలిచింది. అంతకుముందు, స్టేడియం స్టాండ్స్‌లో ధోని భార్య సాక్షి ధోనితో పాటు ఆయన చిన్ననాటి స్నేహితుడు 'చిత్తు' కూడా కనిపించడంతో.. ఇది ధోనికి ఫేర్‌వెల్ (వీడ్కోలు) మ్యాచ్ కాబోతుందనే ప్రచారం ఊపందుకుంది.

**హర్భజన్ సింగ్ ఆసక్తికర వ్యాఖ్యలు:**
మాజీ టీమిండియా స్పిన్నర్ హర్భజన్ సింగ్ ఈ విషయంపై స్పందిస్తూ.. ఒకవేళ ధోని ఈ సీజన్‌తో ఐపీఎల్‌కు గుడ్ బై చెప్పకపోతే, చెన్నై మైదానంలోనే తన చివరి టీ20 మ్యాచ్ ఆడాలనే తన పాత వాగ్దానాన్ని నెరవేర్చడానికి ఆయన వచ్చే ఏడాది ( కూడా బరిలోకి దిగుతాడని అర్థం చేసుకోవచ్చని పేర్కొన్నారు. కాగా ధోని ఐపీఎల్ భవిష్యత్తుపై ప్రస్తుతానికి ఎలాంటి అధికారిక క్లారిటీ లేదు. కానీ తమ ప్రియమైన క్రికెటర్ 'తలా' మళ్లీ పసుపు రంగు జెర్సీ ధరించి ఐపీఎల్ 2027లో చెపాక్ పిచ్‌పై అడుగుపెట్టాలని కోట్లాది మంది ఎంఎస్ అభిమానులు బలంగా కోరుకుంటున్నారు.

# రిషభ్ పంత్‌కి బీసీసీఐ బిగ్ షాక్.. వైస్ కెప్టెన్‌గా కేఎల్ రాహుల్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆఫ్ఘనిస్తాన్‌తో జరగబోయే ఏకైక టెస్ట్ మ్యాచ్, అలాగే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ కోసం భారత క్రికెట్ నియంత్రణ మండలి మంగళవారం జట్లను ప్రకటించింది. చీఫ్ సెలక్టర్ అజిత్ అగర్కర్, బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా నేతృత్వంలో జరిగిన సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రెండు ఫార్మాట్లకు శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా వ్యవహరించనుండగా, వైస్ కెప్టెన్సీ మార్పులు, సీనియర్ల విశ్రాంతి, కొత్త ఆటగాళ్ల ఎంపిక హాట్ టాపిక్‌గా మారింది.

**వైస్ కెప్టెన్‌గా కేఎల్ రాహుల్:**
వైట్-బాల్ క్రికెట్‌లో వరుసగా విఫలమవుతూ గడ్డు కాలాన్ని ఎదుర్కొంటున్న స్టార్ వికెట్ కీపర్ రిషభ్ పంత్‌కు కాస్త ఒత్తిడి తగ్గించేందుకు సెలక్టర్లు కీలక నిర్ణయం తీసుకున్నారు. అతన్ని టెస్ట్ వైస్ కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పించి, ఆ బాధ్యతలను కేఎల్ రాహుల్‌కు అప్పగించారు. అయితే పంత్ కేవలం వికెట్ కీపర్ బ్యాటర్‌గా జట్టులో కొనసాగుతాడు.

**జడేజా, బుమ్రాలకు రెస్ట్:**
వర్క్ లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా సీనియర్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా, స్పిన్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాలకు టెస్ట్ క్రికెట్ నుంచి రెస్ట్ ఇచ్చారు. వారి స్థానాల్లో గుర్నూర్ బ్రార్, హర్ష్ దూబేలను ఎంపిక చేశారు. జడేజా టెస్టుల్లో ఇప్పటికీ నంబర్ వన్ స్పిన్నర్ అని అగర్కర్ స్పష్టం చేసినప్పటికీ, వన్డేల్లో మాత్రం అతని భవిష్యత్తుపై సస్పెన్స్ నెలకొంది. రాబోయే సౌతాఫ్రికా టూర్ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని టీమిండియా మేనేజ్‌మెంట్ వన్డేల్లో జడేజా కంటే అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్ లాంటి ఇతర యువ బౌలర్ల వైపు చూస్తున్నట్లు హింట్ ఇచ్చింది.

**ఫిట్‌నెస్ ఆధారంగా రోహిత్, హార్దిక్ ఎంపిక:**
వన్డే జట్టులో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ తమ స్థానాలను నిలబెట్టుకున్నారు. కానీ, రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్యాల ఎంపిక వారి ఫిట్‌నెస్‌పై ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా గాయంతో బాధపడుతూ ప్లేయింగ్ ౪× కి దూరంగా ఉన్నాడు. నెట్స్‌లో ఒంటరిగా బ్యాటింగ్ చేస్తూ కనిపిస్తున్నాడు. రోహిత్ శర్మ సైతం ఫామ్‌లో ఉన్నా, 50 ఓవర్ల పాటు ఫీల్డింగ్ చేసేంత ఫిట్‌గా ఉన్నాడా లేదా అనే సందేహాలు ఉన్నాయి. వీరు గనుక ఫిట్‌నెస్ నిరూపించుకోకపోతే టీమ్‌లో మార్పులు ఉంటాయి.

**ఆఫ్ఘనిస్తాన్ సిరీస్‌కు భారత జట్లు ఇవే:**

**టెస్ట్ జట్టు:**
శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్ (వైస్ కెప్టెన్), సాయి సుదర్శన్, రిషభ్ పంత్, దేవదత్ పడిక్కల్, నితీష్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, మానవ్ సుతార్, గుర్నూర్ బ్రార్, ధ్రువ్ జురెల్, హర్ష్ దూబే.

**వన్డే జట్టు:**
శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మలి, విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్ (వైస్ కెప్టెన్), కేఎల్ రాహుల్, ఇషాన్ కిషన్, హార్దిక్ పాండ్యాలి, నితీష్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, అర్షదీప్ సింగ్, ప్రసిద్ధ కృష్ణ, ప్రిన్స్ యాదవ్, గుర్నూర్ బ్రార్, హర్ష్ దూబే.

# ఈడెన్ గార్డెన్స్‌లో హిట్‌మ్యాన్ రచ్చ.. కేకేఆర్ కోచ్‌ను ఇమిటేట్ చేస్తూ క్లీన్ బౌల్డ్ చేసిన రోహిత్

**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026లో కోల్‌కతా నైట్ రైడర్స్ తో జరగబోయే హై-వోల్టేజ్ మ్యాచ్‌కు ముందు ముంబై ఇండియన్స్ జట్టు ఈడెన్ గార్డెన్స్ మైదానంలో ముమ్మరంగా ప్రాక్టీస్ చేస్తోంది. ఈ ప్రాక్టీస్ సెషన్‌లో 'హిట్‌మ్యాన్' రోహిత్ శర్మ తన ట్రేడ్‌మార్క్ హ్యూమర్‌తో సహచర ఆటగాళ్లని మొహాల్లో నవ్వులు పూయించారు. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ ట్రెండ్ అవుతోంది.

**భాయ్.. ఏంటి ఈ హైప్?:**
ప్రాక్టీస్ సెషన్ సమయంలో రోహిత్ శర్మ బౌలింగ్ వేయడానికి సిద్ధమవడంతో ముంబై ఇండియన్స్ ఆటగాళ్లంతా ఒక్కసారిగా అలజడి సృష్టించారు. రోహిత్ బౌలింగ్ ప్రాక్టీస్‌ను విపరీతంగా పొగుడుతూ, కావాలనే పెద్ద 'హైప్' క్రియేట్ చేస్తూ రోహిత్‌ను ఆటపట్టించడం ప్రారంభించారు. దీనిపై హిట్‌మ్యాన్ తనదైన శైలిలో స్పందించాడు. "భాయ్.. ఏంటి ఈ హైప్? అంటే నేనేమైనా రెగ్యులర్ బౌలర్‌నా ఏంటి!" అంటూ హిట్‌మ్యాన్ వేసిన సెటైర్‌కు అక్కడున్న ఆటగాళ్లంతా పొట్టచెక్కలయ్యేలా నవ్వుకున్నారు. ఐపీఎల్ వంటి హై-ప్రెజర్ టోర్నమెంట్‌లో ఇలాంటి సరదా క్షణాలు జట్టు వాతావరణాన్ని తేలికగా పరచడానికి ఎంతగానో సహాయపడతాయి.

**కేకేఆర్ కోచ్ యాక్షన్‌ను దింపేసిన హిట్‌మ్యాన్:**
అక్కడితో ఆగని రోహిత్ శర్మ.. ముంబై మాజీ సహచరుడు, ప్రస్తుత కేకేఆర్ అసిస్టెంట్ కోచ్ అభిషేక్ నాయర్‌ను టార్గెట్ చేశాడు. కేకేఆర్ నెట్స్‌లో ఉన్న నాయర్‌ను గట్టిగా పిలిచిన రోహిత్.. ఆయన మీడియం పేస్ బౌలింగ్ యాక్షన్‌ను అచ్చం అలాగే ఇమిటేట్ (అనుకరిస్తూ) చేస్తూ బౌలింగ్ వేశాడు. ఇక రోహిత్ వేసిన ఆ బంతి నేరుగా వెళ్లి మిడిల్ స్టంప్‌ను ఎగరగొట్టింది. తాను వికెట్ తీశాననే విషయం ఆలస్యంగా గమనించి హిట్‌మ్యాన్ షాక్‌కు గురయ్యాడు. అతడు చేసిన ఈ అల్లరి, ఇమిటేషన్ చూసి అభిషేక్ నాయర్‌తో పాటు ముంబై, కోల్‌కతా క్యాంప్‌లోని ప్లేయర్స్ ఒక్కసారిగా నవ్వేశారు. ముంబై ఇండియన్స్ ఈ ఫన్నీ వీడియోను సోషల్ మీడియాలో పంచుకోగా.. అది కాస్తా నెట్టింట వైరల్‌గా మారింది.

**2027 వరల్డ్ కప్ లక్ష్యం:**
దేశవాళీ క్రికెట్ రోజుల నుంచి రోహిత్ శర్మ, అభిషేక్ నాయర్‌లు అత్యంత ఆప్తమిత్రులు. గౌతమ్ గంభీర్ కోచింగ్ స్టాఫ్‌లో నాయర్ కీలక పాత్ర పోషిస్తున్నారు. రోహిత్ శర్మ 2027 వన్డే వరల్డ్ కప్ ఆడటమే లక్ష్యంగా పెట్టుకోగా.. ఆఫ్ సీజన్‌లో రోహిత్ ఫిట్‌నెస్ సాధించడంలో అభిషేక్ కోచింగ్ ఎంతో సహాయపడింది. అంతటి ప్రాణస్నేహితుడు కావడంతోనే రోహిత్ మైదానంలో అంతలా ఆట ఆటపట్టించాడు.

# పెళ్లిళ్లు పెటాకులు కావచ్చు: వివాహ బంధంపై యువ నటి విరక్తి






బాలీవుడ్ స్టార్ కిడ్, యంగ్ హీరోయిన్ సారా అలీ ఖాన్ వివాహ బంధంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను నటించిన తాజా సినిమా ప్రమోషన్లలో భాగంగా వివాహ బంధంపై మాట్లాడిన సారా.. పెళ్లిళ్లు పెటాకులు కావొచ్చునని సంచలన వ్యాఖ్యలు చేసారు. తాను పెళ్లిని కేవలం ఒక అందమైన ఊహలా చూడనని, చాలా ప్రాక్టికల్ కోణంలోనే వీక్షిస్తానని క్లారిటీ ఇచ్చారు. తన వ్యక్తిగత జీవితంలో వివాహ బంధాలు విచ్ఛిన్నమవ్వడం కళ్లారా చూసినందువల్లే తనకు ఇలాంటి ఆలోచనలు వచ్చాయని ఆమె ఓపెన్ అయ్యారు.ఆయుష్మాన్ ఖురానా, రకుల్ ప్రీత్ సింగ్, వామిఖా గబ్బిలతో కలిసి ఆమె నటించిన -పతి పత్ని ఔర్ వో దో- చిత్రం మే 15న విడుదలై.. కేవలం మూడు రోజుల్లోనే దేశవ్యాప్తంగా 17.53 కోట్ల నెట్ కలెక్షన్లతో మంచి ఓపెనింగ్స్ సాధించింది. ఈ సినిమా ప్రచార కార్యక్రమాలలో పెళ్లి, వ్యక్తిగత జీవితం గురించి సారా ఘాటుగా మాట్లాడింది.

సారా అలీ ఖాన్ తల్లిదండ్రులైన సైఫ్ అలీ ఖాన్, అమృతా సింగ్‌లు 1991లో పెళ్లి చేసుకుని.. 13 ఏళ్ల వైవాహిక జీవితం తర్వాత 2004లో విడాకులు తీసుకున్నారు. ఆ తర్వాత సైఫ్ అలీ ఖాన్ మరో నటి కరీనా కపూర్‌ను రెండో వివాహం చేసుకోగా.. సారా తల్లి అమృతా సింగ్ మాత్రం పిల్లల బాధ్యతలు చూసుకుంటూ ఒంటరిగానే ఉండిపోయారు. ఈ చేదు నిజాలను దగ్గరగా చూసిన సారా.. పెళ్లిళ్లు కొన్నిసార్లు అనుకోని విధంగా పెటాకులు కావచ్చునని... అందుకే తొందరపడి బంధాలలోకి దూకడం కంటే వేచి చూడటం మంచిదని అభిప్రాయపడ్డారు. తప్పుడు నిర్ణయాలు తీసుకుని ఇబ్బంది పడటం కంటే... జీవితానికి సరిపోయే -కరెక్ట్- వ్యక్తి కోసం ఎంత కాలమైనా నిరీక్షించడమే ఉత్తమమని సారా స్పష్టం చేశారు.

కేవలం సమాజం కోసం లేదా ఒక భాగస్వామి ఉండాలి కదా అనే కారణంతో పెళ్లి చేసుకోవడం తనకు అస్సలు ఇష్టం లేదని సారా కుండబద్దలు కొట్టారు. ఒకవేళ సరైన వ్యక్తి దొరకకపోతే జీవితాంతం పెళ్లి చేసుకోకుండా ఒంటరిగా ఉండటానికి కూడా తాను మానసికంగా సిద్ధమేనని ప్రకటించారు. తన జీవితంలో ఏదో వెలితి ఉందని... దాన్ని పూర్తి చేయడానికి మరొకరు రావాల్సిన అవసరం లేదని.. తనలో తాను ఒక సంపూర్ణ వ్యక్తిగా ఎదగడమే తన ప్రస్తుత లక్ష్యమని చెప్పారు. తనను తాను ఒక -గ్రీన్ ఫ్లాగ్-గా అభివర్ణించుకున్న ఈ యంగ్ బ్యూటీ.. తన అస్తిత్వాన్ని గౌరవించే వ్యక్తి దొరికినప్పుడే పెళ్లి గురించి ఆలోచిస్తానని... ప్రస్తుతానికి కేవలం సినిమాలు, కెరీర్‌పైనే శ్రద్ధ పెట్టాలనుకుంటున్నట్లు వెల్లడించారు.

సారా అలీ ఖానే కాదు.. ప్రస్తుత బాలీవుడ్‌లో మెజారిటీ యంగ్ కథానాయికలు వివాహ వ్యవస్థ విషయంలో సరైన లేదా సానుకూల అభిప్రాయాన్ని కలిగి లేరనే విమర్శలు వినిపిస్తున్నాయి. గ్లామర్ ప్రపంచంలో నిత్యం చూసే విడాకులు, విచ్ఛిన్నమవుతున్న సెలబ్రిటీల బంధాలు చూసి నేటి తరం నటీమణులు పెళ్లి విషయంలో ఒక రకమైన విరక్తిని, అపనమ్మకాన్ని పెంచుకుంటున్నారు. సాంప్రదాయ వివాహ వ్యవస్థ ఇచ్చే భద్రత కంటే తమ సొంత కెరీర్, ఆర్థిక స్వాతంత్ర్యం, వ్యక్తిగత స్వేచ్ఛకే వారు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారు. పెళ్లిని జీవితంలో ఒక భాగస్వామ్యంగా కాకుండా తమ ఎదుగుదలకు అడ్డుపడే ఒక బంధనంగా భావించే ధోరణి నేటి బాలీవుడ్ హీరోయిన్లలో స్పష్టంగా కనిపిస్తోంది.



షామా సికిందర్ తన బీచ్‌సైడ్ గ్లామ్ లుక్‌తో మంటలను సృష్టించి

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965